

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



visit us @ http://epaper.suryaa.com
సంపుటి 12 | సంచిక 64
మంగళవారం | 1 జనవరి 2019 | హైదరాబాద్
| పేజీలు 12+16 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళ పక్ష తిథి : ఏకాదశి తె.3.56, నక్షత్రం. స్వాతి మ.12.00 వర్జ్యం సా.5.30 నుంచి 7.06 వరకు
రాహుకాలం: మ.3.00 నుంచి 4.30 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.24 నుంచి 9.12 వరకు, తిరిగి రా.10.46 నుంచి 11.36 వరకు, సూర్యోదయం : ఉ.6.34 గం; సూర్యాస్తమయం: సా.5.38

ఫిలిప్పైన్స్‌లో ఉస్మాన్ తుపాను బీభత్సం



- 68కి చేరిన మృతుల సంఖ్య • ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం • 17 మంది గల్లంతు • 40 వేల మంది నిర్వాసితులు • భారీ వర్షాలు కురవటంతో వరద ఉప్పెన • భారీ వర్షాలతో సహాయక చర్యలకు విఘాతం

మణిలా: క్రిస్మస్ పండుగ తరువాత ఫిలిప్పైన్స్‌ను కుదిపేసిన తుపాను బీభత్సంలో మరణించిన వారి సంఖ్య సోమవారం నాటికి 68కి చేరింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని ఫిలిప్పైన్స్ సివిల్ డిఫెన్స్ అధికారులు చెప్పారు. రాజధాని మణిలా నగరానికి ఆగేయ దిశలో వున్న బైకాల్ పర్వత ప్రాంతంలో దాదావు 57 మంది మరణించగా, ఫిలిప్పైన్స్ సెంట్రల్‌లో వున్న సమార్ దీవిలో మరో 11 మంది మరణించారని, వీరిలో అధిక శాతం మంది కొండచరియలు విరిగి పడటం, నీట మునగటం ద్వారా మృత్యువాత పడ్డారని అధికారులు చెప్పారు. తుపాను విధ్వంసం సృష్టించిన ప్రాంతాలు ఇంకా క్లియర్ కాకపో వటంతో వాటిని శుభ్రపరిచే పనిలో వున్నామని, ఆ ప్రాంతాలు క్లియర్ అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం వుందని బైకాల్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ క్లాడియో యూకాట్ చెప్పారు. వాతా వరణశాఖ అధికారులు ఉస్మాన్ అని పేరు పెట్టిన ఈ తుపాను ఫిలిప్పైన్స్‌ను శనివారం తాకి ంది. కొన్ని ప్రాంతాలలో కొండచ రియలు విరిగి పడ్డాయి. ఇప్పటి వరకూ 17 మంది జాడ తెలి యటం లేదని, దేశవ్యాప్తంగా దాదావు 40 వేల మంది నిర్వాసితులయ్యారని ఆయన వివరించారు.

ఆ ప్రభావాన్ని మదించలేదు



11లో

- జిఎస్‌టి, డీమో నిర్ణయాలపై కేంద్రం వ్యాఖ్య • లోక్‌సభలో ప్రభుత్వం • ఓవైసి ప్రశ్నకు జవాబు

రైతులే కీలకం


ప్రతి పంటకు డిమాండ్ వచ్చేలా చర్యలు : కేసీఆర్



- రైతులను సంఘటితం చేస్తే సత్ఫలితాలు • ఆహార, వ్యవసాయంలో సమస్యలను అధిగించాలి • పంట మార్పిడిపై అవగాహన కల్పించాలి • రాష్ట్రాన్ని పంటల కాలనీలుగా విభజించాలి • ముఖ్యమంత్రి కేసీఆర్

ఆహార, వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు విషయాల్లో సరైన గణాంకాలు లేనందున రకరకాల సమస్యలు తలెత్తుతున్నాయని, వీటిని అధిగమించాల్సిన ఆవశ్యకత ఉందని, రైతుల సంప్రదాయబద్ధమైన కొన్ని అలవాట్లలో కొంత మార్పు రావలసిన అవసరం ఉందని అన్నారు.

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రైతులందరూ ఒకే రకమైన పంటలు వేయటం వల్ల జరిగే లాభనష్టాలను క్షణ్ణంగా అధ్యయనం చేయాలని, రైతులను సంఘటిత పరచటం ద్వారానే గొప్ప ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి కల్వకంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఖచ్చితంగా పంటల కాలనీగా విభజించాలని, రైతు పండించే ప్రతి పంటకు డిమాండ్ లభించేలా చూడాలని, రాష్ట్రంలో నెలకొల్పబోయే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ప్రభుత్వ పరంగా నమ్మకమైన, కల్తీ రహిత బ్రాండెడ్ ఉత్పత్తులు జరగాలని సీఎం ఆదేశించారు. రైతులు నియంత్రణా విధానం లోనే పంటలు పండించాలని ముఖ్య మంత్రి అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల మీద కోట్లాదిమంది అధారపడి వున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా ఆ శాఖలు పనిచేయాలని, దేశం మొత్తంలోనే ఉత్తమమైన వ్యవసాయ, ఉద్యానవన, ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులలో తెలంగాణ అగ్రభాగన వుండా లని సిఎం అన్నారు. రైతులను మిగతా 6లో



హ్యాపీ న్యూ ఇయర్ : కేసీఆర్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ ప్రజలకు సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు పోవాలని సీఎం ఆకాంక్షించారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని సీఎం కేసీఆర్ కోరారు.

షేక్ హసీనా హ్యాట్రిక్ విజయం



11లో

- నాలుగోసారి ప్రధానిగా ఎన్నిక • అధికార కూటమి మహాజోట్‌కు 288 స్థానాలు

రాజ్యసభలో గందరగోళం



- ట్రిపుల్ తలాక్ బిల్లుకు బ్రేక్ • బిల్లును అడ్డుకున్న విపక్ష సభ్యులు • బిల్లును సెలెక్ట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని డిమాండ్ • ప్రభుత్వానికి సవాల్‌గా మారిన బిల్లు • దేశవ్యాప్తంగా బిల్లుపై పెద్ద ఎత్తున చర్చలు • రాజ్యసభలో సెలెక్ట్ కమిటీ వేయాలన్న తృణమూల్ కాంగ్రెస్ • తలాక్ చెప్పిన భర్తకు జైలు శిక్ష సరికాదంటున్న విపక్షాలు

వివరాలు 6లో

ముహూర్తం 'పక్కా'

- కలిసొచ్చిన గ్రహాలు, యాగాలు • సంక్రాంతి పండుగ తరువాత కేబినెట్? • పకడ్బందీ 'జట్టు'కోసం కూర్పు • భారీగా ఆశావహులు • ప్రతి జిల్లాలో ముగ్గురు, నలుగురు పోటీ • 16 మంది జట్టు ఎంపికకు కసరత్తు



హైదరాబాద్, సూర్య ప్రధాన ప్రతినిధిః ఏ పని చేసినా..ఏ కార్యక్రమం ప్రారంభించినా పక్కా ముహూర్త బలంతో ముందుకు వెళ్లే సీఎం కేసీఆర్ కేబినెట్ 'జట్టు' కోసం పకడ్బందీగా కూర్పు చేస్తున్నారు. రెండో సారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన కేసీఆర్ ఈ సారి తన కేబినెట్‌లో పనిచేసేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అర్హతతో పాటు వారి వ్యక్తిగతజీవితం, ప్రజల్లో ఉన్న అభిప్రాయాలన్నింటిని క్రోడీకరించి 'జట్టు'ను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఈ సారి ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన సీఎం కేసీఆర్ తన కేబినెట్ జట్టు మిగతా 6లో



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు సూర్య నూతన సంవత్సర శుభాకాంక్షలు

– సూర్య యాజమాన్యం

భావోద్వేగ వాతావరణం

- కన్నీటి పర్యంతమైన కొందరు • అమరావతికి వెళుతున్న వారికి టీఎస్ న్యాయవాదుల ఆత్మీయ



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ఉమ్మడి హైకోర్టులో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఇదిలావుండగా సహచర ఉద్యోగులు తరలివెళ్లి పోతుండటంతో హైకోర్టు వద్ద ఉద్విగ్న పరిస్థితి నెలకొంది. కొందరు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు తమ జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. 2019, జనవరి 1 నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వేర్వేరు హైకోర్టులు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఏపీ ఉద్యోగులు అమరావతికి తరలివెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి 900 మంది ఏపీ ఉద్యోగులు అమరావతికి మిగతా 6లో

అంతే ఇంతే!



16 సీట్ల అభ్యర్థుల్ని ముందుగానే ప్రకటించింది నూతన సంవత్సర కానుక ఇవ్వండి సార్

ఉద్దానానికి అభయం

- కిడ్నీ బాధితులకు రూ.10 వేల పెన్షన్ • ఉద్దానంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ • అధికారంలోకి రాగానే నెరవేరుస్తా • పాదయాత్రలో వై.ఎస్. జగన్ హామీ • దారి పొడవునా విన్నపాలతో జగన్‌కు ప్రజల స్వాగతం

(శ్రీకాకుళంనుంచి సూర్య పొలిటికల్ బ్యూరో ప్రత్యేక ప్రతినిధి) : నేనొస్తా...అందరినీ ఆదుకొంటానంటూ పాదయాత్రలో అభయమిస్తున్న వైసీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నోట ఉద్దనంకు భరోసా మాట దక్కంది. తాను అధికారంలోకి వస్తే కిడ్నీ బాధితులకు రూ.10వేల పెన్షన్‌తోపాటు, ఉద్దనంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానని వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. తాను అధికారంలోకి రాగానే తాను ఈ హామీని నెరవేర్చుతానని చెప్పారు. మరోవైపు వై.ఎస్.జగన్ పాదయాత్రలో ఉండగానే మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి టీడీపీన వీడి తిరిగి వైసీపీలో చేరారు. ఆయన్ని పార్టీ కండువకప్పి వై.ఎస్.జగన్ పార్టీలోకి ఆహ్వానించారు. ఇలా చేరికలతోపాటు ప్రజలు సమస్యలతో స్వాగతం మిగతా 6లో



తొలి వేడుకలు న్యూజిలాండ్‌లో




- అంబరాన్ని తాకిన సంబరాలు • ఆక్లాండ్ స్కై టవర్ వద్ద జన సందోహం • ఆనందంగా నూతన సంవత్సరానికి స్వాగతం • ఆస్ట్రేలియాలోనూ న్యూ ఇయర్ వేడుకలు

వివరాలు 6లో

ఫలితం ట్యాంపరైంది

- అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ అక్రమాలకు పాల్పడ్డారు • పోలింగ్, కౌంటింగ్‌లలో ఓట్ల తేడాలున్నాయి • 4 గంటల తరువాత భారీగా పోలింగ్ పెంచేశారు • ఏఐసీసీ ఇన్‌చార్జి కుంతియా



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్‌పార్టీ మోసం చేసి గెలిచిందని టీపీసీసీ ఇంచార్జ్ కుంతియా ఆరోపించారు. ప్రజల తీర్పుతో గెలువలేదని, ఈవీఎంల ట్యాంపరింగ్‌తో గెలిచారని మరోసారి స్పష్టం చేశారు. గొల్కొండ హోటల్‌లో కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం అనంతరం కుంతియా మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో లక్షల ఓట్లు గల్లంతయ్యాయన్నారు. 22లక్షల ఓట్లు గల్లంతయ్యాయని రజత్ కుమార్ క్షమాపణ కోరిన విషయాన్ని గుర్తుచేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 22లక్షలమందికి లేకుండా చేశారన్నారు. ఈసీ అంటున్న మాటలే అక్రమాలకు తావిస్తుందన్నారు. ఎన్నికల్లో ముమ్మాటికి ఏవిఎం ల ట్యాపరింగ్ జరిగిందని కుంతియా అన్నారు. మునుపెన్నడు లేని విధంగా పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లకు, కౌంటింగ్ చేసిన ఓట్లకు చాలా తేడా ఉందని, ఇందుకు కారణాలేంటని? ప్రశ్నించారు. ఇలాంటిది మునుపెన్నడు జరగలేదని, దీనిపై ఎన్నికల సంఘం సరైన సమాధానం ఇవ్వడంలేదన్నారు. ప్రభుత్వం రద్దు చేసిన తరువాత ఎలక్షన్ లు ఎప్పుడు వస్తాయో కేసీఆర్ ఎలా మిగతా 6లో

ప్రజలిచ్చిన తీర్పుతో ప్రభుత్వ బాధ్యత పెరిగింది

మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: గత నాలుగున్నర ఏళ్ళ పాలనలో అద్భుతమైన ప్రగతి సాదించుకొని, మరోసారి తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో మళ్ళీ టి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి, కేసీఆర్ సీఎం అయ్యారని, ప్రజలిచ్చిన ఈ తీర్పు ప్రభుత్వం పై మరింత బాధ్యత పెంచిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆయన 2019 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కడియం మాట్లాడుతూ కోటి ఆశలు, అనేక లక్ష్యాలతో మొదలయ్యే ఈ కొత్త సంవత్సరం 2019 అందరి ఆకాంక్షలు, కోరికలు నెరవేర్చాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టే మహా యజ్ఞంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. గత నాలుగున్నర ఏళ్ళ సీఎం కేసీఆర్ పాలనలో దేశం అబ్బురపడేలా, మేనిఫెస్టోలో చెప్పని అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన ఘనత సాధించామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన మేనిఫెస్టోని భగవద్గీతగా భావించి, ప్రజల బాగోగుల కోసం తప్ప వేరే ఆలోచన లేకుండా పని చేసే సీఎం కేసీఆర్ పాలనకు ఈ 2019 సంవత్సరం మరోసారి శుభారంభం కానుందని ఆకాంక్షించారు. తెలంగాణలో రైతు ను రాజు చేసి, వ్యవసాయాన్ని పండగ చేసి, తెలంగాణని కోటి ఎకరాల మాగాణి చేసేందుకు సీఎం కేసీఆర్ తలపెట్టిన ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేసి తెలంగాణ తల్లికి పచ్చల హారం బహుమతిగా ఆయన అందిస్తారనే విశ్వాసం సంపూర్ణంగా ఉందన్నారు. రేపటి బంగారు తెలంగాణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై ప్రతి ప్రయోజనాన్ని అందించే లక్ష్యంలో ఈ 2019 సంవత్సరం శుభారంభం అవుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి ఆకాంక్షించారు.





వెలమ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరిస్తున్న సూర్య తదినపత్రిక అధినేత నూకారపు సూర్యప్రకాశరావు,కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొల్లు బాబురావు, ఉపాధ్యాక్షులు బంకురు భాస్కరరావు,బడే రామారావు నాయుడు, కసిరెడ్డిలక్ష్మణ కుమార్, ప్రధాన కార్యదర్శి వ్రి ప్రభాకర్‌రావు,కార్యదర్శిపోలా నగిరేష్ నాయుడు, కోశాధికారి చింతల వెంకట అప్పారావు,ఆర్గనైజింగ్ సెక్రటరిటీలు దేశిల్లి లక్ష్మీనారాయణ, గండి శ్రీనివాసరావు, గొట్టాపు వెంకటరావు, రావాడ రమణ, గొల్లు చాణిక్య, కొల్లి పాపినాయుడు, సెక్రటరి కల్చరల్ పోగ్రామ్స్ అల్లు ప్రసాద్, చొక్కాపు వెంకటరమణ, ఆర్గనైజింగ్ సెక్రటరిటీ దాసరి వెంకటరమణ, జాయింట్ సెక్రటరి కిలపర్తి వెంకటేశ్వరరావు, బర్ల రామకృష్ణ, యాండపు వేణు గోపాల్, అడ్వైజర్ సోనేని రవికుమార్, తదితరులు

హైదరాబాద్,సూర్యబ్యూరో:

నూతన సంవత్సరంలో ప్రత్యేక హోదా



విజయవాడ, మేజర్‌న్యూస్‌: కొత్త సంవత్సరంలో ఏపీకి ప్రత్యేక హోదా వచ్చి తీరుతుందని ఏపీ పీసీసీ అధికార ప్రతినిధి ఏలూరి రామచంద్రారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని చెప్పారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాక తొలిసంతకం ఏపీకి ప్రత్యేక హోదాపైనే చేస్తారని ఆయన పేర్కొన్నారు. సోమవారంనాడు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వల్ల దేశానికి సుస్థిరపాలన అందుతుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ వస్తేనే ఏపీలోని వెనకబడ ప్రకాశంజిల్లాకు వరప్రదాయిన అయిన వెలుగొండ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. వెలుగుగొండ ప్రాజెక్టుపై టీడీపీ సర్కార్ రెండు నాల్కల ధోరణిని అవలంభిస్తోందని ఆయన విమర్శించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పశ్చిమ ప్రకాశం ప్రాంతమంతా ఎడారిగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేయడమే ఏకైక మార్గమన ఆయన చెప్పారు. ప్రకాశం జిల్లా వెనకబాటును నివారించేందుకు ప్రత్యేక ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందుకోసం త్వరలోనే తాను వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

'ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి'త



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ ప్రజలకు తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పాలకులకు స్ఫూర్తికలుగ జేయాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, అంతా మంచి జరగాలని భగవంతుడిని రమణ కోరారు.

న్యాయపోరాటం చేస్తాం

తక్కువ ఓట్లతో ఓడినా వీవీప్యాట్‌లను లెక్కించలేదు

- సీఈసీ సమాధానం చెప్పాలి
- పార్లమెంట్ ఎన్నికలపై చర్చించాం
- బీసీలకు న్యాయం జరిగేవరకు పోరాటం
- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానా, పొన్నాల



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ధర్మపురి ,ఇబ్రహీంపట్నం ,కోదాడ లాంటి తక్కువ మార్జిన్ తో ఓడిపోయిన స్థానాల్లో వీవీ ప్యాట్‌లను ఎక్కించకపోవడంపై న్యాయపోరాటం చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారంనాడు గోల్కొండ హోటల్‌లో కాంగ్రెస్‌పార్టీ ముఖ్యనేతలతో పార్టీ రాష్ట్ర ఇంచార్జీ కుంతీయా అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సమావేశానికి పార్టీకి చెందిన సీనియర్ నేతలు, ఇటీవల అసెంబ్లీలో ఓటమిపాలైన పలువురు నేతలు హాజరయ్యారు. సమావేశం అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ముందుగా నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గెలిచిన, ఓడిపోయిన ఎమ్మెల్యేలు రానున్న పంచాయతీ ఎలక్షన్ కాంగ్రెస్ పార్టీ గెలుపు పై బాధ్యత తీసుకుంటామని తెలిపారన్నారు. అని తెలిపారు. పంచాయితీ ,పార్లమెంట్ ఎన్నికలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సమీక్షించినట్లు చెప్పారు. వచ్చే పార్లమెంట్, పంచాయితీ ఎన్నికల్లో పార్టీ ఎలా వెళ్లాలని చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలు, ఓడిపోయిన అభ్యర్థులు ఇంచార్జ్ లుగా ఉంటారని చెప్పారు. పంచాయితీల్లో బీసీ రిజర్వేషన్ తగ్గించి తీవ్ర అన్యాయం ప్రభుత్వం చేస్తున్నదని దుయ్యబట్టారు. బీసీలకు గతంలో మాదిరిగా పంచాయితీల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు, బీసీలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్‌పార్టీ పోరాటం చేస్తుందన్నారు. తక్కువ ఓట్లతో ఓడిపోయిన నియోజకవర్గాలలో వీవీ ప్యాడ్స్ ఎందుకు లెక్కించడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా ఎందుకు లెక్కించడం లేదో ..ఈసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వీవీ ప్యాట్‌ల లెక్కింపునకు సీఈఓ ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. గెలిచి ఇరవైరోజులు అయినా కేసీఆర్ ..ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించకపోవడం ఆశ్చర్యం కల్గిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి నూనత సంవత్సరం సందర్భంగా పార్టీ సీనియర్‌నేత జానారెడ్డి శుభాకాంక్షలు. ప్రభుత్వం లో ఉన్న లేకపోయినా పార్టీ నిర్మాణం విషయంలోనే మీటింగ్ ఏర్పాటు జరిగిందని జానారెడ్డి తెలిపారు.పంచాయతీ ఎలక్షన్ లో ఏవిధంగా ముందుకు వెళ్లాలని అన్న విషయం పై చర్చించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య విధానాల మీద పాలన నడవాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. మెజార్టీ ప్రజల ఆకాంక్ష లకు వ్యతిరేకంగా పాలన నడుస్తున్నదని ఆరోపించారు. ప్రజల ఆకాంక్ష లకు అనుగుణంగా పాలన జరగాలని కోరుకుంటునన్నారు.

> రెండేళ్ల వరకు ఏం మాట్లాడను..!
> ఇన్నాళ్లు మీకోసం..ఇక నాకోసం మాట్లాడను
> –రేవంత్ రెడ్డి
> ...కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఏ.రేవంత్‌రెడ్డి సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. రెండేళ్ల వరకు మీడియాతో మాట్లాడబోనంటూ శపథం చేశారు. ఇన్నాళ్లు మీకోసం (మీడియా)కోసం మాట్లాడానని, ఇకపై నా కోసం మాట్లాడటం మానేస్తున్నానని తెలిపారు. గొల్కొండ హోటల్‌లో పార్టీ సీనియర్ నేతల సమావేశానికి హాజరైన ఆయనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఈ మాటలన్నారు.

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : హరీష్ రావు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్ర ప్రజలకు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరిశ్ రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ప్రజలకు అంది, వారు సుఖంగా సంతోషంగా ఉండాలని...నూతన సంవత్సరం ఎన్నో ఆశయాలు లక్ష్యాలను సాధించి..సరి కొత్త ఆలోచనలతో ముందుకు పోవాలని ఆకాంక్షించారు.. గత ఏడాదిలో అద్భుతమైన ప్రగతి సాదించుకున్నాం అని.. దానికి నిదర్శనం మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వం టి ఆర్ ఎస్ పార్టీ అధికారం లోకి రావడం..ఈ ఏడాది కూడా సీఎం కేసీఆర్ నాయకత్వం లో అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని.కాళేశ్వరం ప్రాజెక్టు తో కోటి ఎకరాల మాగాణి రాష్ట్రంగా సస్యశ్యామలం కావలన్నారు.నూతన సంవత్సర వేడుకలు ప్రజలందురు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రధానితో రాజ్యాంగపరమైన సంబంధాలే



- రాజకీయ సంబంధాలు ఏనాడూ లేవు
- కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు జవాబు చెప్పని బాబు
- మాజీమంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: ప్రధాని మోడీతో, బీజేపీతో టీఆర్ఎస్‌కు ఎపుడూ రాజకీయ సంబంధాలు లేవని, కేవలం రాజ్యాంగ బద్దమైన సంబంధం మాత్రమే ఉన్నదని మాజీమంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్‌లు అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పూటకో విధానంతో ముందుకు పోతున్నారని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు పరిస్థితి చూస్తుంటే ఆ రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో తెలిసి పోతోందన్నారు. తెలంగాణ భవన్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్‌లు మీడియాతో మాట్లాడుతూ ఓటమి కి బాబు ఇప్పట్నుంచే సాకులు చెబుతున్నట్టు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు బాబు సమాధానం చెప్పకుండా ఏవేవో మాట్లాడుతున్నారంటూ విమర్శించారు. బాబు ను ఎదుర్కొనేందుకు ముగ్గురు మోడీలు అవసరం లేదని, ఏపీ ప్రజలు చాలన్నారు. హై కోర్టు పై అఫిడవిట్ గురించి చంద్రబాబు ను మాట్లాడమని కెసిఆర్ అడిగితే వేరేది మాట్లాడుతున్నారన్నారు. ఎన్టీఆర్ ను దించేందుకు కెసిఆర్ సూత్రధారి అయితే కెసిఆర్ యే అపుడు సీఎం అయ్యేవారు కదా అని ప్రశ్నించారు. చంద్రబాబు తన అబద్దాలతో ఏపీ ప్రజలను వంచిస్తున్నారని మండిపడ్డారు. కెసిఆర్ తెలంగాణ కోసం గొంగళి పురుగు నైనా ముద్దు పెట్టుకుంటానని అన్నారని పేర్కొన్నారు. 2004 లో కాంగ్రెస్ తో 2009 లో టీడీపీ తో పొత్తు పెట్టుకున్నది తెలంగాణ కోసమేనని చెప్పారు. తెలంగాణ కోసం అన్ని పార్టీ లను ఒప్పించిన ఘనత కెసిఆర్ దేనని చెప్పారు. చివరకు చంద్రబాబు ను తెలంగాణ కోసం ఒప్పించే, టీడీపీతో కెసిఆర్ పొత్తు పెట్టుకున్నారన్నారు. 2004 లో చంద్రబాబు ను బండకేసి కొట్టింది కాంగ్రెస్ , టీఆర్ఎస్ పొత్తేనన్నారు. 2009 లో తో పొత్తుకు ముందుకు వచ్చింది టీడీపీ యేనని పేర్కొన్నారు. చంద్రబాబు టీడీపీ సహా 36 పార్టీలను తెలంగాణ కోసం ఒప్పించిన ఘనత కెసిఆర్‌దన్నారు. చంద్రబాబే కెసిఆర్ దారిలోకి వచ్చారని, కెసిఆర్ బాబు దారిలోకి వెళ్లలేదన్నారు. కెసిఆర్ తన ప్రెస్ మీట్ లో బాబు తో పాటు మోడీ ని ఎండగట్టారని గుర్తు చేశారు. మొన్నటి ఎన్నికల్లో మోడీ కెసిఆర్ దోస్తీ అంటూ బాబు ఎంత చెప్పినా ప్రజలు టీఆర్ఎస్ ను ఆదరించారని పేర్కొన్నారు. రేపు ఏపీ లో కూడా అదే జరుగుతుందన్నారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం చంద్రబాబు లాగా కెసిఆర్ అబద్దాలు చెప్పలేదన్నారు. గోబెల్స్ ఆశ్చర్యపడే రీతి లో బాబు అబద్దాలు ఆడుతున్నారని విమర్శించారు. గోబెల్స్ సిదంతాలను తెలంగాణ తిరస్కరించిందని, ఏపీ కూడా తిరస్కరిస్తుందన్నారు. రాష్ట్రాలు విడి పోయినా హై కోర్టు ఎందుకు కలిసి ఉండాలన్న కారణాన్ని బాబు చెప్పలేక పోయారన్నారు. నాలుగున్నరేళ్లలో హై కోర్టు భవనం కూడా బాబు కట్టలేక పోయారంటూ ఎద్దేవా చేశారు. కెసిఆర్ తో చంద్రబాబు అభివృద్ధిలో పోటీ పడలేరని, ఎవరిని అడిగినా తెలంగాణ అభివృద్ధి గురించి చెబుతారన్నారు. మోడీ ,జగన్ లతో ఎలా వ్యవహరించాలో కెసిఆర్ కు తెలుసునన్నారు. పక్క రాష్ట్రాలతో సంబంధాల విషయం లో కెసిఆర్ రాజకీయ పరిణతి తో వ్యవహరించారని, మహారాష్ట్ర తో సాగునీటి ఒప్పందం ఒక్కటి చాలు కెసిఆర్ రాజకీయ పరిణతి తెలుసుకోవడానికని పేర్కొన్నారు. చంద్రబాబు కెసిఆర్ తో పాలన లో పోటీ పడాలని సూచించారు.

కెసిఆర్ బూచి చూపించి ఏపీ లో ఓట్లు పొందాలనుకుంటే అది బాబు తెలివి తక్కువ తనమే అవుతుందన్నారు. బాబు బాబ్లీ తరహా రాజకీయాలు అందరికీ తెలుసునన్నారు.

పచ్చదనం పరచుకోవాలె!



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః హెచ్ఎండీఏ పరిధిలో పెద్ద ఎత్తున పచ్చదనం పెంపు కార్యక్రమం చేపట్టాలని హెచ్ఎండీఏ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. పచ్చదనం పెంపు ప్రణాళికలపై ప్రగతి భవన్‌లో సీఎం సమీక్ష నిర్వహించారు. దేశంలోని ఇతర నగరాల మాదిరిగా హైదరాబాద్ కూడా కాంక్రీట్ జంగిల్ కారాదన్న ఆయన .. ఇక్కడ నివసించే వారు ప్రశాంతంగా జీవించడంతో పాటు భవిష్యత్ తరాలు సంతోషంగా జీవించేలా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ పరిధిలో వీలైనంత ఎక్కువ పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాకర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలు వారికే అప్పగించాలని సూచించారు. హైదరాబాద్ నుంచి మెదక్‌కు గతంలో ఉన్న తరహాలో అటవీప్రాంతాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి తెలిపారు. బాహ్య వలయ రహదారి చుట్టూ పచ్చదనం అభివృద్ధి కోసం అటవీశాఖతో కలిసి సమీకృత ప్రణాళిక రూపొందించాలని సూచించారు. హెచ్ఎండీఏ పరిధిలో పచ్చదనం పెంపునకు అధికారులు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు.ఇందుకుగాను కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆయన ఆదేశించారు. ఈసమావేశంలో హెచ్ఎండీఏ కమీషనర్ జనార్థన్‌రెడ్డి, పబ్లిక్‌హెల్త్ ఇఎన్‌సీ ధన్‌సింగ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేకపోతున్న చంద్రబాబు : నోముల



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి, చంద్రబాబు నాయుడు ఓర్చుకోలేకపోతున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అన్నారు. కేసీఆర్ ధాటికి మహామహులే మట్టికరిచారని అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తున్నారని వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబును జామాత దశమగ్రహం అని ఎన్టీఆరే అన్నారని ఆయన గుర్తు చేశారు.

అలాగే టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీజేఎస్ అధినేత కోదండరాం బీసీలపై మొసలి కారుస్తున్నారని నోముల నర్సింహయ్య అన్నారు. బీసీల అభివృద్ధిపై ఉత్తమ్ బహిరంగ చర్చకు సిద్ధమా..? నోముల సవాల్ విసిరారు. పంచాయతీ ఎన్నికలకు కోర్టు నిర్ణయించిన రిజర్వేషన్లనే ఫైనల్ చేశామని, తమిళనాడు తరహాలో రిజర్వేషన్ల సాధనకు అన్ని పార్టీలు సహకరించాలని అన్నారు. కాంగ్రెస్‌కు దమ్ముంటే చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం అన్ని రాష్ట్రాల్లో తీర్మానాలు చేయించాలని నోముల నర్సింహయ్య డిమాండ్ చేశారు.

గ్రామపంచాయతీ ఎన్నికలకు లైన్ క్లియర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్రంలో నిర్వహించాలనుకుంటున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు లైన్ క్లియర్ అయింది. గ్రామపంచాయతీల రిజర్వేషన్ల వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంచాయతీరాజ్‌శాఖ పంపించింది. అధే విధంగా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని స్టేట్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాసింది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మరో రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

టార్గెట్ వివేక్ : కారులో కోవర్టుల రగడ



వివేక్‌పై టీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదులు

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: ఎక్కడైనా.. ఎప్పుడైనా ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ పరాజయానికి దారితీసిన అంశాలపై సమీక్షించుకుంటుంది. నెగ్గిన పార్టీ విజయోత్సవాలు చేసుకుంటుంది. కానీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్‌లో మాత్రం సీన్ రివర్స్‌గా ఉంది. టీఆర్ఎస్ ఇప్పుడు పోస్టుమార్టం మొదలు పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ద్రోహం చేసిన వారిపై చర్యలు తీసుకునేపనిలో పడింది. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన నేతల జాబితాలు తయారు చేస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది.

కొప్పుల ఓటమి కోసం రూ. 3కోట్లు:

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసివారిని గుర్తించే పనిలో పడ్డారు ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ నేతలు. విస్తృతస్థాయి సమావేశాలను ఇందుకు వేదికగా మార్చుకున్నారు. పార్టీలో ఉన్న కోవర్టులను ఏరి పారేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక్క సీటు మినహా మిగిలిన అన్ని స్థానాల్లో టీఆర్ఎస్ విజయం సాధించింది. గెలిచిన నియోజకవర్గాల్లో కూడా కొందరు నేతలు పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినట్టు ఆరోపణలు వచ్చాయి. లేకపోతే మెజార్టీ ఇంకా ఎక్కువ వచ్చేదన్న వాదాన్ని సమావేశాల్లో లేవనెత్తుతున్నారు. పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ టీఆర్ఎస్ శ్రేణులన్నీ ఇప్పుడు వివేక్‌ను టార్గెట్ చేస్తున్నాయి. ధర్మపురి నియోజకవర్గ టీఆర్ఎస్ సమావేశంలో ఈ అంశంపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వివేక్ సహకరించకపోవడం వల్లే కొప్పుల ఈశ్వర్ స్వల్ప మెజారిటీతో గట్టెక్కారని కార్యకర్తలు ప్రస్తావించారు. ఈశ్వర్‌ను ఓడించేందుకు వివేక్ మూడు కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. వివేక్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇండిపెండెంట్‌కు డబ్బు సాయం:

మంథనిలో టీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు ఓడిపోయారు. వివేక్ కుట్రతోనే పుట్ట మధు ఓడిపోయారని టీఆర్ఎస్ కార్యకర్తలు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. రామగుండంలో టీఆర్ఎస్ అభ్యర్థి సోమారపు సత్యనారాయణకు వ్యతిరేకంగా వివేక్ పనిచేసినట్టు విమర్శలు ఉన్నాయి. ఇండిపెండెంట్ అభ్యర్థి కోరుకంటి చందర్‌కు మద్దతు ఇవ్వడంతోపాటు ఆర్థికంగా సహాయం చేయడంతో సోమారపు సత్యనారాయణ ఓడిపోయినట్టు పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు అందాయి. బెల్లంపల్లిలో వివేక్ సోదరుడు వినోద్ ఇండిపెండెంట్‌గా పోటీ చేయడంతో అక్కడ టీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యకు మెజార్టీ తగ్గిందన్న నిర్ణయానికి పార్టీ నాయకత్వం వచ్చింది. చెన్నూరు నుంచి పోటీ చేసిన బాల్క సుమన్‌కు వివేక్‌తో ఎప్పటి నుంచో విభేదాలు ఉన్నాయి. దీంతో వివేక్ అందరికీ టార్గెట్ అయ్యారు.

ఈటల, కమలాకర్‌కు వ్యతిరేకంగా:

హుజూరాబాద్ నియోజకవర్గ టీఆర్ఎస్ సమావేశంలో కూడా కోవర్టులపై చర్చ జరిగింది. ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా కొందరు నాయకులు పనిచేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని ఉపేక్షించొద్దని ఈటల రాజేందర్ తెగేసి చెప్పారు. దీంతో కోవర్టుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కరీంనగర్ టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలోనూ ఇలాంటి పరిస్థితే ఎదురైంది. నగర మేయర్ రవీందర్‌సింగ్ .... గంగుల కమలాకర్‌కు వ్యతిరేకంగా పనిచేసినట్టు కార్యకర్తలు ఆరోపించారు. కోవర్టులపై పార్టీ నాయకత్వమే నిర్ణయం తీసుకుంటుందని గంగుల కమలాకర్ కార్యకర్తలకు సర్దిచెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో కోవర్టుల సమస్య లేకుండా చూడాలని టీఆర్ఎస్ నాయకత్వం భావిస్తుంది.. అంతకంటే ముందు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: పంచాయత్ రాజ్ ఎన్నికలలో బి.సి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతం కు తగ్గిస్తూ జారి చేసిన ఆర్డినెన్సు ఉపసంహరించుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో పంచాయత్ రాజ్ ప్రిన్సిపాల్ సెక్రెటరితో ఆర్.కృష్ణయ్య, బి.సి నేతలు గుజ్జ కృష్ణ, సురేష్, నీల వెంకటేష్, అనంతయ్య, జైపాల్ ముదిరాజ్ కలిసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఇటివల రాష్ట ప్రభుత్వం గ్రామ పంచాయత్ ఎన్నికలలో బి.సి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతం కు తగ్గిస్తూ ఆర్డినెన్సు జారి చేసింది. దీని మూలంగా రాష్ట్రంలోని 2 కోట్ల మంది బి.సి తీవ్ర అసంతృప్తితో భాదపడుతున్నారు. మనది ప్రజాస్వామ్యదేశం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి కులం-ప్రతి సామాజిక వర్గానికి వారి, వారి జనాభాప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి, కాని ఈ రాజకీయ పార్టిలు, ప్రభుత్వాలు, కోర్టులు బి.సి. లకు అన్యాయం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బి.సి రిజర్వేషన్లు తగ్గించకుండ ప్రత్యామ్యాయ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రధానంగా బి.సి రిజర్వేషన్లపై హైకోర్టు లో ఇంటరియమ్ స్టే ఉంది. దీనిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. ఈ ఇంటరియమ్ స్టే తొలగిస్తే ఇటివల జారి చేసిన ఆర్డినెన్సును కూడా వెంటనే ఉపసంహరించుకోవడానికి వీలవుతుంది. బి.సి రిజర్వేషన్లు తగ్గించకుండ ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్య శాశ్వత పరిష్కారంగా పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టి జనాభా ప్రకారం బి.సి రిజర్వేషన్లు పెట్టాలి.

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న గవర్నర్

యాదాద్రి భువనగిరి : యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారిని గవర్నర్ నరసింహన్ దంపతులు సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గవర్నర్ దంపతులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారి దర్శనం అనంతరం ఆలయ పునర్ నిర్మాణ పనులను గవర్నర్ పరిశీలంచారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి దీవెనలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు. యాదాద్రి ఆలయం మహోన్నతంగా రూపుదిద్దుకుంటోంది. ఆలయ పునర్ నిర్మాణ పనులు చాలా బాగా జరుగుతున్నాయి. మానవ నిర్మిత మహాకట్టడంగా యాదాద్రి ఆలయం చరిత్రలో నిలిచిపోతుంది. గర్భగుడి ఆలయం కూడా చాలా దివ్యంగా రూపుదిద్దుకుంటోంది. అనంతరం గవర్నర్ నరసింహన్ కు ఆలయ ఈవో గీతారెడ్డి స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందజేశారు.

కర్నూలు విమానాశ్రయంలో ట్రయల్ రన్

కర్నూలు,సూర్యబ్యూరో: ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. రాయలసీమలో మరో విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. కర్నూలులో నిర్మించిన విమానాశ్రయంలో తొలి విమానం ల్యాండ్ అయింది. ట్రయల్ రన్ కోసం తొలి విమానాన్ని కర్నూలు ఎయిర్ పోర్టు రన్ వే పై ల్యాండ్ చేశారు. హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్ పోర్టు నుంచి బయల్దేరిన విమానం కర్నూలు ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో విజయవంతంగా ల్యాండ్ అయింది. జనవరి 7వ తేదీన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. మరోవైపు, తమ నగరంలో విమానం ల్యాండ్ కావడంతో కర్నూలు వాసులు హర్షాతిరేకాలను వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమలో ఇది నాలుగవ ఎయిర్ పోర్టు. 2017 జూన్ లో ఎయిర్ పోర్టు పనులను చేపట్టారు. రూ. 90.5 కోట్లతో టర్మినల్, టవర్ భవనం, రన్ వే, అప్రోచ్ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేశారు.

పేదింట జోష్‌గా 'పెళ్లిళ్లు'!

- ఆడపిల్ల పుడితే సౌభాగ్యం అనే పరిస్థితి
- 25%పైగా లబ్దిదారులు మైనారిటీ వర్గాలే
- దరఖాస్తుల పరిశీలన జాప్యంపై ఆగ్రహం
- సమస్య పరిష్కరించాలని పలు వినతులు
- బ్యాంకులలో చెక్కుల జమకు నిర్ణయంత



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ఆడపిల్ల పుట్టిందంటే ఆ ఇంటికి భారంగా మారిన రోజులు పోయాయి. ఆడపిల్ల పుడితే ఆ ఇంటికి లక్ష్మిదేవత వచ్చిందంటూ సంబరపడిపోతున్నారు. గతంలో ఆడపిల్ల పుట్టిందంటే పెళ్లిళ్లకు అయ్యే ఖర్చుకు భయపడి బ్రూణహత్యలకు పాల్పడేవారు. దీన్ని నివారించటం, బాల్యవివాహాలు అరికట్టాలన్న ఉద్దేశంతోరాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులసంఖ్య పెద్దఎత్తున పెరుగుతోంది. వ్యవసాయ కూలీలు, సన్నకారు రైతులు, అసంఘటిత కార్మికులు, అత్యల్ప వేతనాలున్న తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు ఐదు లక్షలు దాటగా... ఇప్పటికే 4 లక్షల మందికి సాయం అందింది. ఎన్నికల కోడ్ ముగియడంతో పెండింగ్ దరఖాస్తుల్ని వెంటనే పరిష్కరించాలంటూప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో బాల్యవివాహాలు తగ్గాయని సెస్, యునిసెఫ్ అధ్యయనాలు పేర్కొన్నాయి.

పెరిగిన సాయం

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆడపిల్లలకు 2014 అక్టోబరు 2 నుంచి ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. తొలుత రూ.51 వేల చొప్పున సాయం అందించింది. బీసీ, ఈబీసీలకూ ఈ పథకాన్ని అమలు చేసిన అనంతరం సాయాన్ని రూ.75,116కి పెంచింది. ప్రస్తుతం రూ.1,00,116చొప్పున అందిస్తోంది. తొలుత షాదీముబారక్‌లో కొన్ని అవకతవకలు చోటుచేసుకోవడంతో పలు మార్పులు చేశారు. లబ్ధిదారుల్లో బీసీలు, మైనార్టీలు అగ్రస్థానంలో ఉన్నారు. మొత్తం లబ్ధిదారుల్లో 25 శాతానికిపైగా లబ్ధిదారులు మైనార్టీలే. పరిష్కారంలో కొంత ఆలస్యం ఏటా లబ్ధిదారులు, అందుతున్న దరఖాస్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. అయితే వీటి పరిష్కారం ఆలస్యమవుతోంది. వివాహం జరిగే సమయానికి చెక్కులు ఇవ్వాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. దరఖాస్తు సమయంలో చేస్తున్న పొరపాట్లతో కొన్నిచోట్ల తిరస్కారానికి గురవుతున్నాయి. మరికొన్ని దరఖాస్తులు రెండు, మూడు నెలలవుతున్నాపరిశీలనకు నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఈ ఏడాదిలోనే 2 లక్షలకు పైగా.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కిందఆర్థిక సాయం కోసం దరఖాస్తులు భారీగా పెరుగుతున్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే 2.12 లక్షలు దాటాయి. వాటిలో ఇప్పటికే లక్షమందికి సాయం అందింది. ఈ పథకం తమ పిల్లల వివాహానికి ఎంతో ఆసరాగా ఉంటోందని లబ్ధిదారులు పేర్కొంటున్నా రు. ఇదే విషయాన్ని యునిసెఫ్, సెస్ సర్వేల్లోనూ వెల్లడించారు. 18 ఏళ్లు దాటినయువతులకే పథకం వర్తిస్తుందన్న నిబంధన పెట్టడంతో బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడిందని ఎస్సీ సంక్షేమశాఖ కమిషనర్ కరుణాకర్‌తెలిపారు. ఇక చెక్కుల పంపిణీ ఎన్నికల కోడ్ సమయంలో లబ్ధిదారులకు నేరుగా చెక్కులు పంచేందుకు వీల్లేకపోవడంతో బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నిర్ణయించారు. కొత్తప్రభుత్వం ఏర్పాటు కావడంతో మళ్లీ చెక్కులద్వారా సాయం అందించనున్నారు.పాత పద్ధతిలో ఎమ్మెల్యే అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే మంజూరై, బిల్లు సిద్ధమైన లబ్ధిదారులకు సహాయం బ్యాంకు ఖాతాల్లో జమకానుంది. పెండింగ్ దరఖాస్తులకు,కొత్తగా తీసుకుంటున్న వాటికి ఎమ్మెల్యేల చేతుల మీదుగా చెక్కులు ఇవ్వనున్నారు. దరఖాస్తు అందినప్పటి నుంచి 20 రోజుల్లోగా వాటినిపరిష్కరించి, నిధులు మంజూరు చేయాలని గడువుపెట్టారు.

వెయ్యికోట్ల మందు తాగేశారు!

మందు, విందులతో కొత్త ఏడాది వేడుకలు

అర్ధరాత్రి వరకు బార్లు, వైన్స్‌షాపులు ఓపెన్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః న్యూఇయర్ వేడుకలు ప్రారంభమయ్యాయి. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా సెలబ్రేషన్స్‌ను భారీగా జరుపుకున్నా రు కుర్రకారుకి పార్టీ అంటే మొదటగా గుర్తొచ్చేది లిక్కర్. హయ్యస్ట్ సేల్స్ ఇదే. ఈసారి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లో లిక్కర్ తన హవా కొనసాగించునున్నట్లు అంచనా. హైదరాబాద్ తోపాటు తెలంగాణ రాష్ట్రంలో ఈసారి న్యూఇయర్ మందు పొంగిపొర్లింది. వెయ్యి కోట్ల రూపాయలు అమ్మకాలు జరిగినట్లు భావిస్తున్నారు. 2018తో పోల్చుకుంటే ఇది 20-30శాతం అదనం. ఎక్సైజ్ ఖజానాకు కాసుల పంట పండింది. కొత్త సంవత్సరానికి కిక్ తో కూడిన మత్తు మజాతో యువతతో పాటు అందరూ స్వాగతం పలికారు.

లాంగ్ లెంగ్త్ వీకెండ్..మత్తెక్కనున్న మందుబాబులు

2019 జనవరి 1వ తేదీ తెలంగాణ సర్కార్ సెలవు ప్రకటించింది. 2018 సోమవారం రాత్రి ప్రారంభమయిన సెలబ్రేషన్స్ ఆదివారం ఎలాగూ హాలిడే.. ఇప్పటికే. మండే హాలిడే చిటీ ఇచ్చేస్తున్నారు. వరసగా మూడు రోజులు వేడుకలలో ఏంజాయ్ చేయనున్నారు. ఇది కూడా ఎక్సైజ్ శాఖకు కలిసి వచ్చే అంశం. వీకెండ్ లోనే సేల్స్ బాగుంటాయి. అలాంటిది న్యూఇయర్ వస్తున్న మూడు రోజులను సరిగ్గా సద్వినియోగం చేసుకుని.. భారీ సేల్స్ చేసుకోవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా లెక్కేసుకుంటే రూ.1000 కోట్ల లిక్కర్ తో 2018 సంవత్సరంలో లిక్కర్ అమ్మకాలను బ్రేక్ చేసింది.

ఆఫర్స్ ఇచ్చేస్తున్న కిక్ ప్లేసెస్..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పబ్స్, రిసార్ట్స్ భారీ ఈవెంట్స్ ప్లాన్ చేశాయి. స్పెషల్ ఆఫర్స్ ఇస్తున్నాయి. సింగిల్, కపుల్ ప్యాక్ లు ఇచ్చారు. నగరంలోని ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లు, కన్వెన్షన్ సెంటర్లు న్యూ ఇయర్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్‌తో సహా ప్రధాన పట్టణాల్లోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు న్యూ ఇయర్ వేడుకలను జరుపుకొనేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాయి. సెలబ్రిటీలు, డీజేలు యూత్‌ను హోరెత్తించేందుకు సిద్ధం అయ్యాయి. మరోవైపు ఫుడ్, వైన్, మస్తీ అంటూ కాంబో ఆఫర్లుతో ఆకట్టుకున్నారు. ఈ ఈవెంట్లలో పాల్గొనేందుకు యువత పోటీ పడ్డారు. గతంతో పోల్చుకుంటే ఈ సారి మద్యం ఏరులై పారింది. న్యూఇయర్ సెలబ్రేషన్స్ ను దృష్టితో.. వైన్స్, బార్లు, పబ్స్ స్టాక్స్ నిల్‌గా అయ్యాయి.

ఆ బంధం బలపడేదెప్పుడు?

(ఏపీ-పొలిటికల్ బ్యూరో)

- మారుతున్న రాజకీయ పరిణామాలపై జనం దృష్టి
- ఏపిలో అస్పష్టరాజకీయాలపై అంతా మౌనం
- కాషాయంతో జతకడితే ఏమవుతోందోనన్న సంశయం
- వైసిపితో పొత్తు ఎన్నికల ముందా? తరువాతా?
- వరాలు కురిపిస్తే పొత్తు ఉంటుందంటున్న శ్రేణులు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో వస్తున్న మార్పులు అనూహ్యమైనవా లేక ఓ పథకం ప్రకారమే జరుగుతున్నాయా అన్నది ప్రస్తుం చర్చాంశనీయంగా మారింది. ఏపీకి ప్రత్యేక హోదా అంశం సెంటిమెంటుగా మారిన నేపథ్యంలో బీజేపీతో తెగతెంపులు చేసుకొన్న టీడీపీ పోరాటం ప్రారంభించింది. తొలినుంచి ఏపీకి ప్రత్యేక హోదా పోరాటం ప్రారంభించిన వైసీపీ ఈ విషయంలో ఇప్పటికీ టీడీపీ దోషిగా నిలబెట్టడం, కేంద్రంపై విమర్శలు గుప్పించినా అవి అంత పదునుగా లేకపోవడంపై రాజకీయ వర్గాల్లో ఇప్పటికీ చర్చ సాగుతోంది. అయితే ఏపీలో ఇక బీజేపీ ఒంటరియే అన్న ప్రచారం సాగిన నేపథ్యంలో గత కొద్ది నెలల కిందట కేంద్ర మంత్రి అంతులే ఓ సంచన ప్రకటన చేశారు. దీంతో ఏపీ రాష్ట్ర రాజకీయాలలో పెనుమార్పులు చోటుచేసుకోనున్నాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అదే సందర్భంలో ఏపీలో అస్పష్టరాజకీయాలు కొనసాగుతున్నాయనే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం ఏవరు ఎవరి పక్షం నిలబడుతారు, ఏ పార్టీ ఏ పార్టీతో జతకడుతుంది అన్న సంసిగ్ధత కొనసాగుతోంది. ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంతో ఏపీలోని అన్ని పార్టీలు బీజేపీకి దూరంగా ఉంటాయన్న చర్చ సాగిన అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. బీజేపీతో ఫలాన పార్టీ జతకడుతుంది అన్నదానిపై ఎవరికి స్పష్టత లేకపోయినా తాజాగా కమలం, వైసీపీ బంధంపై ప్రత్యేక చర్చ మొదలైంది. ఈ వాతావరణ హఠాతుగా వచ్చిందా లేక ముందే కుదుర్చుకొన్న ఒప్పందం ప్రకారం ఈ పరిణామాలు మారుతున్నాయా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రచారం ఎన్నికలకు ముందుకాకపోయినా ఫలితాలు వెలువడ్డాక కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు మోడీ సర్కార్‌కు ఎంపీ సీట్ల కొరత ఏర్పడితే ఆ సహాయం వైసీపీ అందిస్తుందని తెలుస్తోంది. అయితే ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వని కారణంగా బీజేపీ ప్రస్తుతం ప్రజాకోర్టులో దోషిగా నిలబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీతో జట్టు కట్టేందుకు ఏపీలోని ఏ పార్టీ సాహసం చేయడంలేదన్నది చర్చ. అయితే విజయవాడకు వచ్చిన కేంద్ర మంత్రి వైసీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చాంశనీయంగా మారాయి. అదే సందర్భంలో కేంద్రం తీసుకొచ్చిన త్రిపుల్ తలాక్ రద్దు బిల్లును సమర్థిస్తూ వైసీపీ నేత గౌతంరెడ్డి వ్యాఖ్యలు చేశారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యాఖ్యలకు ముస్లిం సమాజం నుంచి వ్యతిరేకత రావడంతో వైసీపీ నాయకత్వం వెనక్కి తగ్గి, గౌతంరెడ్డి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొనేలా చేసింది. కానీ బీజేపీతో అంతర్గతంగా ఉన్న బంధం కారణంగానే వైసీపీ నేత గౌతంరెడ్డి త్రిపుల్ తలాక్ రద్దు విధానాన్ని రద్దుచేస్తూ వ్యాఖ్యలు చేశారని రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి.

జతకట్టేదెప్పుడూ...?

ఎన్‌డీఏ నుంచి బయటకు వచ్చిన టీడీపీ తొలినుంచి వైసీపీపై చేస్తున్న ఆరోపణ ఆ పార్టీ బీజేపీతో కలుస్తుంది అన్నది. తాజాగా కేంద్ర మంత్రి వైసీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు టీడీపీ చేస్తున్న ఆరోపణలకు బో కలిసే విషయంపై వైసీపీ నేరుగా అంగీకరించకపోయినా ఎక్కడా కమలంతో కలుస్తానన్న సంకేతాలు మాత్రం ఇవ్వలేదు.

అయితే తన చర్యల ద్వారా బీజేపీ పట్ల వైసీపీ తను సానుకూల వైఖరిని ప్రదర్శిస్తోందని రాజకీయ వర్గాలు సైతం పేర్కొంటున్నాయి. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై పోరాడుతున్న వైసీపీ నాయకత్వం టీడీపీనే ఎక్కువగా టార్గెట్ చేసిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. హోదా రాకపోవడానికి టీడీపీ కూడా ఒక కారణమైనా ప్రధాన కారణం మాత్రం బీజేపీయేనని వారు గుర్తుచేస్తున్నారు. అలాంటి బీజేపీపై పదునైన విమర్శలు చేయకుండా కేవలం టీడీపీనే వైసీపీ టార్గెట్ చేయడం వెనక మర్మమేమిటీ అన్నది వారు ప్రశ్నిస్తున్నారు. ముందే కుదుర్చుకొన్న ఓ ఒప్పందం ప్రకారమే వైసీపీ నాయకత్వం కేంద్రంపై విమర్శలు గుప్పించడంలేదన్న ప్రచారం సాగుతోంది. బీజేపీతో దోస్తీకి గతంలో వైసీపీ ప్రయత్నించిన విషయం తెలిసిందే. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో నాడు అది జరగలేదు. అయితే ప్రస్తుతం ఎన్‌డీఏ నుంచి టీడీపీ బయటకు రావడంతో ఇప్పుడు కేంద్రానికి వైసీపీ దగ్గరవుతోందన్న సంకేతాలను కేంద్రం మంత్రి ఇచ్చారు. అయితే ఈ పొత్తు ఎన్నికలకు ముందే కుదురుతుందా లేక ఎన్నికల అనంతరం ఫలితాల తరువాత కుదురుతుందా అన్నది చర్చాంశనీయంగా మారింది. ఈలోపు బీజేపీ ఎన్నికలకు ముందే ఏపీపై వరాల జల్లు కురిపించి వైసీపీతో కలసి బరిలోకి దిగుతుందా అన్నది చర్చాంశనీయంగా మారింది.



15లోగా నదుల పునరుజ్జీవంపై ముసాయిదా

అధికారులను ఆదేశించిన సీఎస్ జోషి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం నదుల పునరుజ్జీవ పై నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ముసాయిదా కార్యచరణ ప్రణాళికను జనవరి 15 లోగా రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.కె.జోషి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో నదుల పునరుజ్జీవ కమిటి సమావేశం సి.యస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, మెట్రోవాటర్ వర్క్స యం.డి దానకిషోర్, పీసీబీ సెక్రటరి సత్యనారాయణ రెడ్డి, ఇపిటీఆర్ఐ డీజీ కల్యాణచక్రవర్తి, టీఎస్ఐఐసి ఎండీ వెంకట నర్సింహారెడ్డి, ఇరిగేషన్ ఇఎన్‌సీ మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.యస్ ఎస్.కె.జోషి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి వివిధ నదులకు సంబంధించిన ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, మెట్రోవాటర్ వర్క్స, మున్సిపాలిటి, పరిశ్రమలు తదితరశాఖలు జనవరి 5 లోగా తమ డాటాను నేషనల్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీరింగ్ రిసెర్చ్ ఇన్సిట్యూట్ (ఎన్ఈఈఇర్ఐ) కు అందజేయాలని అన్నారు.తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి మొత్తం వాటర్‌షెడ్ మ్యాప్ ను రూపొందించాలని అన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా నీటి నాణ్యతను మానిటరింగ్ చేయాలని తెలిపారు. నదులలో కాలుష్యానికి సంబంధించి ముఖ్యమైన స్ట్రెచెస్‌లపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి సంబంధించి పీసీబీ ద్వారా నీటి నాణ్యత, ఇరిగేషన్ ద్వారా నీటి పరిమాణం పై అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీపీ ల నిర్మాణానికి సంబంధించి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స నును నోడల్ వ్యవస్థగా నియమించడానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. మొత్తం సీజన్ కు సంబంధించిన మినిమమ్ హైడ్రోలజిక్ ఎన్విర్మెంట్ ఫ్లో పై నివేదికను రూపొందించాలన్నారు. డొమెస్టిక్ సీవరేజ్ భూగర్భజలాలు, ఇకోలాజిక్, ఎన్విర్మెంట్ ఫ్లో, ఫ్లడ్ ప్లెయిన్ జోన్స్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని నివేదిక రూపొందించాలన్నారు. ఎన్ఈఈఆర్ఐ ఇచ్చే ముసాయిదా నివేదికపై జనవరి 3 వ వారంలో మరోసారి కమిటి సమావేశం కావాలని నిర్ణయించారు.

రాబోయే 100 రోజుల్లో ఏం చేస్తామంటే

యాక్షన్ ప్లాన్ ప్రకటించనున్న పవన్ కల్యాణ్



అమరావతి,సూర్యబ్యూరో: జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంగళవారం విజయవాడలో పార్టీ సమావేశం నిర్వహించనున్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగే సమావేశంలో ఆయన రాబోయే 100 రోజుల్లో పార్టీ పటిష్టతకు, ప్రజల్లోకి చొచ్చుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై యాక్షన్ ప్లాన్ విడుదల చేయనున్నారు. ఈ సమావేశానికి పార్టీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు హాజరుకానున్నారు. ఇటీవల కుటుంబంతో కలసి యూరప్ వెళ్లిన పవన్ కల్యాణ్ తాజాగా తన పర్యటనను పూర్తి చేసుకుని హైదరాబాదుకు చేరుకున్నారు.

చని పోయిన ఏడాదికి తెల్గీ నిర్దోషిగా తీర్పు

నకిలీ స్టాంపు పేపర్ల కుంభకోణం కేసులో అబ్దుల్ కరీం తెల్గీ సహా ఇతర నిందితులకు విముక్తి కల్పిస్తూ మహారాష్ట్రలోని నాశిక్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెల్గీ చనిపోయిన సంవత్సరం తర్వాత అతడిని నిర్దోషిగా ప్రకటిస్తూతీర్పు వెలువడడం గమనార్హం. మెనింజెటిస్ వ్యాధికి గురైన తెల్గీ... గతేడాది అక్టోబర్‌లో బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. నకిలీ స్టాంపు పేపర్ల కుంభకోణంలో తెల్గీని 2001 నవంబర్‌లో అరెస్ట్ చేశారు. నకిలీ స్టాంప్ పేపర్ల రాకెట్ నడిపినట్టు తేలడంతో తెల్గీకి 30 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది.

జైలు శిక్షతో పాటు అతడికి రూ.202 కోట్ల భారీ జరిమాన కూడా పడింది.పరప్పన అగ్రహారం జైల్లో శిక్ష అనుభవిస్తుం డగానే అతడు మృతిచెందాడు.పలు ఫోన్లను ట్యాపింగ్ చేయడం ద్వారా కోట్లాది రూపాయల నకిలీ స్టాంపు పేపర్ల కుంభకోణాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం వెలుగులోకి తెచ్చింది. బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, బ్రోకరేజ్ సంస్థలు సహా వివిధ సంస్థలకు తెల్గీ నకిలీ స్టాంపులు అమ్మేవాడని సిట్ ఆరోపించింది. కాగా తెల్గీకి జైల్లో ప్రత్యేక వసతులు కల్పిస్తు న్నారంటూ జైళ్ల శాఖ మాజీ డీఐజీ డి.రూప ఆరోపించడంతో ఆయన మరింత వివాదంలో చిక్కుకున్నారు. తెల్గీకి ముగ్గురు నుంచి నలుగురు వ్యక్తులు మసాజ్‌లు చేస్తున్నట్టు అప్పట్లో రూప చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి.

బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో అధికార కూటమి మరోసారి ఘన విజయం సాధించింది. ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ విజయం సాధించింది. దీంతో నాలుగో సారి హసీనా బంగ్లాదేశ్ ప్రధానిగా పగ్గాలు చేప డుతుండటం విశేషం. బంగ్లాదేశ్‌లో10 కోట్ల 40 లక్షల మంది ఓటర్లు ఉన్నా రు. 300 స్థానాలున్న బంగ్లాదేశ్ పార్లమెంట్‌లో299 స్థానాలకు ఆదివారం 40,000కు పైగా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా ఈవీఎంలను వినియోగించారు. మొత్తం 299 నియోజకవర్గాలకు గాను కేవలం ఆరు నియోజకవర్గాల్లోనే వీటిని ఉపయోగించారు. లాటరీ ద్వారా ఈ నియోజకవర్గాలను ఎంపిక చేశారు. వీటి పరిధిలో మొత్తం 21 లక్షలమంది ఓటర్లు ఉన్నారు

కాగా ఈ సార్వత్రిక ఎన్నికలలో మహాకూటమిలో షేక్ హసీనా నాయకత్వం లోని ఒక్క అవామీ లీగ్ పార్టీనే 259 స్థానాలు సొంతం చేసుకుని తమ హవా మరోమారు ప్రదర్శించింది. మరో మిత్రపక్షం జాతీయ పార్టీ 20 స్థానాల్లో విజ యం సాధించింది. స్వతంత్రులు మూడు స్థానాలు గెలుచుకోగా, వర్కర్స్ పార్టీకి మూడు, జాతీయ సమాజ్ తాంత్రిక్ దళ్ (జేఎస్ఏడీ), బికల్పధార, గణ ఫోరమ్ పార్టీలు రెండేసి స్థానాలు దక్కించుకున్నాయి. తరికత్ ఫెడరేషన్, జేపీ పార్టీలు ఒక్కో స్థానంతో సరిపెట్టుకున్నాయి.

అయితే ఇక ఈ ఎన్నికల్లో విజయం తమదేనని ధీమాతో ఉన్న విపక్ష జాతీయ ఐక్యతా కూటమికి ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. విపక్ష జాతీయ ఐక్యతా కూట మి కేవలం 8 స్థానాలతో సరిపెట్టుకుంది.గోపాల్ గంజ్ స్థానం నుంచి ఎంపీ గా హసీనా భారీ మెజారిటీతో గెలిచారు. ఆమెకు 2 లక్షల 29వేల 539 ఓట్లు రాగా ప్రత్యర్థి పార్టీ కి చెందిన అభ్యర్థికి కేవలం 123 ఓట్లు మాత్రమే వచ్చాయి.

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు వన్డే కెప్టెన్ మష్రఫే మొర్తజా నరైల్-2 నియోజకవర్గం నుంచి అవామీ లీగ్ అభ్యర్థిగా గెలుపొందారు.

కాగా ఈ ఎన్నికలలో ఫలితాలు ఏకపక్షంగా ఉండడంతో వాటిని ప్రతిపక్ష ఎన్‌యూఎఫ్ కూటమి ఫలితాలను అంగీకరించట్లేదు. ప్రస్తుత ఫలితాలను రద్దు చేయాల్సిందేనని తటస్థమైన ఆపద్ధర్మ ప్రభుత్వం నేతృత్వంలో మరో మారు ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌ను ఎన్‌యూఎఫ్ డిమాండ్ చేస్తోం ది. దాదావు అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికార పార్టీ అవకతవకలకు పాల్పడటం వల్లే విజయం సాధించిందన్నది విపక్షాల ప్రధాన ఆరోపణ.

ఆదివారం బంగ్లాదేశ్ వ్యాప్తంగా సాధారణ ఎన్నికలు జరిగాయి. పోలింగ్‌లో పలు చోట్ల హింస చెలరేగింది. ఈ ఘర్షణల్లో రాజ్‌షాహి, చిత్తగావ్, కుమిల్లా, కాక్స్‌బజార్ జిల్లాల్లో ఇద్దరు వ్యక్తుల చొప్పున చనిపోగా, బ్రమ్మణబెరియా, రంగమతి, నార్సిది, బొగుర, గజీపూర్, సిల్హెట్‌లో చెలరేగిన అల్లర్లలో ఒక్కరి చొప్పున మరణించారు. సుమారు 6 లక్షల మంది భద్రతా సిబ్బందిని మోహరించినప్పటికీ ఎన్నికలు హింసాత్మకంగానే సాగి 17 మంది ప్రాణాలు కోల్పో యారు. వీరిలో ఎక్కువ మంది అధికార పాలక అవామీ లీగ్ కార్యకర్తలే అధికంగా ఉన్నట్లు సమాచారం. అయితే అధికార పక్ష విజయాన్ని తాము అంగీకరించబోమని విపక్ష కూటమి ప్రకటించింది. తమ ఏజెంట్లను పోలింగ్ బూత్‌ల నుంచి బయటకు నెట్టేసి ఏకపక్షంగా ఎన్నికలు జరిపారని, దీంతో తాము ఎన్నికలకు దూరంగా ఉంటున్నట్లు విపక్ష బీఎన్‌పీ అభ్యర్థులు ప్రకటించారంటే అధికార కూటమి భారీగా ఎంత రిగ్గింగ్‌కు పాల్పడిందో అర్థం చేసుకోవచ్చని ఆరోపించింది. తటస్థ సంస్థల నేతృత్వంలో మరోసారి ఎన్నికలు నిర్వహించా లని విపక్ష కూటమి డిమాండ్ ను అధికార ఆవామీ లీగ్ (ఏఎల్) పార్టీ తిరస్కరిస్తోంది. ప్రజాస్వామ్య పద్దతిలో జరిగిన ఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పును విపక్షం అగౌర పరుస్తోందని, హసీనా పాలనా తీరుపైనా తగిన విధంగా ఓటర్లు స్పందించారన్నది అధికార పక్ష వాదన.

300 స్థానాలకుగానూ 220కి పైగా పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగిందని, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, చిట్టగాంగ్‌లోని ఒక పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రారంభం కాకముందే బ్యాలెట్ బాక్సులు నిండిపోయి ఉన్నాయని విపక్షాలు ఫిర్యాదు చేసాయి. ఈ తరహాలో దేశ వ్యాప్తంగా అనేక


షేక్ హసీనా హ్యాట్రిక్

పోలింగ్ బూతులలో అక్రమాలు జరిగినట్లు ఆరోపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఓట్ల రిగ్గింగ్ ఆరోపణలు వస్తున్నాయని ఈ ఆరోపణలపై దర్యాప్తు జరుపుతామని తెలిపింది.ఈ క్రమంలో తమకు వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు జరుపుతున్నామని బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం అధికార ప్రతినిధి ఎస్ ఎం అసదుజ్‌మన్ మీడియాకు తెలిపారు.

బంగ్లాదేశ్‌కు 1971లో స్వాతంత్ర్యం లభించింది మొదలు రాజకీయంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంది. ముస్లిం మెజార్టీ దేశం అయినప్పటికీ, ప్రజలు 16 కోట్ల మందికి పైగా ఉన్నారు. అయితే అనుక మంది పేదరికంలోనే మగ్గుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వాలతో పాటు అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలు వారిని తీవ్రంగా ప్రభావితం చేసాయి. ఎక్ హసీనాకు దీర్ఘకాలంగా ప్రత్యర్థిగా ఉన్న ఖలీదా జియా ఈ ఏడాది మొదల్లో అవినీతి నేరారోపణల నేపథ్యంలో జైలు పాలయ్యారు. దీంతో ఆమె ఎన్నికల్లో పోటీ చేసే అర్హతను కోల్పోయారు. అయితే, ఇదంతా రాజకీయ దురుద్దేశ్యంతో జరిగిన వ్యవహారమని ఖలీదా జియా అప్పట్లో ఆరోపించారు కూడా. ఇక ఖలీదా జియా ఎన్నికలలో పోటీలో పాల్గొనేందుకు లేకపోవటంతో..షేక్ హసీనాకు మిత్రపక్షంగా, మంత్రి వర్గంలో మంత్రిగా పనిచేసిన, కమల్ హొస్సైన్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అయ్యారు. జతియా ఒక్య ఫ్రంట్‌కు ఆయనే నాయకత్వం వహిస్తున్నారు. అయితే, 81 ఏళ్ల వయసున్న కమల్ హొస్సైన్ ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదు. పైగా ఈయన న్యాయవాది కూడా.అలాగే బంగ్లాదేశ్ రాజ్యాంగాన్ని రచించిన వారిలో ఒకరు కావటంతో ఆయనమీద ఉన్న కౌరవం ఈ కూటమిలో ఖలీదా జియా పార్టీ కూడా ఉండటం లాభిస్తుందని ఆశించినా ఫలితం శూన్యమైంది. అలాగే 2014 లో ఓటింగ్ బాయ్కాట్ చేసిన బీఎన్పీ ఈ సారి ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలబెట్టింది. దీంతో గత 10 ఏళ్లలో తొలిసారి అన్ని జాతీయ పార్టీలూ పాల్గొన్న సార్వత్రిక ఎన్నికలుగా ఆదివారం జరిగిన పోలింగ్‌కు ప్రాధాన్యం ఏర్పడింది.. దీనికి తోడుగా వాతావరణ మార్పులు, ఇస్లామిస్ట్ మిలిటెన్సీ, ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. లక్షలాది మంది రోహింజ్యా ముస్లింలు మియన్మార్ నుంచి వలస రావటంతో బంగ్లాదేశ్ అంతర్జాతీయంగా చర్చనీయాంశం అయ్యింది.

ఎన్నికలలో తనకు ప్రత్యర్థి లేకుండా చేసుకోవటంలో హసీనా విజయం సాధించారని, ఇంది ప్రజాస్వామ్యానిన్న పరిహసించడమేనన్న వాదన వినిపిస్తున్నా. హసీనా హేట్రిక్ విజయాన్ని అందుకుని మరోమారు గద్దెనెక్కేలా ఈ విజయం ఉందని చెప్పకతప్పదు.

కొత్త సంవత్సరంలో కొత్త హైకోర్టు



మల్యాల పళ్లంరాజు, 9705347795

ఎట్టకేలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని హైకోర్టు విభజన సమస్య ఓ కొలిక్కి వచ్చింది. రాష్ట్ర విభజన జరిగిన నాలుగున్నర ఏళ్ల తర్వాత 2019 కొత్త సంవత్సరంలో కొత్త సంవత్సరం ప్రారంభం రోజునే కొత్త హైకోర్టు ఏర్పడుతోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా కేవలం 9 నెలల్లో హైకోర్టు భవనం ఓ రూపు దిద్దుకుంది. ఇల్లు కట్టిచూడు.. పెళ్లి చేసి చూడు.. అనే సామెత ఉంది. ఈ రెండు వ్యవహారాల్లోనూ అనుకున్న పనులు అనుకున్నట్లు సాధ్యం కాకపోవచ్చు. చివరి నిముషం వరకూ పనులు జరుగుతూనే ఉంటాయన్నది ఇల్లు కట్టిన లేదా పెళ్లి చేసిన ప్రతి ఒక్కరికీ అనుభవమే. రెండు అంతస్తుల ఇంటి నిర్మాణం పూర్తి కావాలంటే.. అన్నీ సరిగ్గా ఉన్నా నెలలు పడుతుంది. అలాంటిది 2.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ టు భవనాన్ని తొమ్మిది నెలల్లో పూర్తి చేశారు. ఇంకా ఇంటీరియర్స్, ఫాల్స్ రూఫ్ పనులు, లిఫ్టులు, ఎలక్ట్రిక్ పనులు జరుగుతున్నాయి. అలాగే హైకోర్టులో జడ్జీల ప్రత్యేక గదులు, న్యాయవాదుల సమావేశం హాళ్లు, కోర్టు పనులకు వచ్చే సామాన్యప్రజలు కూర్చునే హాళ్లు, అవసరమైన టాయిలెట్ లు, ఇతర సౌకర్యాల కల్పన యుద్ధ ప్రాతిపదికన జరుగుతోంది. ఎల్ అండ్ టీ సంస్థ కొన్ని వందల మందితో మూడు షిఫ్టుల్లో ఇరవై నాలుగు గంటలు పని చేస్తూ.. లోపల ఇంటీరియర్ పనులు చేయిస్తోంది. భవన సముదాయంలో పెయింటింగ్, ఇతర సౌకర్యాల కల్పనకు, కొత్త హైకోర్టు చుట్టుపక్కల నేలను సరిచేసి, సిమెంట్ కాంక్రీట్ వేయడం, పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడానికి మరి కొద్ది కాలం పట్టవచ్చు. ఏమైనా 9నెలల కాలంలో హైకోర్టు భవనం పూర్తి చేయడం గొప్ప విషయమే.

దక్షిణాదిలోని హైదరాబాద్ ను రెండో రాజధానిగా ప్రకటించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించినా రెండో రాజధాని ఏర్పాటు కాలేదు. దక్షిణాదిలో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన కార్యరూపం దాల్చలేదు. నిజానికి సుప్రీంకోర్టు 1958లో తిలక్ మార్గ్ లోని ప్రస్తుత భవనంలో తన



కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ భవనంలోకి సుప్రీంకోర్టు మారే వరకూ సుప్రీంకోర్టు పార్లమెంటు భవనంలోనే పనిచేసిందనే విషయం చాలా మందికి తెలియదు. కొత్త రాష్ట్రాలు ఏర్పాటు కాగానే హైకోర్టుల ఏర్పాటు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేస్తారు. ఛత్తీస్ గఢ్, జార్ఖండ్, ఉత్తరాంచల్ రాష్ట్రాలు ఏర్పడిన కొద్ది నెలల్లోనే ప్రత్యేక హైకోర్టుల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేశారు. ఛత్తీస్ గఢ్ ప్రత్యేక హైకోర్టు 2000 నవంబర్ 1న ఛత్తీస్ గఢ్ రాజధాని రాయ్‌పూర్ సమీపంలోని బిలాస్‌పూర్ లో ప్రారంభమైంది. జార్ఖండ్ రాజధాని రాంచీలో జార్ఖండ్ హైకోర్టు 2000 నవంబర్ 15న ప్రారంభమైంది. ఇక ఉత్తరాంచల్ హైకోర్టు 2000 నవంబర్ 9న నైనిటాల్ లో ప్రారంభమైంది. పాత సెక్రటేరియట్ భవనంలో మొదట హైకోర్టు ప్రారంభమైంది. తర్వాత ఐదు కోర్టు భవనాలను, మరి కొన్ని కోర్టు భవనాలను పక్కలనే నిర్మించారు. 2007లో చీఫ్ జస్టిస్ కోర్టు బ్లాక్ ను, లాయర్ల ఛాంబర్లను నిర్మించారు.

2018 డిసెంబర్ 15 కల్లా కోర్టు భవనం పూర్తవుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభు


- నేడే ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం
- కొలిక్కి వచ్చిన విభజన అంశం
- చకచకా సాగుతున్న భవన నిర్మాణం
- పూర్తి కాకుండానే విభజనేమిటన్న చంద్రబాబు

త్వం లిఖిత పూర్వకంగా తెలియజేయడంతోనే కేంద్ర ప్రభుత్వం పూనికతో ఉమ్మడి హైకోర్టును విభజిస్తూ రాష్ట్రపతి గురువారం గెజిట్ జారీ చేశారు. దీంతో హైకోర్టు విభజనకు గల అడ్డంకులన్నీ తొలగి పోయాయి. ఆ వెంట వెంటనే కొత్త హైకోర్టు ప్రక్రియ ఊపందుకుంది. 2019 జనవరి 1 నుంచి అమరావతి నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభించాలని రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లాగరి ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. ప్రధాన న్యాయమూర్తితో పాటు 14 మంది జడ్జీలను కూడా ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కేటాయించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ తో సంప్రదింపుల తరువాతే ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జస్టిస్ ప్రవీణ్ కుమార్ తో పాటు మిగిలిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులందరి చేత ఉభయ రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ జనవరి 1న ప్రమాణ స్వీకారం చేయిస్తారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ గ్రౌండ్స్ లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు భవన సముదాయం పూర్తిగా రూపుదిద్దు కోవడానికి ఇంకొన్ని నెలలు పట్టే అవకాశం ఉన్నందువల్ల.. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులకు విజయవాడలోని నోవాటెల్ లో తాత్కాలిక బస ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇతర న్యాయాధికారులకు ప్రభుత్వ అతిథి గృహాల్లోనూ, హోటళ్లలోనూ బస ఏర్పాటు చేస్తున్నారు. న్యాయమూర్తులకు ఏడాది పాటు అద్దె ప్రాతిపదికన విల్లాలను సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతానికి సిఎం క్యాంప్ కార్యాలయంలో న్యాయమూర్తులు, రిజిస్ట్రార్ లు, కోర్టు సిబ్బంది పని చేసేందుకు 12 భారీ హాళ్లను సిద్ధం చేశారు. ఫర్నీచర్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయితే , న్యాయవాదుల విభజన, కేసుల విభజన ఇంకా పూర్తి కాకపోవడం, న్యాయవాదులకు కొత్త హైకోర్టు సమీపంలో ఎలాంటి వసతి సౌకర్యాలు లేకపోవడం, రవాణా సౌకర్యాలు కూడా లేకపోవడంతో ప్రస్తుతం హైదరాబాద్ లో ఉన్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన న్యాయవాదులు ఆందోళన చెందడం సహజమే.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు భవనం డిసెంబర్ 15 కల్లా పూర్తవుతుందని చెప్పిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీరా రాష్ట్ర హైకోర్టు విభజన పూర్తి చేస్తూ, రాష్ట్రపతి గెజిట్ విడద చేసిన తరువాత హైకోర్టు విభజన తీరు సరిగా లేదని వ్యాఖ్యానించడం విశేషం. రాష్ట్రపతి సమయం ఇవ్వకుండా నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల ఉద్యోగులు మానసికంగా సిద్ధం కాలేదని పేర్కొనడం తో కొంత క్లిష్ట పరిస్థితి ఏర్పడింది.

ఉమ్మి హైకోర్టును విభజిస్తూ రాష్ట్రపతి గెజిట్ జారీ చేశారు. దీని పై హైకోర్టులో రెండు ప్రాంతాలకు చెందిన లాయర్లు భిన్న వాదనలు వినిపిస్తున్నారు. ఇదే సమయంలో ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు కారణమవుతున్నాయి. హైకోర్టు విభజనపై కేంద్రం తీరును ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తప్పుబట్టారు. సంప్రదించకుండానే విభజన చేశారని విమర్శించారు. సమయం ఇవ్వకుండా జనవరి 1నే వెళ్లిపోవాలనడం సరికాదన్నారు. జగన్ కేసులను దృష్టిలో పెట్టుకునే విభజన చేసినట్టుగా అనిపిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై అటు టిడిపి తో పాటుగా వైసిపి లోనూ చర్చ మొదలైంది.జగన్ కేసులు రాజకీయ కుట్రతోనే దాఖలు చేసారనీ, జగన్‌తో పాటుగా వైసిపి నేతలు పలుమార్లు ఆరోపించారు. జగన్ తనపై సిబిఐ నమోదు చేసిన కేసుల కారణంగా 16 నెల్ల పాటు జైలు జీవితం కూడా గడిపారు. ఇప్పటికీ హైద్రాబాద్ లోని సిబిఐ కోర్టుల లో కేసుల విచారణ సాగుతోంది. ప్రతి శుక్రవారం జగన్ కోర్టుకు హాజరవుతున్నారు. ఈ సమయంలో..ముఖ్యమంత్రి జగన్ కేసుల విచారణను జాప్యం చేసేందుకే హైకోర్టు విభజన జరిగిందనే అనుమానం కలుగుతోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న వ్యాఖ్యానాలు మాత్రం న్యాయవాదులను కూడా గందరగోళంలో పడేస్తున్నాయి. ఇప్పటి వరకూ జరిగిన కోర్టు విచారణ అంశాలన్నీ రికార్డు అయి ఉంటాయి కాబట్టి, ఏ కేసు తదుపరి విచారణ అయినా కొనసాగింపే అవుతుందని న్యాయ నిపుణులు పేర్కొనడం విశేషం.

ఏపీలో ప్రజాస్వామ్యం అపహాస్యం



అడుసుమిల్లి జయప్రకాష్, మాజీ ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థలు, విలువలు గురించి చంద్రబాబు ఇటీవల కాలం లో పదేపదే ప్రస్తావిస్తు న్నా రు. ముఖ్యంగా తన రాజకీయ స్వ ప్రయో జనాల కోసం ఎన్‌డిఎ నుండి బయటకు వచ్చినప్పటి నుండి ప్రధాని నరేంద్రమోడీని వ్యక్తిగత శత్రువుగా భావిస్తూ చంద్రబాబునాయుడు చేస్తున్న ప్రకటనలు, ఇస్తున్న వివరణలు హాస్యాస్పదంగా తయార య్యాయి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టిస్తున్న వ్యక్తి చంద్రబాబు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు. ఆయన హయాంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేదు. కోర్టులు నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చినా ఏదో ఒక సాంకే తిక సాకుతో మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను వాయిదా వేస్తున్నారు. స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి మూలాలు అవి బలంగా ఉండాలి, స్థానిక స్వపరిపాలన, సుపరిపాలన జరగాలన్న ఉద్దేశంతోనే రాజ్యాం గాన్ని సవరించి వాటిని బలపరిచే వ్యవస్థ రూపొందిం చాడు నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ. చంద్రబాబునాయుడు తన హయాంలో స్థానిక సంస్థలను అణగదొక్కి రాజ్యాంగ స్ఫూర్తికే విఘాతం కలిగి స్తున్నారు. పంచాయతీలకు హక్కులు లేవు, పంచాయతీ అధ్యక్షు లనే వారు లేరు. ఇతర పార్టీలు గెలుస్తాయన్న భయంతో ఎన్నికలే లేవు. తన పార్టీ మనుషులకు నామినేటెడ్ పద్ధతిలో అధికారం కట్టబెటేందుకు జన్మభూమి కమిటీలను నియమించారు. దీనిని పూర్తిగా పార్టీ వ్యవహారంగా మలిచి పంచాయతీ వ్యవస్థ స్ఫూర్తిని తుంగలో తొక్కారు. ఇప్పుడు పెత్తనం జన్మభూమి కమిటీలది. వీరికి ప్రజల మద్దతు లేదు. ప్రజలు ఎన్నుకున్న వారు కాదు. పచ్చచొక్కాలు ధరించటమే అవు తుంది. తన పార్టీ మనుషుల చేత, తన పార్టీ కార్యకర్తల కోసం, తన పార్టీ నేతల ద్వారా నడిచే వ్యవస్థగా పంచాయతీ వ్యవస్థలకు కొత్త అర్థం తీసుకువచ్చారు చంద్రబాబునాయుడు. మునిసిపా లిటీలలో అయినా మరెక్కడైనా ఎనుకున్న ప్రతినిధుల పదవీకా లం ముగిస్తే అక్కడ పెత్తనం స్పెషల్ ఆఫీసర్స్‌దే. ఇటువంటి అప్రజాస్వామిక పద్ధతిలో రాష్ట్రాన్ని నిర్వహిస్తూ జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి చంద్రబాబునాయుడు ప్రసంగాలు చెయ్యటమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చెయ్యడమే. చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు విలువ లేదు. ప్రజాస్వామ్యంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను ప్రజలు ఎన్నుకుంటారు. వారి వారి పనితీరును బట్టి తమ ప్రతినిధులకు ఓటు వేస్తారు. వారి పదవీ కాలమైన ఐదు సంవత్సరాలు ఆ నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా అక్కడి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం, పర్యవేక్షించడం ఆ ఎమ్మెల్యే హక్కు, బాధ్యత కూడా. చంద్రబాబునాయుడికి ప్రజాతీర్పు అంటే గౌరవం

- పంచాయతీ ఎన్నికలు నిర్వహించరు
- వాటిపై పెత్తనం జన్మభూమి కమిటీలదే
- ఫిరాయింపులపై ఫిర్యాదులను పట్టించుకోరు
- ఐవైఆర్, అజయ్ ప్రశ్నలకు బదులేది?



లేదు. అందుకే ఎమ్మెల్యే లంటే పూచికపుల్లతో సమానం. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలంటే అస్సలు గిట్టదు. అందు కే ఆయన ప్రభుత్వ హయాంలో తరచుగా ప్రోటోకాల్ వివాదాలు తలెత్తుతుంటాయి. స్థానిక ఎమ్మెల్యేలకు ఆహ్వానాలు లేకుండా అధికార కార్యక్రమాలు జరుగుతాయి. స్థానిక ఎమ్మెల్యేకి సముచిత స్థానం వేదికమీద ఉండదు. ప్రభుత్వ కార్యక్రమాలలో ఎమ్మెల్యేలు గళం విప్పేందుకు వీలుండదు. ముఖ్యమంత్రి పాల్గొన్న సభలోనే ఎమ్మెల్యేలకు మైకు ఇవ్వని సందర్భాలు అనేకం. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడ దో కూడా చంద్రబాబే నిర్ణయించాలనుకుంటారు. అందుకే చంద్రబాబు పాల్గొనే సభలకు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు బహిష్కరించాల్సిన పరిస్థితి. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను కాదని, వారి చేతిలో ఓడిపోయిన అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అందలం ఎక్కించే ఒక విచిత్రమైన సంస్కృతిని చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో ఆరంభించారు. ఇది ఏమీ ప్రజాస్వామ్యమో అర్థం కాదు. ఆయా నియోజకవర్గాలలో ఓడిపోయిన టిడిపి అభ్యర్థులకు అభివృద్ధి కార్యక్రమాలను నామినేటెడ్ చేసేందుకు వీలుగా జీవో వెలువడింది. నిధుల ఖర్చు వారి ద్వారా జరుగుతోంది. ఇదీ చంద్రబాబు జమానాలో ఉన్న ప్రజాస్వామ్య విలువ. ప్రజాస్వామ్యంలో ఒక పార్టీ ఎన్నికల గుర్తు మీద గెలిచిన వారు ఆ పార్టీకి కట్టుబడి ఉండాలి. పార్టీలు ఫిరాయించకూడదు. పార్టీ ఫిరాయిస్తే పదవి పోతుంది. ఇది చట్టం చెబుతున్న విషయం. కాని ప్రజాస్వామిక చట్టం చంద్రబాబుకు పట్టదు. 26 మంది ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని చేసిన ఫిర్యాదుకు మూడేళ్లుగా దిక్కులేదు. ఫిరాయింపుదారుల మీద ఎటువంటి చర్య తీసుకోని స్పీకర్ ప్రజాస్వామ్య రక్షకుడు ఎలా అవుతాడో! అటువంటి వ్యక్తి అధ్యక్షతన నడిచే సభకు ఉండే గౌరవం, విలువ ఏపాటిదో ప్రజలు అర్థం చేసుకోవచ్చు. ఫిరాయింపు చట్టం ఆంధ్రప్రదేశ్‌కు వర్తించదా! ఫిరాయింపులు స్పీకర్‌కు కనిపించవా! ఇదేనా ప్రజాస్వామ్యం? పైగా ఫిరాయింపుదారులతో నలుగురిని తన మంత్రివర్గంలో సభ్యులుగా చేసిన ఘనత చంద్రబాబుది. ఇది మరే రాష్ట్రంలో జరగని అప్రజాస్వామిక చర్య. అయినా చంద్రబాబు ప్రజాస్వామ్య వ్యవస్థల మీద లెక్చర్లు దండుతారు. ప్రజాస్వామ్యమంటే తాను ప్రశ్నించటమేనన్న గట్టి నమ్మకం చంద్రబాబునాయుడిది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడమే కాదు సమాధానం చెప్పడం కూడా భాగమని చంద్రబాబుకు తెలియదు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థాయిలో పని చేసిన అధికారులు ఇప్పుడు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన మంత్రివర్గ సహచరులు చేసిన పలు అప్రజాస్వామిక నిర్ణయాల గురించి వారికి తెలుసు. అధికారులుగా ఉన్నప్పుడు వాటిని ప్రశ్నించిన నిజాయితీ పరులు వారు. అధికారులుగా రిటైర్ అయినా ప్రజా సంక్షేమం మీద కాంక్ష కలిగిన ఆ అధికారులు నేడు బహిరంగ వేదికల మీద ప్రశ్నిస్తున్నారు. ఆ అధికారుల నిజాయితీని చంద్రబాబు కూడా శంకించలేనిది. అందుకే ఆ ఐఎఎస్ అధికారులు చెబుతున్న విషయాలను ప్రజలు నమ్ముతున్నారు. వారు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరుతున్నారు. చంద్రబాబు హయాంలో అవినీతి వ్యవస్థే ప్రణమిల్లుతున్నదని ఆ మాజీ ఐఎఎస్‌లు చెబుతున్న విషయం. ప్రభుత్వ జీవోలన్నీ ప్రైవేటు బేరసారాల తర్వాత విడుదలవుతున్నవే. కొందరు వ్యక్తులకు, ఇష్టులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. అందుకే విధానాలకు విలువ లేదు. తమ భుజం కాసే మీడియా సంస్థలకు అప్పనంగా కోట్లు అందించడం చంద్రబాబు ప్రభుత్వ స్పెషాలిటీ. అది ఏ విధంగా జరిగిందో ఏ సంస్థకు అంతిమంగా లబ్ధి చేకూరిందో మాజీ చీఫ్ స్పష్టంగా వివరించారు కూడా. ఆ లబ్ధి పొందిన మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో తెలుగుదేశానికి అనుకూలంగా వార్తలను వండివార్చిన వైనం అందరికీ తెలిసిందే. ఒకనాటి గొప్ప దినపత్రికను నేడు ఒక పార్టీ కరపత్రిక తయారు చేసిన ఘనత ఆ వ్యక్తిది. రిటైర్డ్ అధికారులు వేస్తున్న ప్రశ్నలకు చంద్రబాబు ఎందుకు సమాధానం చెప్పరు? ప్రజాస్వామ్యం గురించి అంతగా ప్రవచించే చంద్రబాబు ఏలినవారు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పటం ప్రజాస్వామిక అవసరం అని భావించటం లేదా! అమరావతిలో భూభాగోతం గురించి మాజీ ప్రధాన కార్యదర్శి ఐవిఆర్ కృష్ణారావు వివరించారు. అంచనాలను పెంచి అయిన వారికి కాంట్రాక్టులు కట్టబెడుతున్న వైనం ఆయన సమగ్రంగా వివరించారు. పోలవరం ప్రాజెక్టులో చంద్రబాబు పాత్ర ఏ మేరకో మరో ప్రధాన కార్యదర్శి అజయ్‌కలాం కళ్లకు కట్టినట్లు నిరూపించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాధనం విచ్చలవిడిగా తినేస్తున్న వైనం ప్రతి పౌరుడికి తెలుసు.

దేశంలో ఆకలి కేకలు

- 40 కోట్ల మందికి తిండి లేదు
- ఆర్థికాభివృద్ధి ఉన్నా పట్టెడన్నం దొరకదు
- ఫలితమీయని ఆహార భద్రత చట్టం
- ప్రభుత్వ వైఫల్యానికి ఇదే నిదర్శనం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పోటీపడుతూ పురోగమనం వైపు మళ్ళుతున్నా మన దేశం లో చాలా మంది జనాభాకు ఆహారం అందక అనారోగ్యం తో మరణిస్తున్నా రన్నది అత్యంత ఆందోళన కలిగించే విషయం. ఇండియా స్టేట్ హంగర్ ఇండెక్స్ పరిశోధనలో ప్రకటించినట్టుగా సుమారుగా 40 కోట్ల మందికి తిండి దొరక్క ఆకలి మంట లతో అలమటిం చడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం. దేశం లో పారిశ్రా మీకరణతో ఆర్థికాభివృద్ధి జరుగుతు న్నా, అధిక ఆహార ధాన్యాల ఉత్పత్తి కొనసాగుతున్నా, కొన్ని కోట్ల మందికి పట్టెడన్నం దొరకకపోవడం చాలా బాధాకర మైన విషయం. స్వాతంత్రం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా ప్రజల కనీస అవసరాలైనకుడు, గూడు, బట్టలు ప్రతి పౌరుడికీ అందాల ని రాజ్యాంగం గుర్తించినా ఆహార భద్రతను కల్పిస్తున్నా మని ప్రభు త్వాలు డాంబికాలు పలుకుతున్నా, ఆకలి చావులు తగ్గకపోవడం ఈ వ్యవస్థ వైఫల్యానికి మచ్చుతు నక. ఒకవైపు పేదరికం, రెక్కాడితేనే గాని డొక్కాడని దుస్థితి, దానికి తోడు నిత్యావసర ధరలు ఆకా శానికి అంటడం తో మన దేశ జనాభాలో దాదాపు 12 కోట్ల మందికి రోజూ భోజనం లభించ డం మృగ్యమైపో తోంది. ఈ ఆహారసమస్యను అధిగమించ డానికి, కనీసం 40 కోట్ల మంది కడుపు నింపడానికి, 2013 లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆహార భద్రతా చట్టం ఆశించిన ఫలితా లను అధిగమించడం లో విఫల మయ్యింది. ఈ చట్టం కింద పేదలకునిత్యావసరాలైన బియ్యం, గోధుమలు వంటి రాయితీ సరుకులను అందించడానికి ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయ లు ప్రజా పంపిణీ వ్యవస్థపై ఖర్చు చేస్తున్నా యి. ప్రజా పంపిణీ వ్యవస్థ లొసుగుల మయమై రాయితీసరుకులు నల్ల బజారుకు తరలిపోవడం తో పేదల కడుపులు మల మలా మాడిపోతున్నాయి.12 లక్షల ప్రభుత్వ పాఠ శాలలలో 15 కోట్ల మంది పేద ప్రజల ఆకలి తీర్చడానికి వారిలో పౌష్టికాహార లోపం నివారించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. బాలింతలకు, గర్భిణీలకు, 6 సంవత్సరాల లోపు బాలలకు ఉచిత వైద్య, పౌష్టికాహార సదుపాయాలు కల్పించడానికి 1975 లో ప్రారంభించిన సమగ్ర శిశు సేవా పథకాన్ని(ఐ సి డి ఎస్) కింద 13.56 లక్షల అంగన్ కేంద్రాలను ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే ఆహారం లో నాణ్యత కొరవడడం, పర్యవేక్షణ లోపంతో ఆశయం గొప్పదైనా ఫలితాలు శూన్యంగా ఉంటున్నాయి. మన దేశాన్ని పట్టి పీడిస్తున్న జటిలమైన సమస్యలు పౌష్టికాహార లోపం, రక్త హీనత లను ఎదుర్కోవడంలో దశాబ్దాల తర బడి పాలకుల ఘోర వైఫల్యం కళ్ళరా కనిపిస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం మాత్రమే లభ్యం కావడంతో, కూరగాయలు, నూనెలు, ఇతర నిత్యావసర సరుకుల ఆకాశ యానం చేస్తుండడం తో కూలికి వెళ్ళిన పేదలు పని దొరక్క ,దొరి కిన పనికి కనీసవేతనాలు అందక, ఎక్కువ మంది జనాభా రోగాల పాలవుతున్నారు. మన దేశ జనా భాలో 14.5 శాతం పౌష్టికాహార లోపం, 51.4 సాతం రక్తహీనత, 38 శాతం పిల్లలలో బరువు ఎక్కువా లేక తక్కువ వంటి లోపాలతోబాధపడుతున్నారని జాతీయ సమగ్ర పౌష్టికాహార సంస్థ వెలువరించిన నివేదిక భయాందోళనలకు గురి చేస్తోంది. మన దేశం లో మరొక పెద్ద సమస్య ఆహార నష్టం. గోదాములలో నిల్వ వుంచిన బియ్యం, గోధుములు పళ్ళు,కూరగాయలు పాడైపోయి, పురుగులు పట్టి వృథా అయిపోతున్నాయి. విందులు, వినోదాలలో లక్షల రూపాయల విలువైన ఆహార పదార్థాలు ఏమీ కాకుండా చెత్త కుండీలలో పారబోయడం అత్యంత బాధాకరమైన విషయం. ఈ సమస్య మరింత తీవ్రతరం కాక ముందే ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక వేత్తలు, కార్పొరేట్ సామాజిక సంస్థలు ముఖ్యం గా ప్రజానీకం కలిసికట్టుగా , సమైక్యంగా కృషి సల్పితేనే సమస్య నివారణ సాధ్యప డుతుంది.

మన దేశ జనాభాలో 14.5 శాతం పౌష్టి కాహార లోపం, 51.4 సాతం రక్తహీనత, 38 శాతం పిల్లలలో బరువు ఎక్కువ లేక తక్కువ వంటి లోపాలతో బాధపడు తున్నారని జాతీయ సమగ్ర పౌష్టికాహార సంస్థ వెలువరించిన నివేదిక భయాందో ళనలకు గురి చేస్తోంది. మన దేశంలో మరొక పెద్ద సమస్య ఆహార నష్టం. గోదా ములలో నిల్వ ఉంచిన బియ్యం, గోధుములు పళ్లు, కూరగాయలు పాడై పోయి, పురుగులు పట్టి వృథా అయిపో తున్నాయి. విందులు, వినోదాలలో లక్ష ల రూపాయల విలువైన ఆహార పదార్థా లు ఏమీ కాకుండా చెత్త కుండీలలో పార బోయడం అత్యంత బాధాకరమైన విషయం అని చెప్పక తప్పదు.



బ్యాంకుల్లో మోసాలు రూ. 41167 కోట్లు

న్యూఢిల్లీ : 2018 సంవత్సరం ఆరంభంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో వెలుగు చూసిన కుంభకోణం యావత్ బ్యాంకింగ్ రంగంలోనే సంచలనం సృష్టించింది. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన బంధువు మెహుల్ ఛోక్సీ తదితరులు కలసి పిఎన్‌బికి రూ. 13 వేల కోట్ల మేర కుచ్చుటోపి పెట్టారు. ఇది ఒక్కటే కాదు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో జరిగిన మోసాల విలువ అక్షరాలా రూ. 41167.7 కోట్లు. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తాజా గణాంకాలు వెల్లడించాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ వ్యవస్థలో మోసాలు 72 శాతం పెరిగాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ. 23933 కోట్ల మేర బ్యాంకులు మోసపోగా గత ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ. 41167.7 కోట్లకు పెరిగింది. పిఎన్‌బి కుంభకోణం వల్లే మోసాలు విలువ అమాంతం పెరిగిందని ఆర్‌బిఐ గణాంకాలు తెలియజేశాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో 5076 మోసం కేసులు నమోదు కాగా, గత ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 5917కు పెరిగింది. కాగా, మొత్తం నమోదైన మోసాల్లో 80 శాతం రూ. 50 కోట్లు అంతకు మించినవే. ఇక 93 శాతం కేసుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులే మోసపోయినట్లు ఆర్‌బిఐ వెల్లడించింది.

సంవత్సరాంతంలో ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

- మెరిసిన మెటల్ స్టాకులు
- బలహీనంగా ట్రేడ్ అయిన ఎనర్జీ, ఇన్ఫ్రా, రియల్టీ స్టాకులు
- సెన్సెక్స్ 8 పాయింట్స్ డౌన్... నిఫ్టీ 3 పాయింట్స్ అప్

ముంబయి : 2018 సంవత్సరం చివరి రోజున దేశీయ స్టాక్ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. మెటల్ స్టాకుల అండతో ప్రారంభంలో జోరుగా కొనసాగిన మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అయిన ఎనర్జీ, ఇన్ఫ్రా, రియల్టీ స్టాకుల ప్రభావంతో లాభాలను కోల్పోయాయి. ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో ఈ ఉదయం స్టాక్ మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి. మార్కెట్ ఆరంభంలో సెన్సెక్స్ 150 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది. నిఫ్టీ కూడా 10,900 పాయింట్ల స్థాయిని దాటి కొనసాగింది. అయితే సూచీల జోరు ఎంతోసేపు నిలువలేదు. కీలక రంగాల షేర్లలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా సూచీల ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. నిఫ్టీ 10,900 మార్క్‌ను కోల్పోయింది.

అలా ట్రేడింగ్‌లో చాలా సేపు ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి. ఈ నేపథ్యంలో, సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 8 పాయింట్లు కోల్పోయి 36068కు చేరింది. నిఫ్టీ 3 పాయింట్ల లాభంతో 10863కు పెరిగింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 19 పైసలు కోలుకుని 69.76గా కొనసాగుతోంది. టాటా స్టీల్, వేదాంత, సన్ ఫార్మా, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్ తదితర సంస్థలు లాభాల్లో ముగిశాయి. హీరో మోటోకార్ప్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, హెచ్డీఎఫ్సీ, కోల్ ఇండియా తదితర సంస్థలు నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో టైటాన్, సన్‌ఫార్మా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడగా, భారతీ ఇన్‌ఫ్రాటెల్, భారత్ పెట్రోలియం, టీసీఎస్, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి. ముడిచమురు పీపా ధర 0.94 శాతం ఎగసి రూ. 3215 వద్ద కొనసాగుతోంది.



జేబులో కాలిపోయిన ఐఫోన్

- నష్టపరిహారం కోసం కోర్టుకు ఎక్కుతున్న బాధితుడు
- అమెరికాలోని ఒహాయోలో ఘటన
- మరో ఫోన్ ఇస్తామన్న ఐస్టోర్ నిర్వాహకులు
- గతంలోనూ పేలిన స్మార్ట్ ఫోన్



ఒహాయో : అగ్ర రాజ్యం అమెరికాలో ఓ యువకుడు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఐఫోన్ జేబులో పెట్టుకుని ఉండగా అది పొగలు కక్కుతూ ఒక్కసారిగా కాలిపోయింది. ఈ ఘటనలో యువకుడి కాలికి గాయమైంది. దీంతో సదరు బాధితుడు నష్టపరిహారం కోరుతూ కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అమెరికాలోని ఒహాయో రాష్ట్రానికి చెందిన జె .హిల్లర్డ్ అనే వ్యక్తి ఐఫోన్ ఫోన్ కొన్నాడు. ఈ నెల 12న భోజనం చేస్తుండగా కాలిన వాసన రావడం మొదలైంది.

దీంతో వెంటనే ఫోన్‌ను తీసేయబోగా మంటలు అంటుకుని అది కాలిపోయింది. ఈ క్రమంలో హిల్లర్డ్ కాలికి గాయమైంది. ఈ నేపథ్యంలో కాలిపోయిన ప్యాంటుకు, గాయానికి నష్టపరిహారం ఇవ్వాలని అతను ఐఫోన్ స్టోర్ నిర్వాహకులను కోరాడు. అయితే, కంపెనీ ప్రతినిధులు మాత్రం ఇందుకు నిరాకరించారు. కావాలంటే కొత్త ఫోన్ ఇస్తామని ప్రకటించారు. ఈ ఆఫర్‌ను తిరస్కరించిన హిల్లర్డ్, దీనిపై న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధం అవుతున్నాడు. గతంలోనూ ఓసారి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తుండగా ఐఫోన్ పేలిపోయినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి.

అద్భుత ఫీచర్లతో హువావే నుండి నూతన స్మార్ట్ ఫోన్ విడుదల

- వియత్నాంలో విడుదలైన హువావే వై7 ప్రో 2019
- రెండు కలర్ వేరియంట్‌లలో లభ్యం
- ధర సుమారుగా రూ. 11900



న్యూఢిల్లీ : చైనా మొబైల్ దిగ్గజం హువావే తాజాగా తన నూతన స్మార్ట్ ఫోన్ 'వై7 ప్రో 2019'ని వియత్నాంలో విడుదల చేసింది. భారీ బ్యాటరీ, డ్యూయల్ కెమెరాలతో పాటు పలు ఆకట్టుకునే ఫీచర్లు దీనిలో ఏర్పాటు చేశారు. అరోరా బ్లూ, బ్లాక్ అనే రెండు రంగులలో లభించే ఈ ఫోన్ మన దేశంలో సుమారుగా రూ. 11900 ధరకు లభ్యం కానున్నది.

ప్రత్యేకతలు : 6.26 అంగుళాల ఫుల్ హెచ్‌డి ప్లస్ డిస్‌ప్లే (1520/720 రిజల్యూషన్)
ఆక్టాకోర్ స్నాప్ డ్రాగ్న్ 450 ప్రాసెస్ర్
3 జీబీ ర్యామ్, 32 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్
ఆండ్రాయిడ్ 8.1 ఓరియో ఆపరేటింగ్ సిస్టం
13/2 మెగాపిక్సల్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు
16 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా
4000 ఎంఏహెచ్ బ్యాటరీ.

వినియోగదారులకు వొడాఫోన్ గుడ్ న్యూస్



న్యూ ఇయర్ వేళ బంపరాఫర్

న్యూఢిల్లీ : కొత్త సంవత్సరం వేడుకలకు సిద్ధం అవుతున్న యువతకు వొడాఫోన్ ఐడియా శుభవార్త చెప్పింది. మంగళవారం (జనవరి 1న) ఎటువంటి బ్లాక్ అవుట్ డే ఉండదని ప్రకటించింది. బిఎస్ఎన్ఎల్ బ్లాక్ అవుట్ డేస్ ఎత్తివేసిన రెండు రోజులకే వొడాఫోన్ కూడా అదే పని చేయడం గమనార్హం. జనవరి 1తో పాటు 2019లోని అన్ని ప్రత్యేక రోజుల్లోనూ బ్లాక్ అవుట్ డేస్‌ను ఎత్తివేస్తున్నల వొడాఫోన్ ఐడియా ప్రకటించింది. వొడాఫోన్, ఐడియా ఖాతాదారులు అందరికీ ఇది వర్తిస్తుందని కంపెనీ తెలియజేసింది. ఆయా ప్యాక్‌లకు సంబంధించిన అన్ని ప్రయోజనాలు వారికి లభిస్తాయని తెలిపింది. ఎటువంటి మినహాయింపులూ లేకుండా 365 రోజులు ఇది వర్తిస్తుందని సంస్థ తెలిపింది. సాధారణంగా ప్రత్యేక రోజుల్లో టెలికమ్ కంపెనీలన్నీ బ్లాక్ అవుట్ డేస్ ప్రకటించేవి. ఖాతాదారులకు ఎస్సెమ్మెస్ ప్యాక్ ఉన్నప్పటికీ మెసేజ్‌లకు చార్జీలు వసూలు చేసేవి. అయితే, ఇప్పుడు ఈ బ్లాక్ అవుట్ డేస్‌ను నిలిపివేశాయి. ఇటీవల క్రిస్మస్ సమయంలోనూ వొడాఫోన్ ఐడియా బ్లాక్ అవుట్ డేస్‌ను ఎత్తివేసింది.

మా పాటలు ఎలా వాడతారు?

- హోటళ్లు, పబ్‌లు, కేఫ్‌లు, రిసార్ట్‌లకు నోవెక్స్ కమ్యూనికేషన్ నోటీసులు
- లక్ష పాటలపై తమకు పేటెంట్ ఉందని వెల్లడి
- తమ అనుమతి లేకుండా వాటిని ప్రదర్శిస్తే చర్యలని హెచ్చరిక
- కరపత్రాలు, టిక్కెట్లలో ముద్రణపై అభ్యంతరం



ముంబయి : కొత్త సంవత్సరం వేడుకలకు ముస్తాబవుతున్న హోటళ్లు, పబ్‌లు, కేఫ్‌లు, రిసార్ట్‌లకు నోవెక్స్ కమ్యూనికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు నోటీసులు జారీ చేసి షాక్ ఇచ్చింది. హైదరాబాద్ మహానగరంలోని మొత్తం 79 సెంటర్లకు ఈ నోటీసులు జారీ చేసింది. న్యూ ఇయర్ వేడుకల ప్రచారం కోసం ఆయా సంస్థలు ముద్రించిన కరపత్రాలు, టిక్కెట్లు, హోర్డింగ్‌లపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కాపీ రైట్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేటెంట్ ఉన్న సంస్థల అనుమతి తీసుకోకుండా బాలీవుడ్ పాటలు ప్రదర్శిస్తున్నట్లు ఆయా సంస్థలు ప్రచారం చేసుకోవడాన్ని సంస్థ తప్పు పట్టింది. లక్షకు పైగా పాటలపై తమ సంస్థకు పేటెంట్ ఉందని, ఆయా పాటలను బహిరంగంగా ప్రదర్శించే ముందు తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని నోటీసుల్లో పేర్కొంది. ముంబయికి చెందిన సంస్థ ప్రతినిధి విక్కీ మదన్ డిసెంబర్ 28 సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో ఆయా హోటళ్లు, రిసార్ట్‌ల పేర్లు, చిరునామాలతో ఆధారాలు జత చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు అనుమతి లేకుండా నిర్వహిస్తే జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

న్యూ ఇయర్ సందర్భంగా వంద శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ప్రకటించిన జియో

- రూ.399 రీచార్జ్‌పై వంద శాతం క్యాష్ బ్యాక్
- కూపన్‌ల రూపంలో లభించనున్న క్యాష్ బ్యాక్
- 'ఏజియో' యాప్‌లో లేదా వెబ్‌సైట్‌లో రిడీమ్ చేసుకోవాలి



ముంబయి : న్యూ ఇయర్ సందర్భంగా రిలయన్స్ జియో తన వినియోగదారుల కోసం వంద శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ప్రకటించింది. ఈ ఆఫర్‌లో భాగంగా రూ. 399 రీచార్జ్ చేసుకునే వినియోగదారులు వంద శాతం క్యాష్ బ్యాక్ పొందనున్నారు. ఈ క్యాష్ బ్యాక్ కూపన్‌ల రూపంలో లభించనున్నది. మూడు రోజుల క్రితం నుండే అందుబాటులోకి వచ్చిన ఈ ఆఫర్ వచ్చే నెల జనవరి 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నది. ఈ ఆఫర్‌లో భాగంగా లభించిన కూపన్‌లను 'ఏజియో' యాప్‌లో లేదా వెబ్‌సైట్‌లో రిడీమ్ చేసుకోవాలి. మార్చి 15 వరకు మాత్రమే కూపన్‌లను రిడీమ్ చేసుకోవాల్సి ఉంటుంది.

వంట గ్యాస్ ధర : కొత్త సంవత్సర కానుక



న్యూఢిల్లీ : వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాయితీ లేని వంట గ్యాస్ సిలిండర్‌పై ధర రూ. 120.50 మేర తగ్గింది. రాయితీ గల సిలిండర్‌పై ధర రూ. 5.91 మేర తగ్గింది. ఈ ధరలు మంగళవారం నుంచి అమలులోకి వస్తాయి.

2019లో ఈ ఫోన్లలో

వాట్సాప్ పని చేయదు

న్యూఢిల్లీ : వాట్సాప్ పాత ఓఎస్‌లకు నెమ్మది నెమ్మదిగా సపోర్ట్ ఇవ్వడాన్ని ఆపేస్తూ వస్తోంది. రానున్న కొత్త సంవత్సరం నుంచి కొన్ని ఫోన్లలో వాట్సాప్ పని చేయదని, పలు పాత వర్షెన్ ఓఎస్‌లలో వాట్సాప్‌ను నిలిపేస్తున్నామని కంపెనీ వెల్లడించింది. నోకియా ఎస్40 వర్షెన్‌లో 2019 జనవరి 1 నుంచి వాట్సాప్ పని చేయదని కంపెనీ తెలిపింది. అదే విధంగా, ఆండ్రాయిడ్ వెర్షన్ 2.3.7, అంత కంటే పాత ఆండ్రాయిడ్ వెర్షన్లు, ఐఫోన్ ఐఓస్ 7, అంత కంటే పాత వర్షెన్లలో 2020 సంవత్సరం ఫిబ్రవరి చివరకు వాట్సాప్‌ను నిలిపేస్తామని పేర్కొంది. బ్లాక్‌బెర్రీ 10, బ్లాక్‌బెర్రీ ఓఎస్, నోకియా ఎస్60, విండోస్‌ఫోన్ 8.0లలో ఇప్పటికే వాట్సాప్ పని చేయడం లేదు. నోకియా ఎస్40 ఓఎస్ కంపెనీకి చెందిన మిడ్-టైర్ డివైసెస్ అయిన నోకియా ఆశా 201, నోకియా ఆశా 205, నోకియా ఆశా 210, 230, 500, 301, 502, 503, నోకియా 206, నోకియా 208, నోకియా 301, నోకియా 515 ఫోన్లలో ఉంది. నోకియా ఎస్40 చాలా పాత ఓఎస్. దీనిని 1999లో విడుదల చేశారు. 2005లో అప్‌డేట్ చేశారు. చివరి సారిగా 2013లో నోకియా 515లో అప్‌డేట్ చేశారు.



ఆండ్రాయిడ్ 2.3.7, అంత కన్నా పాత వర్షన్ ఓఎస్‌లపై పని చేసే ఫోన్లు, ఐఫోన్ 7, అంత కన్నా పాత వర్షెన్లతో పనిచేసే ఫోన్లలో 2020 ఫిబ్రవరి 1 నుంచి వాట్సాప్ పని చేయదు.

ఫిట్‌బిట్ చార్జ్ 3 ఫిట్‌నెస్ ట్రాకర్ విడుదల



న్యూఢిల్లీ : ఫిట్‌నెస్ ప్రికరాల త్యారీ కంపెనీ ఫిట్‌బిట్ 'చార్జ్ 3' పేరిట ఓ కొత్త ఫిట్‌నెస్ ట్రాకర్‌ను సోమవారం భారత మార్కెట్‌లో విడుదల చేసింది. ఇందులో స్లీప్ ట్రాకింగ్, స్విమ్ ప్రూఫ్ డిజైన్, టచ్ స్క్రీన్ డిస్‌ప్లే, 7 రోజుల బ్యాటరీ లైఫ్, గొరిల్లా గ్లాస్ 3 ఓలెడ్ డిస్‌ప్లే, ఎస్‌పీఓ2 సెన్సార్ తదితర ఫీచర్లు అందిస్తున్నారు. ఈ ఫిట్‌నెస్ ట్రాకర్ రూ. 13999 ధరకు వినియోగదారులకు లభిస్తున్నది. ఈ ఫిట్‌నెస్ ట్రాకర్‌కు చెందిన స్పెషల్ ఎడిషన్ వేరియెంట్‌ను రూ. 15999 ధరకు విక్రయిస్తున్నారు. ఇక ఈ ట్రాకర్‌కు ప్రత్యేక బ్యాండ్లు కూడా విడిగా అందిస్తున్నారు. క్లాసిక్ బ్యాండ్ ధర రూ. 2990 ఉండగా, వోవెన్ బ్యాండ్ ధర రూ. 3490 గా ఉంది. లెదర్ బ్యాండ్‌ను రూ. 4490 ధరకు అందిస్తున్నారు.

రూ. 19567 కోట్లు : బ్యాంకుల్లో మూలుగుతున్న ఈ సొమ్ము ఎవరిదీ కాదట!

- నిరుటితో పోలిస్తే ఇది 33 శాతం ఎక్కువ
- డీఈఏకు బదలీ కానున్న సొమ్ము
- గడువులోపు రీ క్లెయిమ్ చేసుకునే అవకాశం

న్యూఢిల్లీ : ఈ ఏడాది జూన్ నాటికి బ్యాంకుల్లో ఎవరూ క్లెయిమ్ చేసుకోని సొమ్ము రూ. 19567 కోట్లు ఉందని ప్రభుత్వం వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది ఏకంగా 33 శాతం అధికం కావడం గమనార్హం.

గత ఏడాది బ్యాంకుల్లో ఎవరూ క్లెయిమ్ చేసుకోని సొమ్ము రూ. 14697 కోట్లు కాగా, ఈసారి అది రూ. 19567 కోట్లకు పెరగడం విశేషం. ఈ సొమ్మును భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ)కి చెందిన డిపాజిట్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదలీ చేయనున్నారు.

గత పది సంవత్సరాలుగా ఎవరూ నిర్వహించకుండా ఉన్న బ్యాంకు ఖాతాలు, డిపాజిట్లను డీఈఏ చూసుకుంటుంది. ఒకసారి ఈ క్లెయిములు సెటిల్ అయిన తరువాత ఈ సొమ్మును ఆర్థిక అవగాహనను మెరుగుపరిచేందుకు ఉపయోగిస్తుంది.

ఈ సొమ్మును డీఈఏ ఫండ్‌కు బదలీ చేసినప్పటికీ తమ సొమ్మును వెనక్కి తీసుకునే వెసులుబాటు ఖాతాదారులకు ఉంటుంది. అయితే, గడువులోపు అందుకు సంబంధించిన విధి విధానాలను పూర్తి చేయాల్సి ఉంటుంది.



కోర్టు ఎదుట లొంగిపోయిన సజ్జన్ కుమార్

న్యూఢిల్లీ : 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో ఇటీవల యావజ్జీవ జైలు శిక్ష పడిన సజ్జన్ కుమార్(73) సోమవారం ఢిల్లీ కోర్టులో లొంగిపోయారు. అనంతరం సజ్జన్ కుమార్‌ను తూర్పు ఢిల్లీలోని మండోలి జైలుకు తరలించారు. భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక వాహనంలో సజ్జన్ కుమార్ ను జైలుకు తరలించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల సందర్భంగా ఐదుగురు సిక్కుల హత్య, ఓ గురుద్వారాను దగ్ధం చేసిన కేసులో హైకోర్టు సజ్జన్‌కు మరణించే వరకూ జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 31లోగా పోలీసు ఎదుట లొంగిపోవాలని కూడా ఆదేశించింది. తనకు ముగ్గురు పిల్లలు, ఎనిమిది మంది మనుమలు, మనుమరాండ్లు ఉన్నారని, వారికి సంబంధించిన విషయాలు, ఆస్తి పంపకాలు ఉన్నాయని తెలు వుతూ, వాటిని పరిష్కరించేందుకు తనకు జనవరి 31వరకు గడువు కావాలని సజ్జన్ తన పిటిషన్‌లో కోరారు. అయితే ఆ పిటిషన్‌ను కోర్టు తోసివుచ్చిన నేపథ్యంలో సోమవారం కోర్టు ఎదుట సజ్జన్ లొంగిపోయారు.



రాజ్యసభలో గందరగోళం

• ట్రిపుల్ తలాక్ బిల్లుకు బ్రేక్ • బిల్లును అడ్డుకున్న విపక్ష పార్టీల సభ్యులు • బిల్లును సెలెక్ట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని డిమాండ్ • ప్రభుత్వానికి సవాల్‌గా మారిన బిల్లు • దేశవ్యాప్తంగా బిల్లుపై పెద్ద ఎత్తున చర్చలు • రాజ్యసభలో సెలెక్ట్ కమిటీ వేయాలన్న తృణమూల్ కాంగ్రెస్ • తలాక్ చెప్పిన భర్తకు జైలు శిక్ష సరికాదంటున్న విపక్షాలు



న్యూఢిల్లీ: ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి భార్యకు ట్రిపుల్ తలాక్ చెబితే దాన్ని నేరంగా పరిగణిస్తూ కేంద్రం తీసుకొచ్చిన బిల్లు రాజ్యసభలో ప్రవేశ పెట్టింది. అయితే విపక్ష పార్టీల సభ్యులు బిల్లును అడ్డుకున్నారు. బిల్లును సెలెక్ట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని డిమాండ్ చేశాయి. దీనిపై సభలో గందరగోళం నెలకొనడంతో ఛైర్మెన్ జనవరి 2కు సభను వాయిదా వేశారు. ఇదిలా ఉంటే రాజ్యసభలో ఈ బిల్లు పాస్ చేసేందుకు ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఇందుకు కారణం రాజ్యసభలో ప్రభుత్వానికి సభ్యుల మద్దతు తక్కువగా ఉండటంతో దీనిపై ఆసక్తి నెలకొంది. ముస్లిం సామాజిక వర్గంలో తలాక్ చెప్పి భార్యకు భర్త విడాకులు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు సంచలన తీర్పును గతేడాది ఇచ్చింది. ఇక అప్పటి నుంచి దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి. ఈ క్రమంలోనే ముందుగా కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఆ తర్వాత లోక్‌సభలో బిల్లును ఆమోదం పొందేలా చూసింది. ఇక రాజ్యసభలో బిల్లును పాస్ చేయడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. ఇప్పటికే ప్రభుత్వానికి సంఖ్యాబలం తక్కువగా ఉండటం, దీనికి తోడు ఇతర పార్టీల నుంచి మద్దతు లభించకపోవడంతో బిల్లు మరోసారి చర్చనీయాంశమైంది. బిల్లును మరోసారి పరిశీలించాలని ఇందుకు సెలెక్ట్ కమిటీ వేయాలని సభలో కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే ప్రభుత్వం ఇందుకు తిరస్కరించింది. ఇదిలా ఉంటే రాజ్యసభలో సెలెక్ట్ కమిటీ వేయాలని తృణమూల్ కాంగ్రెస్ కూడా పట్టుబట్టింది. అంతకుముందు పార్లమెంటు హాలులో కలిసిన విపక్ష పార్టీల సభ్యులు సెలెక్ట్ కమిటీ వేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తీర్మానించారు. ఇక బిల్లు విషయానికొస్తే తలాక్ చెప్పిన భర్తకు మూడేళ్లు జైలు శిక్ష వేయడం సరికాదని విపక్షాలు చెబుతున్నాయి. ఇతర మతాల్లో విడాకులు చెబితే ఇలాంటి శిక్ష లేదని వారు వాదిస్తున్నారు. అంతేకాదు ఒకవేళ భర్త జైలుకు వెళితే భార్యా పిల్లలకు మెయింటెనెన్స్ ఎవరిస్తారని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. విపక్షాలు ఎన్ని చెప్పినప్పటికీ ప్రభుత్వం మాత్రం బిల్లుపై ముందుకు వెళ్లాలనే నిర్ణయించింది.

తొలి వేడుకలు న్యూజిలాండ్‌లో



ఆక్లాండ్: ప్రపంచ వ్యాప్తంగా న్యూ ఇయర్ సంబరాలు ప్రారంభమయ్యాయి. న్యూజిలాండ్‌లో కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్ని తాకాయి. న్యూజిలాండ్ దేశ రాజధాని ఆక్లాండ్ స్కై టవర్ వద్ద ప్రజలు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. టపాకాయలు కాలుస్తూ ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. 2018 ఏడాదికి వీడ్కోలు పలికారు. కొత్త ఏడాదికి స్వాగతం చెప్పారు. న్యూజిలాండ్ ప్రజలు అప్పుడే 2019 ఏడాదికి స్వాగతం పలికారు. కొత్త ఏడాదికి ప్రపంచంలో న్యూజిలాండ్ ప్రజలు అప్పుడే స్వాగతం చెప్పారు. మిగిలిన దేశాలు కూడ కొత్త ఏడాదికి స్వాగతం చెప్పేందుకు సిద్ధమయ్యారు. న్యూజిలాండ్ తర్వాత అస్ట్రేలియావాసులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

ముహూర్తం 'పక్కా'



కూడా అంతే ఘనంగా ఉండాలన్నది ఆయన కోరిక. ఈసారి మంత్రివర్గంలో బెర్త్‌ను ఆశిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భారీగా ఉండటంతో అచీ, తూచి అడుగువేయబోతున్నారు. ఉమ్మడి 10 జిల్లాలో ప్రతి జిల్లా నుంచి ముగ్గురు, నలుగురు మంత్రి పదవులను ఆశిస్తున్నారు. ఇందులో సీనియర్లు సైతం బాగానే ఉన్నారు. అయితే ఇప్పటికే మహమ్మూద్‌అలీని కేబినెట్‌లోకి తీసుకోవడంతో ఇక మిగిలింది 16 మంత్రులే. 16 మంత్రి పదవులకు దాదాపు 30-40మంది పోటీ పడుతున్నారు. మంత్రి పదవులు ఆశిస్తున్న వారు ఇటు బాస్ కేసీఆర్‌ను, అటు పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కొంత మంది ఏదో పనిమీద కలుస్తూ 'కేబినెట్'లో స్థానం కల్పించాలంటూ గుర్తుచేస్తున్నారు. అయితే గులాబిదళపతి, సీఎం కేసీఆర్ ఈ సారి 'జట్టు' ఎంపికలో అన్ని సామాజిక వర్గాలకు స్థానం కల్పించడంతో పాటు ఆయా సామాజిక వర్గాలకు చెందిన నేతల పేర్లు ఇప్పటికే ఖరారు చేసినట్లు ప్రచారం సాగుతున్నది. సీఎం కేసీఆర్ వెన్నంటి ఉంటున్న పలువురికి మంత్రియోగం లభించనున్నట్లు పార్టీలో విస్తృత ప్రచారం సాగుతున్నది. గతంలో మంత్రులుగా పనిచేసిన కొంతమందికి పార్టీ బాధ్యతలు అప్పగించడం, మరి కొందరికి కేబినెట్ కార్యదర్శుల హోదాల్లో నియమించాలని నిర్ణయించినట్లు సమాచారం. గత కేబినెట్‌లో మహిళా మంత్రి లేకపోవడంపై విపక్షాలు ఎదురుదాడులు చేసిన విషయాన్ని పరిగణలోకి తీసుకొన్న సీఎం ఈ సారి మంత్రివర్గంలో ఒక మహిళకు తప్పకుండా ప్రాతినిథ్యం ఇవ్వబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ముందు వరుసలో కొందరు : ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గం కూర్పులో ముందువరుసలో కొంతమంది పేర్లున్నట్లు సమాచారం. ఇందులో ముఖ్యమంత్రికి అత్యంత ఆప్తుడు అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డికి స్థానం లభిస్తుందన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈసారి కూడా హరీశ్‌రావు, కేటీఆర్, ఈటెల రాజేందర్‌కు కీలకశాఖలు లభించేవీలులేకపోలేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన జైపాల్‌యాదవ్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశాలున్నట్లు సమాచారం. హైదరాబాద్ జిల్లా నుంచి గతంలో నలుగురు మంత్రివర్గంలో ఉంటే ఈ సారి ఇద్దరికి మాత్రమే చోటు లభించే వీలుందంటున్నారు. ఇందులో తలసాని శ్రీనివాస్‌యాదవ్, దానం నాగేందర్ పేర్లు వినిపిస్తున్నాయి. గత మంత్రివర్గంలో పనిచేసిన పద్మారావుకు చోటు కల్పిస్తే దానం నాగేందర్ ఔట్ అన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. ఇక వరంగల్ జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం లభించనున్నట్లు సమాచారం. ఇందులో ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్‌కు బెర్త్ ఖాయమన్న ప్రచారం సాగుతున్నది. నల్గొండ జిల్లా నుంచి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఈసారి మంత్రివర్గంలో చోటుంటుందంటున్నారు. ఖమ్మం జిల్లా నుంచి పువ్వాడ అజయ్‌కుమార్‌కు గాని లేక మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌కుకాని అవకాశం లభిస్తుందన్న ప్రచారం సాగుతున్నది. నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఈ సారి బెర్త్‌లో స్థానం లభించబోదని ప్రచారం సాగుతున్నది. ఈ జిల్లా నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌కుగాని, నిత్యం సీఎం కేసీఆర్ వెన్నంటి ఉంటూ, ఆయనకు నమ్మినబంటుగా ఉన్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి చోటు ఖాయమంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఈసారి ఆంధ్ర సెటిలర్లలో ఒకరిని నియమించాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచారం. ఇందులో ముందువరుసలో అరికెపూడి గాంధీ పేరు వినిపిస్తున్నది. లేని పక్షంలో కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌కు అదృష్టం ఉన్నట్లు సమాచారం. అదిలాబాద్ జిల్లా నుంచి మాజీ మంత్రి జోగురామన్నకుగాని, కోనేరుకోణప్ప పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. కరీంనగర్ జిల్లానుంచి గెలిచిన మాజీ ఎంపీ బాల్కసుమన్‌ను కేబినెట్‌లో స్థానం లభించనున్నట్లు సమాచారం. ఎస్సీవర్గాల నుంచి భారీగా ఆశావహులు ఉన్నారు. అయితే ఈసారి కూడా ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి తప్పకుండా మంత్రివర్గంలో చోటు లభిస్తుందన్న ప్రచారం పార్టీలో సాగుతున్నది. సంక్రాంతి పండుగ తర్వాత ముహూర్తం : సంక్రాంతి పీడదినాలు వెళ్లిన తర్వాత మంచి ముహూర్తం చూసుకొని కేబినెట్‌ను విస్తరించనున్నట్లు ఇటీవల సీఎం కేసీఆర్ తెలిపిన విషయం విధితమే!. సంక్రాంతి పండుగ తర్వాత మంచి ముహూర్తంలో సీఎం కేసీఆర్ కేబినెట్ జట్టు ప్రమాణ స్వీకారం చేయనుంది. అయితే మంత్రిపదవులు ఆశిస్తున్న సీనియర్లు, పార్టీ కోసం కష్టపడుతున్న మరికొందరికి కేబినెట్ హోదాతో పార్లమెంటరీ కార్యదర్శులను నియమించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మొదటి పేజీ తరువాయి

భావోద్వేగ వాతావరణం



వెళ్తుండడంతో.. వారికి తెలంగాణ ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కొంతమంది ఉద్యోగులైతే కంటతడి పెట్టుకున్నారు. ఇన్నాళ్ల అనుబంధం నేటితో తెగిపోతోందని ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ న్యాయవాదులు, సిబ్బంది తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం మూడు బస్సుల్లో ఏపీ ఉద్యోగులు అమరావతికి బయల్దేరారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. జస్టిస్ ప్రవీణ్‌కుమార్ జనవరి 1వ తేదీ నుంచి విధులు నిర్వర్తించనున్నారు. కాగా జస్టిస్ టీబీ రాధాకృష్ణన్‌ను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. అదేవిధంగా జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ వి. రామసుబ్రమణియన్‌ను తెలంగాణ హైకోర్టుకు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 13కు చేరింది.

విభజనతో.. పూర్వ హైదరాబాద్ రాష్ట్రం నుంచి తెలంగాణ ఆంధ్రతో కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక నవంబర్ 5వ తేదీ 1956లో ఈ హైకోర్టును ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర విభజనలో భాగంగా జూన్ 2వ తేదీ, 2014 నుంచి ఆంధ్రప్రదేశ్ రికగ్నైజేషన్ యాక్ట్ 2014 అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి ఈ హైకోర్టు రెండు రాష్ట్రాలకు సంబంధించినదిగా ఉంటూ, సేవలందిస్తున్నది. ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఉండాలని చెబుతున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 214తో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014 ప్రకారం, హైకోర్టును విభజిస్తూ ప్రకటన వెలువరించారు. ఏపీకి ఆ రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రత్యేక హైకోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న ఉమ్మడి హైకోర్టును తెలంగాణ రాష్ట్ర హైకోర్టుగా గుర్తించారు. జనవరి 1వ తేదీ నుంచి అందులోనే తెలంగాణ కార్యకలాపాలు కొనసాగుతాయని, అమరావతిలోని నేలపాడులో నిర్మిస్తున్న తాత్కాలిక హైకోర్టు నూతన భవనాల్లో ఏపీ హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

హైకోర్టు వద్ద రాయలసీమ న్యాయవాదుల ఆందోళన...


ఉమ్మడి హైకోర్టు విభజనను నిరసిస్తూ ఏపీ న్యాయవాదులు హైకోర్టు వద్ద ఆందోళనకు దిగారు. రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ హైకోర్టు వద్ద రాయలసీమకు చెందిన న్యాయవాదులు డిమాండ్ చేశారు. రాష్ట్రపతి నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హైకోర్టు విభజనకు కొంత సమయం కావాలని కోరుతూ ఏపీ న్యాయవాదులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించడంతో విభజకు లైక్లియరైంది. దీంతో ఏపీకి చెందిన న్యాయవాదులు, న్యాయసిబ్బంది అమరావతికి తరలివెళ్లక తప్పట్లేదు.

రైతులే కీలకం



ఆదుకునే విషయంలోయావత్ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని సిఎం చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ తీరుతెన్నులపై, భవిష్యత్తులో అవలంభించాల్సిన విధానాలపై, మహిళా సంఘాలను ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులలో భాగస్వాములను చేయటంపై, తెలంగాణలోని వివిధ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు సంబంధించి సోమవారం మధ్యాహ్నం ప్రగతిభవన్ లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఒ అధికారులు నర్సింగ్ రావు, భూపాల్ రెడ్డి, స్మితాసభర్వాల్, డిజీపి మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు అనురాగ్ శర్మ, మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి, టిఎస్ఐఐసి ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు, శాసనమండలి చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, ఆనంద్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దురదృష్టవశాత్తు చాలా విషయాల్లో సరైన గణాంకాలు లేకపోవటంవల్ల, సరైన నిర్ణయానికి రావటం కష్టమవుతున్నది. ఈ రాష్ట్రంలో ఎంత ధాన్యం పండుతుంది, ఎంతమేరకు పండ్ల ఉత్పత్తి జరుగుతున్నది, ఏ మేరకు ప్రజల ఆహార అవసరాలు తీరుతున్నవి? అనే విషయాలపై సరైన గణాంకాలు ఉండాలి. వ్యవసాయ, ఉద్యాన వన శాఖలు, సంబంధిత ఇతర శాఖలు ఒకదానికి ఒకటి సంబంధ అనుబంధంగా పనిచేస్తే మంచి ఫలితాలొస్తాయి. దీనికొరకు ఎమి చేయాలో ఆలోచించాలి. దీని ద్వారా రైతుల్లో అశాంతి పూర్తిగా తొలిగిపోతుంది. దీనికి మొదటి అడుగుగా రైతు సమన్వయ సమితుల ఏర్పాటు జరిగింది. వాళ్లకు క్రమపద్ధతిలో శిక్షణనివ్వాలి. తరువాత వ్యవసాయ విస్తరణాధికారులను నియమించడం జరిగింది. భూమి లెక్కలు కూడా తేల్చటం జరిగినందున వ్యవసాయ అనుకూల భూమి ఎంతుందో తేలింది. పండిన పంటకు గిట్టుబాటు ధర లభించాలి. ఇదంతా ఒక గొలుసుకట్టు కార్యక్రమంలాగా జరిగితే తద్వారా వ్యవస్థ బాగుపడితే చాలామంచిది అని సిఎం అన్నారు. రైతులందరూ ఒకే రకమైన పంట వేస్తే సమస్యలు తలెత్తుతాయి కనుక పంట మార్పిడి కొరకు వాళ్లకు అవగాహన కల్పించాలి. రైతుల సంప్రదాయబద్ధమైన కొన్ని అలవాట్లలో కొంత మార్పు రావాలి. అందరూ రైతులు ఒకే రకమైన పంట వేస్తే జరిగే లాభనష్టాలమీద చర్చ జరగాలి. ముల్కనూరు గ్రామం అనుభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అక్కడ సహకార పద్ధతిలో రైతులను సంఘటిత పరచడం ద్వారా గొప్ప ఫలితాలు సాధించడం జరిగింది. రైతులకు పలనా విధంగా నడుచుకుంటే లాభం కలుగుతుందని వ్యవసాయ శాఖాధికారులు నమ్మకం కలిగించగలిగితే బ్రహ్మాండమైన ఫలితాలు వస్తాయి. వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త అశోక్ గులాటిని ఢిల్లీలో కలిసి ఈ విషయాలలో వర్క్ షాప్ నిర్వహించాలని మన రాష్ట్రానికి ఆహ్వానించాను. త్వరలో ఆయన మన రాష్ట్రానికి వస్తారు అని సీఎం తెలిపారు. పంటల కాలనీలుగా విభజన : రాష్ట్రాన్ని ఖచ్చితంగా పంట కాలనీలుగా విభజించాలని సీఎం ఆదేశించారు. రైతు పండించే పంటకు డిమాండ్ ఉండాలె. మన ఆహార అవసరాలేంటో తెలుసుకోవాలె. రైతాంగం ఏ పంటలు వేయడానికి అలవాటు పడ్డదో అర్థం చేసుకుని ఒకే సారి వాళ్లమీద మన అభిప్రాయాలను రుద్దకుండా అంచలంచలుగా పంట కాలనీల విషయంలో అవగాహన కలిగించాలె. గ్రామీణ ఆహార అవసరాలతో పాటు, నగర-పట్టణ ప్రజల ఆహార అవసరాలకు తగు విధంగా ఉత్పత్తులు జరగాలె. కూరగాయలు, కొత్తిమీర, జీలకర్ర లాంటివి కూడా దిగుమతులు చేసుకోవడం దురదృాఎష్టం. నగరాల-పట్టణాల దరిదావుల్లో కూరగాయల పెంపకం జరగాలె. వచ్చే వానకాలం కల్లా కాళేశ్వరం నీళ్లు వస్తాయి. కొత్త ఆయకట్టు వస్తుంది. రాబోయే రెండు సంవత్సరాల్లో నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తయి కోటి ఎకరాలకు పైగా సాగునీరందుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. చెరువులు నిండుతాయి. ఈ నేపథ్యంలో ఎటువంటి భూమిలో ఎలాంటి పంట వేయాలో రైతులకు అవగాహన కలిగించాలని కోరారు. ఎటువంటి రకమైన వ్యవసాయ ఉత్పత్తినైనా ప్రాసెస్ చేస్తే దాని ధర పెరుగుతుంది. ఉదాహరణకు మిరపకాయ నుండి కారంపొడి లేదా పసువు కొమ్ముల నుండి పసువు తీసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వస్తువు కొనాలన్నా కల్తీ అవుతున్నది. మనం గనక మార్కెట్లో ఒక బ్రాండ్ నేమ్ మన ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులకు అదీ ప్రభుత్వ పరంగా తయారైన వస్తువన్న నమ్మకం కలిగించాలె. దీనికొరకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రారంభించాలె. మన ఆలోచనలను కార్యరూపంలో తీసుకుని వచ్చి అమలు పరచాలె. ఏ ప్రాంతంలో ఎన్ని ఫుడ్ ప్రాసెసింగ్, ఏ రకమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వుండాలో నిర్ణయించాలె. విదేశాలకు ఎగుమతి చేయాలి : మన రాష్ట్ర అవసరాలకు సరిపోను మిగిలినవి పక్క రాష్ట్రాల్లో, విదేశాలకు ఎగుమతి చేయాలె. ఈ యావత్ ప్రక్రియలో ఐకెపి-మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలి. ఎ మేరకు వీరిని భాగస్వాములను చేయవచ్చో అధ్యయనం చేయాలె. 130 కోట్ల ప్రజలున్న మన దేశం పెద్ద దేశీయ మార్కెట్. ఏ రాష్ట్రంలో ఏది పండదో దాన్ని విశ్లేషించి మన వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా వాటిని పండించగలగాలె. తద్వారా వుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులను తయారు చేయాలె. దేశ విదేశాల్లో అత్యుత్తమమైన వుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఎక్కడుందో గుర్తించి అలాంటిది మన రాష్ట్ర వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాటు చేసుకునే విషయం అధ్యయనం చేయాలని సీఎం చెప్పారు. రైతులు నియంత్రిత విధానంలో పంటలు పండించేలా చూడాలి. ప్రతి కుంట భూమిలో ఏ విత్తనం పెడుతున్నామో వ్యవసాయ శాఖకు తెలవాలె. ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండం : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా వుందని, వచ్చే అయిదేళ్లలో రూ. 10 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయబోతున్నామని, అన్నీ విధాల మన పెరుగుదలకు అవకాశాలున్నాయని, అందుకే మూస పద్ధతిలో ఆలోచించకుండా నూతన వరవడికి సిద్ధం కావాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో జరిగిన చర్చల ప్రాతిపదికగా ఆలోచనలు పంచుకుని ఎలా ముందుకు పోవాలో నిర్ణయించాలని అధికారులను కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఒక సామూహిక ప్రయత్నమని, మహిళా బ్యాఎందాలతో పాపటు పలువురని ఇందులో భాగస్వాములను చేయాలని సిఎం చెప్పారు.

ఫలితం ట్యాంపరింగ్



చెబుతాడన్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న దగ్గర ఓట్లు తొలగించారని ఆరోపించారు. 48 మిషన్ లు చెడిపోయాయని, 38 మిషన్ లు పని చేయలేదన్నారు.రీ కౌంటింగ్ అవసరం ఉన్న దగ్గర కూడా రీ కౌంటింగ్ చేయలేదన్నారు. మధ్యాహ్నం వరకు కనీసం 50 శాతం దాటని ఓటింగ్ పర్సెంటేజ్..5 గంటల తరువాత 80 శాతం కు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులను విచ్చల విడిగా తమ అధికారాన్ని దుర్వినియోగం చేసే విధంగా టీఆర్ఎస్‌నేతలు పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో పాలన విడిచి రాష్ట్రాలు తిరిగి రావడానికి కేసీఆర్ వెళ్ళాడు. కేసీఆర్ ఒడిశా, బెంగాల్ ఫెడరల్ ఫ్రాంట్ కోసం వెళ్లలేదు మోడీ కి సపోర్ట్ చేయడానికి వెళ్ళాడని ఆరోపించారు. కార్మిక శాఖ మంత్రి గా ఉనప్పుడు చేసిన అవినీతి తప్పించుకోవడానికి మోడీ దగ్గరకి వెళ్ళాడు. రాష్ట్రంలో ప్రజాకూటమి కొనసాగుతుందని ఓ ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఇందుకు సంబందించిన ఆధారాలు మాదగ్గర ఉన్నాయని కుంతియా తెలిపారు. కొంతమంది వ్యక్తులు ,ఈవీఎం ట్యాపరింగ్ ,పోలీసులుతో అధికార దుర్వినియోగంతో నే టీఆర్ఎస్ గెలిచిందని ఆరోపించారు. ఎన్నికల్లో, పోలింగ్‌లో జరిగిన ఈ అవకతవకలు ,ఉల్లంఘనలపై సీఈసీ ,రాష్ట్రపతి కి పిర్యాదు చేస్తామని తెలిపారు. లెక్కింపు అయి ఇరవై రోజులు అయినా ఎమ్మెల్యేల తో ప్రమాణ స్వీకారం చేయించక పోవడం దారుణమన్నారు. మోడీకి సపోర్ట్ చేసేందుకే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ టూర్స్ అంటూ ఎద్దేవా చేశారు. సీబీఐ కేసుల భయంతోనే కేసీఆర్ మోడీకి బి టీంగా మారారని పేర్కొన్నారు. ఓడినంత మాత్రాన కాంగ్రెస్ పని అయిపోయిందనుకుంటే అనుకుంటే పొరపాటన్నారు. ఓటమి కి భయపడమని, పంచాయితీ, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతామని ఆయన తెలిపారు.

ఉద్దానానికి అభయం



పలికారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వ ఉద్యోగులతోపాటు, కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు తమ వినతిపత్రాలు వై.ఎస్.జగన్‌కు అందజేశారు. తమకు న్యాయం జరగడంలేదని జీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు వేడుకోగా, తిత్లీ తుఫాను సహాయం తమకు కాకుండా కేవలం టీడీపీ వారికే దక్కిందని తుఫాను బాధితులు వేడుకొన్నారు.

కిడ్నీ బాధితులకు అభయం : ప్రజల సమస్యలు తెలుసుకోని.. వారిలో భరోసా నింపడానికి ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర శ్రీకాకుళం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతుంది. సోమవారం వై.ఎస్.జగన్ పాదయాత్ర శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంతంలోకి ప్రవేశించింది. అక్కడ వైఎస్ జగన్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నవారిని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు తమ సమస్యలను జగన్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సాయం అందడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ముగ్గురు, నలుగురు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నవారుంటే ఇంటికి ఒక్కరికి మాత్రమే దయాలసిస్ చేస్తున్నారని వారు వైఎస్ జగన్‌కు తెలిపారు. ప్రభుత్వం తమకు ఎలాంటి పెన్షన్ ఇవ్వడం లేదని వాపోయారు. ఆస్పత్రికి వెళ్తే మందులు కూడా లేవంటున్నారని చెప్పారు. ఉయాలసిస్ యంత్రాలు సరిపోక రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తుందని అన్నారు. కిడ్నీ వ్యాధితో వందల మంది చనిపోతున్నారని పేర్కొన్నారు. కిడ్నీ బాధితుల సమస్యలపై స్పందించిన వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే కిడ్నీ బాధితులకు పదివేల రూపాయల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కిడ్నీ బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఇదిలావుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర 334వ రోజు ముగిసింది. వై.ఎస్.జగన్ సోమవారంనాడు 11.1 కిలోమీటర్లు నడిచారు. ఉదయం వై.ఎస్.జగన్ పలాస నియోజకవర్గం రాజాంకాలనీ నుంచి ప్రజాసంకల్పయాత్ర ప్రారంభించారు. అక్కడి నుంచి ధర్మపురం, గరుఢభద్ర, తర్లగాదురు క్రాస్,అక్కుపల్లి, గాదురు, చీపురుపల్లి జంక్షన్ మీదుగా డెప్పురు వరకు పాదయాత్ర కొనసాగించారు. ఇప్పటివరకు వైఎస్ జగన్ 3,574.1 కిలోమీటర్లు నడిచారు.

నేటి షెడ్యూల్ ఇలా : ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర 335వ రోజు షెడ్యూల్ ఖరారైంది. మంగళవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం వంకులూరు క్రాస్ నుంచి వై.ఎస్.జగన్ పాదయాత్ర ప్రారంభిస్తారు. అక్కడి నుంచి చిన్న వంకులూరు, అనకాపల్లి క్రాస్, రంగోయి క్రాస్, రాంనగర్, బహదపల్లి, నల్లబొడ్లూరు, గుజ్జులూరు, బి జగన్నాథపురం మీదుగా నారాయణపురం వరకు వైఎస్ జగన్ పాదయాత్ర కొనసాగిస్తారు.



రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారాయడానికి పోలీసులపై దాడే మచ్చుతునక: సిపిఐ రామకృష్ణ

విజయవాడ, సూర్య బ్యూరో : తాడిపత్రిలో మట్కా మాఫియా రెచ్చిపోయి పోలీసులపై దాడికి పాల్పడడమే రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవనడానికి మచ్చుతునకంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కె.రామకృష్ణ నేడొక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో మట్కా మాఫియా రెచ్చిపోయి సాక్షాత్తూ పోలీసులను బంధించి, దాడికి తెగబడడం, వాహనానికి నిప పెట్టడం అమానుషమన్నారు. ఈ ఘటనలో సిఐ హమీద్‌ఖాన్‌తో సహా ముగ్గురు కానిస్టేబుళ్లకు తీవ్రగాయాలవ్వడం జరిగిందన్నారు. పోలీసులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన జె.సి. మద్దతు ఉన్నదనే ధైర్యంతోనే మట్కా నిర్వాహకులు ఈ దాడికి తెగబడ్డారన్నారు. పోలీసులకే రక్షణలేని ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారుతున్నాయనడానికి ఇదో మచ్చుతునక అని అన్నారు. ఈ ఘటనపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి 40 కిలోమీటర్ల దూరంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గత ఆగడాలు మితిమీరిపోతున్నా చంద్రబాబుకు పట్టలేదు. ఇపడు పోలీసులపైనే గూండాయిజం జరిగిందన్నారు. ప్రజాస్వామిక వ్యవస్థను నిర్వీర్యం చేయడంతోనే ఇటువంటి ఘటనలు తలెత్తుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి అలసత్వానికి, నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తక్షణమే ఒమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ల చేస్తున్నామన్నారు. పోలీసు శాఖలోని అధికారులు కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలోచన చేయాల్సిందిగా, శాంతిభద్రతలు పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నామన్నారు. ప్రజాసమస్యలపై శాంతియుత ఆందోళన చేస్తుంటే ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ విరుచుకుపడే పోలీసులు


పంచాయతీ ప్రతిష్టాత్మకం

- నేతలకు సవాలుగా మారిన పంచాయతీ
- పంచాయతీ ఎన్నికల్లో గెలుపే ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత
- ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాలు గెలవాలని సూచించిన కేటీఆర్
- గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్న నేతలు

కరీంనగర్-సూర్యప్రధానప్రతినిధి:గ్రామ పంచాయితీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొంది క్లీన్‌స్వీప్ చేయాలని అధికార పార్టీ లక్ష్యంగా పెట్టుకొంది. గెలుపు గుర్రాలను ఎంపిక చేయాలని టీఆర్‌ఎస్ అధినేత కేసిఆర్ ఆ పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యనేతలకు సూచించడం చర్చనీయాంశంమైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలతో సెల్‌ఫోన్‌లో మాట్లాడిన ఆయన ఓట్ల నమోదు మొదలుకుని పంచాయతీ ఎన్నికల వరకు భాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యేలు లేని చోట పార్టీ సీనియర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మాజి ఎమ్మెల్యేలకు ఈ భాధ్యతలు అప్పగిస్తారు. పంచాయితీ, వార్డు సభ్యులకు దాదాపు ఒకే అభ్యర్థి ఉండేలా చూడాలని, వీలైతే ఏకగ్రీవమయ్యేలా యత్నించాలని కూడా సూచించినట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే ఒకరు వెల్లడించారు. ఇటివల జరిగిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల సమావేశంలో కూడా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇవే అంశాలను పేర్కోనడంతో పంచాయతీ ఎన్నికల అంశం ఇప్పుడు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల్లో హాట్‌టాఫిక్‌గా మారింది.

అధికార పార్టీ నేతలకు సవాల్:సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో వస్తున్న గ్రామ పంచాయితీ ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.అసెంబ్లి ఎన్నికల ఊపు, జోష్ ఏమాత్రం తగ్గకుండా అన్ని స్థానాల్లో విజయం సాధించాలనేది ఆ పార్టీల లక్ష్యం. ఇదేవిషయాన్ని గతంలో జరిగిన రెండు రోజులు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రధాన కార్యదర్శుల సమావేశంలోను, సెల్‌ఫోన్ ద్వారా ఎమ్మెల్యేలకుసూచించారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యనేతలకు పంచాయతీ ఎన్నికలు నిజంగానే సవాలుగా మారాయని చెప్పవచ్చు. అసెంబ్లి స్థానాల ఎన్నికలు జరిగిన వెంటనే వస్తున్న పంచాయితీ ఎన్నికలు పార్టీ రహితమే అయినా గెలుపొందిన శాసన సభ్యులకు భవిష్యత్తు పదవులకు ప్రాధాన్యతగా చెప్తున్నారు. 2013లో జరిగిన ఎన్నికలల్లో అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చాయని చెప్పవచ్చు. ఉమ్మడి రాష్ట్రంలో టీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్‌తో పోటి పడి నువ్వానేనా అన్నట్లు పోరాడింది. చివరకు మెజారిటి స్థానాలను కైవసం చేసుకుని అప్పటి పరిస్థితులకు తగ్గట్టుగా తెలంగాణ అవశ్యకతను చాటిచెప్పింది. గత పంచాయితీ ఎన్నికలు జిల్లాలోని మెజార్టి ఎమ్మెల్యేలకు ఇబ్బందులనే తెచ్చి పెట్టాయి. జిల్లాలో 13 శాసన సభ నియోజకవర్గాలు ఉంటే ముగ్గురు మాత్రమే పంచాయితీ ఎన్నికల్లో తమ అధిక్యాన్ని నిలుపుకోగలిగారు. పేరుకు పార్టీ రహితమే అయినా గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పూర్తిగా రాజకీయ పార్టీల నాయకులే బరిలో దిగారు. అన్ని నియోజకవర్గాలోను ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల నియోజకవర్గ స్థాయి నేతలు ప్రచారం నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ఖర్చు అంతా అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆ స్థాయి నేతల కనుసన్నల్లోనే జరిగింది. ఏడేళ్ల తర్వాత జరిగిన ఎన్నికలు కావడంతో అన్ని రాజకీయ పార్టీల నేతలు, అన్ని నియోజకవర్గాల్లో అసెంబ్లి ఎన్నికల తర్వాత, పార్లమెంట్ ఎన్నికలకు ముందు వస్తున్న ఈ గ్రామ పంచాయితీ ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా కానుండగా, అధికార పార్టీ మాత్రం మరింత ముందస్తుగా కార్యాచరణ చేపడుతుంది.

2014 తర్వాత బలాబలాలు తారుమారు : గత పంచాయితీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకంటే టీఆర్‌ఎస్ స్వల్ప మెజార్టి సాధించింది. అయితే తదనంతర పరిమాణాలు ఫలితాల సంఖ్యను తారుమారుచేశారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం, టీఆర్‌ఎస్ అధికార పగ్గాలు చేపట్టడంతో అప్పటి వరకు వివిధ పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్పంచ్‌లు, అధికార టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీ బలం అమాంతం పెరిగిపోయింది. పూర్వ కరీంనగర్ జిల్లాలో 1207 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరిగితే 379 గ్రామాల్లో



టీఆర్‌ఎస్, 372 పంచాయితీల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గెలుపొందారు. 137 టీడిపి, 37 బిజెపి, 30 వైఎస్‌ఆర్‌సిపి మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. అదే విధంగా 17చోట్ల సీపిఐబలపరిచిన అభ్యర్థులు గెలుపొందగా, 235 పంచాయితీల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. అయితే 2014లో టీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు అభివృద్ధి బాట నడువాలంటే అధికార పార్టీ పంచన చేరడమే మేలని భావించిన చాలా మంది సర్పంచ్‌లు ఫ్లేట్ ఫిరాయించారు. మూడింట రెండు వంతులకు పైగాగ్రామాల్లో టీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఎగురవేశారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు కేటిఆర్, ఈటెల రాజేంధర్ ప్రాతినిధ్యం వహించడం, జగిత్యాల నియోజకవర్గం మినహా అన్ని స్థానాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉండడంతో ఇతర పార్టీల మద్దతుతో గెలిచిన పలువురు సర్పంచులు గులాబి తీర్థం పుచ్చుకున్నారు. ఆగస్టు 2న సర్పంచ్‌లు పదవీ విరమణ చేసే నాటికి 942 మంది టీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నట్లుగా అప్పట్లో ప్రకటించారు. ఇటివల జరిగిన అసెంబ్లి ఎన్నికల్లోను మంథని మినహా అన్నింటా టీఆర్‌ఎస్ అభ్యర్థులే ఎమ్మెల్యే లుగా గెలుపొందడంతో గులాబి పార్టీలో మరింత జోష్ పెరిగింది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని సమీక్ష జరిపిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఈ సారి భారీ అధిక్యం,అత్యధిక స్థానాలు గెలువాలని సూచించడంతో ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, పంచాయితి ఎన్నికల్లో గెలుపు గుర్రాలపై కసరత్తు మొదలెట్టారు.

జనవరి 15కి న్యాయమూర్తుల గదులు సిద్ధం

తుళ్లూరు, సూర్య ప్రతినిధి : రాజధాని అమరావతి నిర్మాణానికి సాయం చేయకుండా రాష్ట్రంపై కేంద్రం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని మంత్రి నారాయణ అన్నారు. విగ్రహాలకు రూ.3 వేల కోట్లు ఖర్చు చేసిన బీజేపీ, అమరావతికి కేవలం రూ.1500 కోట్లు మ్రామే ఇవ్వడం దారుణమన్నారు. హైకోర్టు భ వన నిర్మాణ పనులను పరిశీలించారు. భవనం చు ట్టూ పార్కింగ్, లాన్, ఫ్లోరింగ్ పనులు, న్యాయమూర్తుల గదులు జనవరి 15కి పూర్తవుతాయని తెలిపారు. మొదటి అంతస్తులో 12 గదులు, రెండో అం తస్తులో నాలుగు గదులు సిద్ధమవుతున్నాయన్నారు. జనవరి 1 నుంచి నిర్వ హించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రి తప్పుపట్టారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయ నిర్మాణంపై కేసీఆర్ వక్రీకరించి మాట్లాడుతున్నారని అన్నారు. రాఫ్ట్ టెక్నాలజీతో భవనాలు నిర్మించడం దేశంలో మరెక్కడా లేదని, అవగాహన లేకుండా కేసీఆర్ మాట్లాడటం తగదని నారాయణ హితవు పలికారు.

రైతు రుణమాఫీని లాలీపాప్‌తో పోలుస్తారా

మోదీపై తులసిరెడ్డి ధ్వజం

విజయవాడ, మేజర్‌న్యూస్:
రైతు రుణమాఫీ పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లాలీపాప్‌తో పోల్చడం దురదృష్టకరమని ఏపీ పీసీసీ ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ నేత తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యలపై మోదీకి చిత్తశుద్ధి లేదని చెప్పడానికి ఈ ఒక్క ఉదహారణ చాలని ఆయన అన్నారు. కొద్ది మంది వ్యాపారులకు వేల కోట్ల రుణాలు మాఫీ చేసిన మోదీ రైతులకు ఎందుకు రుణమాఫీ చేయరని ప్రశ్నించారు. గతంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని, 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు మెరుగైన బీమా పథకాన్ని రూపొందిస్తామని, ధరలు నిర్ణయించే కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీజేపీకి చేతనైతే రైతు రుణమాఫీ చేసి చూపించాలని తులసి రెడ్డి సవాల్ విసిరారు. బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు మహారాష్ట్ర, తమిళ్ నాడు, ఉత్తరాది రాష్ట్రాలు నిరసన వ్యక్తం చేశాయని అన్నారు. ఇటీవల గెలిచిన రాష్ట్రాల్లో మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రైతు రుణమాఫీ చేసి చూపెట్టామని, 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు రుణ మాఫీ చేస్తామని అన్నారు. రైతులకు మెరుగైన భీమా పథకాన్ని రూపొందిస్తామని, ధరలు నిర్ణయించే కమిటీ ఏర్పాటు చేస్తాంమని అన్నారు.

ఇంద్రకీలాద్రిపై డ్రెస్‌కోడ్



విజయవాడ, సూర్య బ్యూరో : ఇంద్ర కీ లాద్రిపై అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులు ఇక నుంచి డ్రెస్ కోడ్ పాటించాల్సి ఉంటుంది. కేవలం సంప్రదాయ దుస్తులు మాత్రమే వేసుకుని ఆలయంలోకి వెళ్లాలి. లేదంటే లోపలికి అనుమతించరు. జనవరి ఒకటి నుంచి డ్రెస్‌కోడ్ అమల్లోకి వస్తుందని ఆలయ అధికారులు తెలిపారు. స్లీవ్‌లెస్ టాప్స్, మిడ్డీలు, జీన్స్, టీ షర్టులు, స్కర్ట్స్, షార్ట్సను ఆలయ ట్రస్ట్ బోర్డు ఇటీవల నిషేధించింది. ప్రతి ఒక్కరు నిబంధనలను పాటించాలని ఆలయ ఈవో కోటేశ్వరమ్మ భక్తులను కోరారు. ముఖ్యంగా మహిళలు చీరలు, లంగావోణీలు ఇతర సంప్రదాయ దుస్తులు మ్రామే ధరించి రావాలని చెప్పారు. ఒకవేళ ఎవరికైనా నిబంధనలు తెలియకపోతే, ఆలయం వద్ద తమ సిబ్బంది రూ.100కు అమ్మ చీర అందజేస్తారని, దుస్తులు మార్చుకునేందుకు గదులు కూడా సిద్ధం చేశామని వెల్లడంచారు. అమ్మవారి దర్శనానికి మహిళలు చీర, లంగా ఓణి, పంజాబీ డ్రెస్ వంటి దుస్తులు ధరించాల్సి ఉండగా, పురుషూలు పంచె, లాల్చీ, ప్యాంటు చొక్కాతో దర్శనం చేసుకోవాలి.

తిరుపతి తరహాలో కడప అభివృద్ధి

- 10న జన్మభూమికి సీఎం రాక
- వెలుగోడు నుంచి 2 టీఎంసీల నీరు విడుదల
- వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశం
- ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు

కడప, సూర్య ప్రతినిధి : కడప నగరాన్ని తిరుపతి తరహాలో అభివద్ధిచేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది జూలై 25న జరిగిన కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ హరికిరణ్ 'కుడా' (కడప అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేయాలని సీఎం దష్టికి తీసుకువచ్చారు. ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కడప నగరం చుట్టుపక్కల ఉన్న 39 మండలాలను 'కుడా' పరిధిలోకి తీసుకువచ్చేలా ప్రతిపాదనలను అధికారులు సమర్పించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ పర్యవేక్షణలో ఏర్పాటయ్యే అర్బన్ అథారిటీలపై చర్చలు జరిగి కేబినెట్ ఆమోదం లభించింది. కలెక్టర్ల సదస్సులో కుడా ఏర్పాటుపై చర్చ జరిగింది. ఇప్పటికే ప్రతిపాదనలు అందడంతో వెంటనే కుడా ఏర్పాటుపై జీవో జారీ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు రానున్నాయి. జీవో మేరకు మొదట గెజిట్ నోటిఫికేషన్‌తో ప్రజాభిప్రాయ సేకరణ తరువాత పాలకవర్గం ఏర్పాటు చేస్తారు. చైర్మన్‌గా రాజకీయ నాయకులకు అవకాశం ఇస్తారు. వైస్ చైర్మన్ (వీసీ)గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని నియమిస్తారు. ఆ తరువాత పాలకవర్గ సభ్యులు, కార్యాలయాల ఏర్పాటు, నిర్వహణకు నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. జీవో వచ్చిన తరువాత ఈ ప్రక్రియ మొదలై తిరిగి ప్రభుత్వానికి ప్రజాభిప్రాయంతో వివరాలు సమర్పిస్తారు. 'కుడా' పరిధిలో




ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్లు నిర్మించే లబ్ధిదారులకు తక్షణం రూ.50 వేలు పెంపు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల ఇళ్ల నిర్మాణానికి రూ. 1.50 లక్షలు, అర్బన్ ప్రాంతాల్లో రూ. 2.75 లక్షలు ప్రభుత్వం అందిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి అదనంగా కుడా పరిధిలో ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు రూ.50 వేలు అదనంగా రాయితీ అందించనున్నారు. కుడా పరిధిలోకి వచ్చే పట్టణాలు, మండలాల్లో టౌన్‌ప్లానింగ్, రియల్‌ఎస్టేట్ తదితర వాటికి అనుమతులు అందించాల్సి ఉంటుంది. ఈనెల 27న ఎం.కంబాలదిన్నెలో సీఎం చంద్రబాబు ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేసిన సందర్భంగా కడప నగరాన్ని తిరుపతి తరహాలో అభివద్ధి చేస్తామని ప్రకటించడం వెనుక ఉద్దేశ్యం కుడాతో అభివద్ధి చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

10న జన్మభూమికి సీఎం రాక...

జనవరి 2 నుంచి జరిగే జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఈనెల 10న పాల్గొంటున్నారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన 5వ విడత జన్మభూమి మాఊరు కార్యక్రమంలో పులివెందులలో జరిగిన జన్మభూమిలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈసారి ఏ నియోజకవర్గంలో చేపట్టాలన్నది జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులతో చర్చించి స్థలాన్ని ఖరారు చేయనున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఏ నియోజకవర్గంలో సీఎం పర్యటన ఉంటుందన్నది తేల్చనున్నారు.

వెలుగోడు నుంచి 2 టీఎంసీల నీరు...

బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌కు వెలుగోడు నుంచి 2 టీఎంసీల నీరు అందించాలని కలెక్టర్ల సదస్సులో నిర్ణయం తీసుకున్నారు. వేసవికి తాగునీటి సమస్య తీవ్రమవుతుందన్న ఆలోచనతో కలెక్టర్ హరికిరణ్ సీఎం దష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే 2 టీఎంసీల నీటిని వెలుగోడు నుంచి విడుదల చేయాలని ఆదేశించారు. 96 కి.మీ.వెలుగోడు నుంచి కాలువల్లో నీరు ప్రవహించి బ్రహ్మంసాగర్‌కు చేరాల్సి ఉంది. ఇంతదూరం నీరు ప్రయాణించడం ఇప్పుడున్న పరిస్థితుల్లో కష్టమన్నది ఆలోచన. కంట్రోలింగ్ మెకనిజం పూర్తి చేసుకుని నీటిని బ్రహ్మంసాగర్‌కు తీసుకుపోవాలని ఇందుకు కర్నూలు, కడప కలెక్టర్లతో పాటు ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు.



గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ

అమరావతి, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌లో 446 గ్రూప్ 2 పోస్టులకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 110 పాత పోస్టులతో పాటు 336 కొత్త పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ జారీ అయింది. ఇందులో సచివాలయంలోని జీఏడీ విభాగానికి సంబంధించి జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో 150 పోస్టులు ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్గ-3 పోస్టులు 3, డిప్యూటీ తహశీల్దార్, ఈవోపీఆర్‌డీ, ఆబ్కారీశాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, రిజిస్ట్రేషన్‌శాఖ, దేవాదాశాఖలో గ్రేడ్-2, గ్రేడ్1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఏపీపీఎస్సీ తెలిపింది.

పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత

- కాలుష్యం వెదజల్లే పరిశ్రమలపై కఠిన చర్యలు
- ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం
- రూ 22 కోట్ల వ్యయంతో విశాఖ పట్టణంలో అధునాతన ల్యాబ్
- 23న నూతన ల్యాబ్ ప్రారంభోత్సవం
- రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు



అమరావతి, సూర్యప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రూ 22 కోట్ల వ్యయంతో విశాఖ పట్టణంలో ఆధునాతనంగా నిర్మించిన ల్యాబ్‌ను ఈనెల 23వ తేదీన ప్రారంభించనున్నట్లు అటవీ శాఖ మంత్రి శిద్ధా రాఘవరావు తెలిపారు. సోమవారం సచివాలయంలో కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ అధికారులతో మంత్రి శిద్ధా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలుష్య సమావేశం, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. అన్నీ రకాల పర్యావరణ అనుమతులను ఆన్‌లైన్ చేయటమే కాకుండా రాష్ట్రంలోని పరిశ్రమలను పిసిబి అధికారులు ఆత్యాధునికి సాంకేతికతో నిరంతరం తనిఖీలు చేస్తున్నారని, కాలుష్య కారక పరిశ్రమలను గుర్తించి వాటి మీద చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కాలుష్య కారక పరిశ్రమలను గుర్తించి వాటి మీద చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జాతీయ హరిత ట్రిబ్యునల్, న్యూఢిల్లీ వారి ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో 5 హెక్టార్లకు లోపల ఉన్న పరిశ్రమల యాజమాన్యం స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ ద్వారా పర్యావరణ అనుమతులు పొందవచ్చని తెలిపారు. ఇంతకు ముందు ఈ అధికారం జిల్లా కలెక్టర్లుకు ఉండేదని అన్నారు. అటవీ శాఖ గుర్తించి సమీక్షిస్తూ ఎర్రచందనం స్మగర్లర్ల పట్ల కఠినంగా వ్యవహించవల్సిందిగా ఆదేశించారు. నగరవనాలు, పల్లెవనాలు, ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం ప్రాజెక్టు పనుల పురోగతని గుర్తించి అడిగి తెలుసు




కుని వేగంగా పనులు పూర్తి చేయవల్సిందిగా పిసిసిఎఫ్ ని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటనలు జరిపి, క్రిందస్థాయి సిబ్బందిలో ఆత్మ స్థైర్యాన్ని నింపి అటవీ శాఖను మరింత ముందుకు తీసుకువెళ్లాల్సిందిగా పిసిసిఎఫ్ రిజ్వీని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ అనంతరాము, పిసిబి ఛైర్మన్ బిఎస్ఎస్ ప్రసాద్, అటవీ దళాల ముఖ్య అధికారి రిజ్వీ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఏజెన్సీని వణికిస్తున్న చలి

విశాఖపట్నం,సూర్యబ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. పెథాయ్ తుపాన్ మొదలు చల్లగాలులు తెలుగు ప్రజలను వణికిస్తున్నాయి. చలి తీవ్రత రాత్రవేళల్లో మరింత ఎక్కువగా ఉంటుంది. విశాఖ ఏజెన్సీని చలి వణికిస్తోంది. లంబసింగిలో అత్యల్పంగా జీరో డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చింతపల్లిలో 1.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మినుములూరు 3 డిగ్రీలు, పాడేరు, చింతపల్లిలో 4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణలో చలిగాలుల తీవ్రత అధికంగా ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో మూడు డిగ్రీలకు ఉష్టోగ్రతలు పడిపోయింది. గడచిన 10ఏళ్లలో 2010 డిసెంబర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ తర్వాత ప్రస్తుతం కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వృద్ధులు, పసి పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగమంచు కారణంగా సూర్యుడు ఉదయం 11 గంటల తర్వాతే దర్శనమిస్తుండటం గమనార్హం. ఈ చలి తీవ్రతకు స్వెట్టర్లు, గ్లౌజులు, మాస్క్‌లు, హీటర్లకు డిమాండ్ బాగా పెరిగింది. రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలులు దక్షిణభారతం వరకు విస్తరించాయి. దీంతో ఉదయం 10 గంటల వరకు చలి తీవ్రత కొనసాగుతోంది. ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఈ ఏడాది తొలిసారిగా జంగమహేశ్వరపురంలో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగత్ర నమోదైంది. ఆదివారం పాడేరులో 5 డిగ్రీలు, చింతపల్లిలో 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు, మూడు రోజుల వరకు చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ అధికారి తెలిపారు.

పవన్‌కళ్యాణ్ కొత్త సంవత్సరం శుభాకాంక్షలు



అమరావతి,సూర్యబ్యూరో: కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో తెలుగు ప్రజలందరికీ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆశలకు ఊపిరిపోస్తూ 2019లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా తెలుగు ప్రజలకు తన తరపున, జనసైనికుల తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. గడచిన ఏడాది అనుభవాలను ప్రేరణగా తీసుకొని నూతన నిర్ణయాలతో ముందడుగు వేద్దామని, ఈ కొత్త సంవత్సరంలో సామాన్యుడే రాజై వెలగాలని, మానవీయ పాలనకు, నవ చరితకు ఇది శ్రీకారం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగుల సేవలతోనే అంతర్జాతీయ గుర్తింపు

కలెక్టర్ లక్ష్మీకాంతం

విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందించిన సేవల కృషి ఫలితంగానే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమల్లో కృష్ణాజిల్లాకు అంతర్జాతీయ కీర్తి ప్రతిష్టలు లభించాయని, ఇదే విధానాన్ని భవిష్యత్తులో కొనసాగించాలని జిల్లా కలెక్టర్ బి.లకీకాంతం కోరారు. ఎపిఎన్‌జివో ఆసోసియేషన్ పశ్చిమ కృష్ణా శాఖ రూపొందించిన 2019 సంవత్సర క్యాలండర్‌ను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ లకీకాంతం విజయవాడలో ఆయన క్యాంపు కార్యాలయం నందు అవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఉద్యోగుల ప్రా ఎంతో కీలకమైందన్నారు. పథకాల అమలు తీరులో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానాన్ని అందుకోడం ఇందుకు నిదర్శనమన్నారు. కృష్ణాజిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు విజయవంతం కావడం ద్వారా జిల్లాకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉద్యోగుల కృషి ఫలితంగానే లభించిందని, ఇందులో భాగస్వాములైన ప్రతి



ఉద్యోగిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎపిఎన్‌జివో ఆసోసియేషన్ పశ్చిమ కృష్ణా ఆధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ దశా దిశా నిర్ధేశాలు, సూచనలు ఇచ్చి ఎప్పటికపడు ఉద్యోగులను చైతన్యపరచడం ద్వారానే సాధ్యపడిందని భావిస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికపడు పరిష్కరించడంతో పాటు ఉద్యోగులతో మమేకమైన పనిచేస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శవంతంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌జివో అసోసియేషన్ పశ్చిమ కృష్ణా కార్యవర్గ సభ్యులు డి. సత్యనారాయణరెడ్డి,బి.ఆనంద్, పి.రమేష్, ఆర్‌హెచ్ ప్రకాష్, నగర కార్యవర్గ సభ్యులు కోనేరు రవి,జె. స్వామి,బి.సతీష్,వి.వి ప్రసాద్,బి.వి రమణ,ఎస్‌కె నజీరుద్దీన్, సి.హెచ్ మధు సూధన్‌రావు,ఎన్.హేమకళ్యాణి,డి.విశ్వనాథ్,కె.సంపత్‌కుమార్,శివశంకర్,కృష్ణా జిల్లా డ్రైవర్స్ ఆసోసియేషన్ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

యువ ఐఏఎస్ అధికారులకు సిఎస్ పునేట దిశానిర్దేశం

అమరావతి,31 డిశంబరు:అంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించబడి శిక్షణ పొందుతున్న 2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు సోమవారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠతో భేటీ అయ్యారు.ఈసందర్భంగా సిఎస్ పునేట యువ ఐఏఎస్ అధికారులకు తన అనుభవాలను తెలియజేయడం తోపాటు ఉత్తమ అధికారులుగా ఏ విధంగా పేరుతెచ్చుకోవాలనే దానిపై పలు అంశాలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర విభజన అనంతరం నూతన రాష్ట్రంలో పనిచేసే అవకాశం కలగడం అదృష్టంగా భావించి కష్టించి పనిచేసి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. నూతన రాష్ట్రంలో అనేక అవకాశాలున్నాయని బాగా పనిచేసి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈసమయంలో యువ ఐఏఎస్ అధికారులుగా ఇక్కడ పనిచేయడం రాష్ట్రానికి మేలుకలగడమే గాక మీకు మీసర్వీసులో ఒక చెరగని ముద్రగా గుర్తు ఉంటుందని సిఎస్ పునేఠ్ పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే సమయంలో అక్కడి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెల్సుకుని సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రస్తుత నూతన రాష్ట్రం అనేక సమస్యలు,సవాళ్లను ఎదుర్కొంటోందని అలాంటి సమస్యలు,సవాళ్లను పరిష్కరించుటలో యువ ఐఏఎస్ అధికారులుగా మీ బాధ్యతలను మరింత సమర్ధవంతంగా నిర్వ హించి రాష్ట్రానికి మరింత మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని సిఎస్ సూచించారు.శిక్షణలో భాగంగా తనతో భేటీ అయి వివిధ అంశాలను,అనుభవాలను తెల్సుకోవడం మీకు కెరీర్ లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సిఎస్ అనిల్ చంద్ర పునేఠ యువ ఐఏఎస్ అధికారులకు చెప్పారు.ఈకార్యక్రమంలో 2017 బ్యాచ్



ఐఏఎస్ అధికారులు గోపాలకృష్ణ రోనాకి,కొత్తమసు దినేష్ కుమార్,ధ్యానచంద్ర హెచ్ యం,కెఎస్.విశ్వనాథన్,పవీణ్ ఆదిత్య సివి,నిశాంత్ టి పాల్గొనగా వారితో పాటు ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ కుమార్,సాధారణ పరిపాలనాశాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

- పోలవరం ప్రాజెక్టు పరిధిలో 75 లక్షల ఎకరాలు
- ప్రాథమిక అంచనాలను మించిన తాజా అధ్యయనం
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించిన అధికారులు

అమరావతి, సూర్యప్రధానప్రతినిధి : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలో 75.38 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం సాధ్యమవుతుందని జలవనరుల శాఖ అధికారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు. పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి రాష్ట్రంలో ఏ జిల్లాకు ఎంతమేర ప్రయోజనం కలుగుతుందేనే లెక్కలు తేల్చామన్నారు. మొత్తం 13 జిల్లాలకు లబ్ది కలుగుతుందని చెప్పారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాకు సాగునీటి వసతి సాధ్యమవుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో 32.2 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి రావడమే కాకుండా, 43.18 లక్షల ఎకరాల స్థిరీకరణ జరుగుతుందని చెప్పారు. అలాగే విశాఖ నగరానికి తాగునీరుకు 7.32 టీఎంసీలు, విశాఖ పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలకు 16.12 టీఎంసీలు, కాలువల ద్వారా 540 గ్రామాల్లోని 28.5 లక్షల మందికి తాగునీరు లభిస్తుందన్నారు. ఒడిశాకు 5 టీఎంసీలు, చత్తీస్‌గడ్‌కు 1.5 టీఎంసీలు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. సోమవారం ప్రజావేదికలో పోలవరం ప్రాజెక్టుపై 84వసారి ముఖ్యమంత్రి వర్చువల్ రివ్యూ నిర్వహించారు. పనుల పురోగతి వివరాలను జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు మొత్తం 63.27% పూర్తికాగా, తవ్వకం పనులు 83.60%, కాంక్రీట్ పనులు 57.90% పూర్తయినట్టు అధికారులు తెలిపారు. కుడి ప్రధాన కాలువ 90%, ఎడమ ప్రధాన కాలువ 66.77%, రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ 62.52%, కాఫర్ డ్యామ్ పనులు 6.04% పూర్తన్టు పేర్కొన్నారు. గత వారం స్పిల్ వే, స్పిల్ చానల్, పైలట్ చానల్, అప్రోచ్ చానల్, లెఫ్ట్ ఫ్లాంక్‌కు సంబంధించి 4.22 లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వకం పనులు, స్పిల్ వే, స్పిల్ చానల్, స్టిల్లింగ్ బేసిన్‌కు సంబంధించి 51 వేల క్యూబిక్ మీటర్ల వరకు కాంక్రీట్ పనులు పూర్తయినట్టు తెలిపారు.

కాంక్రీట్ పనులు 36.79 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 21.30 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యాయి. తవ్వకం పనులు 1115.59 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 933.01 క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యాయి. గతవారం స్పిల్ వే, స్పిల్ చానల్, పైలట్ చానల్, అప్రోచ్ చానల్, లెఫ్ట్ ఫ్లాంక్‌కు సంబంధించి 4.22 లక్షల క్యూబిక్ మీటర్ల మేరకు తవ్వకం పనులు పూర్తికాగా, స్పిల్ వే, స్పిల్ చానల్, స్టిల్లింగ్ బేసిన్‌కు సంబంధించి 51 వేల క్యూబిక్ మీటర్ల వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. జనవరి 7వ తేదీన 28 వేలు నుంచి





30 వేల క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీట్ పనులు పూర్తి చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తువరకు నిర్మించడం వల్ల తలెత్తే ముంపు ప్రాంతాల వారికి ఆర్ఆర్ కాలనీల నిర్మాణం మార్చి నాటికి పూర్తిచేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే ప్రాధాన్య ప్రాజెక్టులను సమీక్షించిన ముఖ్యమంత్రి.. మదనపల్లి, చిత్తూరు, కుప్పం, రామకుప్పం, వుంగనూరు, బద్వేలు, మడకశిర, హిందూపురం, పులివెందులకు సాగునీరు, తాగునీరు అందేలా చూడాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.15,380.97 కోట్లు ఖర్చు చేయగా, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత రూ.10,245.10 కోట్లు ఖర్చు పెట్టినట్టు అధికారులు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా రూ.3,517.84 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. మరోవైపు 252 రోజుల్లో 4,36,933 మంది రైతులు, విద్యార్థులు, సామాన్యప్రజలు పోలవరం ప్రాజెక్టును సందర్శించారని అధికారులు వెల్లడించారు. గడిచిన ఒక్క వారంలోనే 41,014 మంది పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారని అన్నారు. సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పోలవరం ఆర్ఆర్ కమిషనర్ రేఖారాణి, ఈఎన్‌సీ వెంకటేశ్వరావు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల డైరీ ఆవిష్కరణ



సచివాలయం, డిసెంబర్ 31 : ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం 2019 క్యాలండర్, డైరీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. ఉండవల్లిలోని ప్రజావేదికలో సీఎం చంద్రబాబు క్యాలండర్, డైరీని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ముఖ్య సలహాదారులు కె.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీఎం.రవి శంకర్, రాష్ట్ర అధ్యక్షులు వై.ప్రవీణ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులు ఎం.సునీల్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారులు ఎం.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

2018లో అద్భుతంగా పని చేశాం

నీరు-ప్రగతి పురోగతిపై సీఎం టెలికాన్ఫరెన్స్

(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) నీరు-ప్రగతి పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. “2018లో అద్భుతంగా పనిచేశాం. అన్నిశాఖల్లో పురోగతి సాధించాం. ప్రతిఒక్కరికి సదుపాయాలుకల్పించాం, ఇబ్బందులను తొలగించాం. 2018లో చేసిన కషి ఫలితాలు 2019లో వస్తాయి. తొలి 6 నెలల్లోనే 11.5 శాతం వద్దిసాధించాం. ఈ ఏడాది వివిధ రంగాలలో 675పైగా అవార్డులు సాధించాం. కషి కల్యాణ యోజనలో మన 3జిల్లాలు దేశంలోనే నెంబర్‌వన్. విజయనగరం, విశాఖ, కడప ఈ ఘనత సాధించాయి” అని చంద్రబాబు తెలిపారు. ముందుచూపు, నూతన ఆవిష్కరణలు, జవాబుదారీతనంలో డిజిటలైజేషన్, ఉబరైజేషన్, కన్వర్జెన్స్, టెక్నాలజీలో ట్రాన్స్ ఫర్మేషన్‌తోనే ఇన్ని అవార్డులు సాధించామని సీఎం వివరించారు. తాను బంద నాయకుడిని, ఘనత బందానికే చెందుతుందన్నారు. తిరుగులేని శక్తిగా ఏపీ రూపొందాలని, ప్రపంచం ఏపీ వైపే చూడాలని తెలిపారు. విశాఖలో మెడ్గ టెక్ జోన్ దేశానికే తలమానికమని చెప్పారు. 5వేల మంది కౌలు రైతులకు పంటరుణాలు చేసి దేశంలోనే చర్త్రి సష్టించామన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా చేశామని, పంటబీమా రాష్ట్ర ప్రభుత్వ వాటా వెంటనే విడుదల చేయాలని సూచించారు


ఖనిజాభివృద్ధి సంస్థలో నూతన సంవత్సర వేడుకలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః సమైక్యపాలనలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఆదాయం ప్రభుత్వానికి సాధించిపెట్టి అనేకమార్లు ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందనలు అందుకున్న నేపథ్యంలో సోమవారం ఖనిజాభివృద్ధి సంస్థ కార్యాలయానికి విచ్చేసిన సంస్థ చైర్మన్ శేరి సుభాష్ రెడ్డి గారిని ఎండీ మల్సూర్ సన్మానించి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఖనిజాభివృద్ధి సంస్థ గత నాలుగేళ్లలో రూ.2160 కోట్లు, ఈ ఏడాది ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు రూ.610 కోట్లు ఆదాయం సాధించడం జరిగింది. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారసభలలో దాదాపు 40 సభలలో సంస్థను, చైర్మన్ శేరి సుభాష్ రెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ పొగడడాన్ని ఈ సంధర్భంగా గుర్తు చేసుకున్నారు.

మరిన్ని విజయాల దిశగా పర్యాటకం

- ఎపిటిఎ సిఇఓ, ఎపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లా
- నూతన సంవత్సరంలో వారం రోజుల పాటు జల ఉత్సవాలు
- కొండపల్లి, కొండవీడు, కోటప్పకొండలలో హిల్ ఫెస్టివల్స్
- అటు బెలూన్ ఫెస్టివల్, ఇటు ఎడ్వంచర్స్ టూర్ అపరేటర్స్






అమరావతి, సూర్య బ్యూరో : సాధించిన విజయాలతో సంతప్తి చెందకుండా నూతన సంవత్సరంలో మరిన్ని పర్యాటక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక సాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివద్ధి సంస్థ నిర్వహణ సంచాలకులు హిమాన్షు శుక్లా తెలిపారు. 2019 క్యాలెండర్ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలను అలరించేందుకు మరిన్ని పర్యాటక ఆకర్షణలు సిద్ధం చేస్తున్నామన్నారు. నంవబర్‌లో చేపట్టిన ఎఫ్1హెచ్2ఓ దేశంలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిలవగా ఆ పరంపరను కొనసాగిస్తామని, 2019 నవంబరులో వారంరోజుల పాటు జల ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. ఎఫ్1హెచ్2ఓతో పాటు, అక్వాబైక్ రేసింగ్, పారా సైలింగ్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 2018 సంవత్సర ముగింపు నేపథ్యంలో 2019లో చేపట్టనున్న కార్యక్రమాల గురించి తనను కలిసిన మీడియా ప్రతినిధులకు సోమవారం వివరించారు. సంక్రాంతి పర్వదినాల తరువాత, 17,18,19 తేదీలలో అరకు వేదికగా, బెలూన్ ఫెస్టివల్‌తో పాటు అడ్వంచర్ టూర్ అపరేటర్స్ జాతీయ సెమినార్ నిర్వహించనున్నామని వివరించారు. స్థానిక పర్యాటక ప్రయోజనాలకు ఊతం ఇస్తూ కొండపల్లి, కొండవీడు, కోటప్పకొండలలో హిల్ ఫెస్టివల్స్ చేపడుతున్నామన్నారు. పర్యాటకుల రాకకు విడిది ప్రధానం కాగా, 2014లో 6000గా ఉన్న హోటల్ రూమ్స్ సంఖ్యను ప్రస్తుతం 11,000కు తీసుకు వెళ్లామని, 2018 ఏప్రిల్ నాటికి మరో 2500 రూమ్‌లు అందుబాటులోకి రానున్నాయని శుక్లా వివరించారు. రాష్ట్రంలో ఐదు నక్షత్రాల హోటళ్ల సంఖ్య ఆరు నుండి 10కి చేరుకుందన్నారు. రూ.5,300 కోట్ల పెట్టుబడులు ఇప్పటికే క్షేత్ర స్థాయికి చేరగా, 25,000 మంది ఉపాధి పొందగలిగారన్నారు. మానవవనరుల అభివద్దిలో భాగంగా ప్రతిఏటా పదివేల మంది గైడ్లు, క్యాబ్ డ్రైవర్లు, ఛెఫ్‌లకు స్వల్పకాలిక శిక్షణలు అందిస్తున్నామన్నారు. పర్యాటకుల రాక పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మూడవ స్థానంలో ఉండగా, రానున్న మూడు సంవత్సరాల కాలంలో రెండవ స్థానానికి చేరుకోవాలన్న లక్ష్యాన్ని కలిగి ఉన్నామని హిమాన్షు వివరించారు. ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 36 అవార్డులు అందుకోగా, సమీకత పర్యాటక అభివద్దికి గాను 2017,2018 సంవత్సరాలలో వరుసగా కేంద్రప్రభుత్వం నుండి ఉత్తమ రాష్ట్రంగా అవార్డులు అందుకున్నామన్నారు. రానున్న సంవత్సరంలో ఇప్పటికే మౌళిక వసతులు ఉన్న 15 ప్రాంతాలలో పాటు, వసతులు లేని మరో 10 ప్రాంతాలను కూడా పర్యాటక పరంగా పూర్తి స్థాయిలో అభివద్ధి చేయనున్నామన్నారు. ఎపిటిడిసి పరంగా గణనీయమైన ప్రగతిని నమోదు చేస్తున్నామని, 125 కోట్ల అదాయ లక్ష్యంను కలిగి ఉండగా, ఇప్పటికే 120 కోట్లను గడించామని మరో త్రైమాసికం మిగిలి ఉండగా, రూ.132 కోట్లు సాధించగలమన్న ధీమాను వ్యక్తం చేసారు. విజయవాడ భవానీ ద్వీపంలో నీటి సింహాల పార్కును ఏర్పాటు చేయనున్నామన్నారు. జలక్రీడల ద్వారా గణనీయమైన అదాయం గడిస్తున్నామని, దీనికి ఉన్న భవిష్యత్తు రీత్యా పిపిపి విధానంలో మరికొందరితో కలిసి పనిచేయనున్నామన్నారు. ఆంధ్రా ఆహార రుచులను అభివద్ది చేసే క్రమంలో ప్రతినెల ఆహార పండుగలను నిర్వహిస్తున్నామని హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. పర్యాటక, భాషా సాంస్కతిక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా నేతత్వంలో సరికొత్త ఆలోచనలకు కార్యరూపం ఇస్తూ పర్యాటకశాఖ గణనీయమైన అదాయ వనరుగా రూపుదిద్దుకుంటుందని శుక్లా వివరించారు.

రాహుల్, మమతతో మాట్లాడా

ట్రిపుల్ తలాక్‌పై టీడీపీ ఎంపీలతో సీఎం టెలికాన్ఫరెన్స్

(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) :ట్రిపుల్ తలాక్‌పై టీడీపీ ఎంపీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ట్రిపుల్ తలాక్‌పై రాజ్యసభలో అనుసరిం చాల్సిన వ్యూహంపై చర్చించారు. ట్రిపుల్ తలాక్‌పై ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, పశ్చిమబెంగాల్ మమతా బెనర్జీతో మాట్లాడానని చెప్పారు. ముస్లింలపై వేధింపులను అడ్డుకోవాలని కోరానని, సంఘీభావం తెలిపారని వెల్లడించారు. రాజ్యసభలో ప్రతిపక్షాలన్నీ ఏకోన్ముఖంగా పోరాడాలని ఆయన పిలుపు నిచ్చారు. బీజేపీ ముస్లిం వ్యతిరేక పోకడలను అడ్డుకోవాలని కోరారు. రాజ్యసభ లో అన్ని పార్టీలను సమన్వయం చేసుకోవాలని, ట్రిపుల్ తలాక్ చట్టాన్ని బలవంతంగా రుద్దడం లౌకికవాదానికే ముప్పు ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశ భద్రతకు, దేశ సమగ్రతకే ప్రమాదమన్నారు. “దేశంలో అందరికీ ఒకే చట్టం ఉండాలి. ముస్లింలను వేధింపులకు గురి చేయొద్దు. ముస్లింలలో అభద్ర దేశ సమగ్రతకే మంచిది కాదు. దేశ భవిష్య త్తును దెబ్బతీసేలా కేంద్రం చర్యలు ఉండరాదు. ఏ మ్రాం పొరపాటు చేసినా దేశం మొత్తం నష్టపోతుంది. భారత లౌకికవాదం గొప్పతనాన్ని నిలబెట్టాలి. నాన్ బీజేపీ పార్టీలన్నీ ఏకమై ముస్లిం మైనారిటీల హక్కులను కాపాడాలి. ముస్లింల హక్కుల కోసం టీడీపీ ఎంపీలు పార్లమెంటులో పోరాడాలి. తెలుగుదేశం గొంతును బలంగా వినిపించాలి” అని చంద్రబాబు సూచించారు.

నరేగాలో ఇప్పటికే రూ.7 వేల కోట్లు సద్వినియోగం: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునేఠ



అమరావతి, సూర్య బ్యూరో : నరేగాలో ఇప్పటికే రూ.7వేల కోట్లు సద్వినియోగం చేశామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునేఠా అన్నారు. అందుకు అందరికీ అభినందనలు తెలిపారు. అ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో రాబోయే 4నెలలు మరిన్ని నిధులు పొందాలన్నారు. 345 కరవు మండలాలలో 150రోజుల పనిదినాలను కల్పించాలన్నారు. 18లక్షల కుటుంబాలకు అదనపు పనిదినాల లబ్ది. ఇంకుడు కుంటల తవ్వకం ముమ్మరం చేయాలన్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. 'జన్మభూమి-మావూరు' విజయవంతం చేయాలన్నారు. శ్వేత పత్రాలపై గ్రామసభల్లో చర్చించాలన్నారు. గ్రామాలు,వార్డుల ప్రగతి ప్రణాళికలపై చర్చించాలన్నారు. వినతులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. జన్మభూమి నివేదికలను ప్రతిరోజూ సకాలంలో పంపాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలి. పిహెచ్ సిలలో వైద్యసేవలకు లోపం లేకుండా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సేవలను కొనసాగిస్తూనే జన్మభూమి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. చంద్రన్న సంచార చికిత్స బందాలను, ఆయుష్ వైద్య బందాల సేవలను జన్మభూమిలో వినియోగించుకోవాలన్నారు.

ప్రయాగ కుంభమేళాలో పాల్గొనాలని సీఎంకు ఆహ్వానం



విజయవాడ, సూర్య బ్యూరో : ఉత్తరప్రదేశ్‌లో జనవరి 15 నుంచి ప్రయాగలో జరిగే కుంభమేళ ఉత్సవంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. యూపీ సీఎం యోగి ఆధిత్యనాథ్ తరవున ఆ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి సతీష్ మహనా ఉండవల్లిలోని నివాసంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును కలసి ఆహ్వానం అందజేశారు. వారణాసిలో జనవరి 21 నుంచి మూడు రోజులపాటు జరిగే ప్రవాసభారతి దినోత్సవానికి కూడా హాజరు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా యూపీ మంత్రి సతీష్ మహనా మాట్లాడుతూ అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో “మీరే నాకు స్ఫూర్తి” అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ప్రశంసలతో ముంచెత్తారు. “ప్రజలకు సేవ చేయాలన్న తపనతో నిరంతరం విశ్రమించని నేత మీరని” అభినందించారు. పాలన ద్వారా అనునిత్యం ప్రజలకు మంచి చేయడానికి మీరు పడుతున్న తపన ఆదర్శనీయమన్నారు.” ఆనాడు మీరు హైదరాబాద్‌లో చేసిన అభివద్ధిని స్ఫూర్తిగా తీసుకుని తాను గతంలో యూపీ పట్టణాభివద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అమలు చేశానని గుర్తు చేసుకున్నారు. “ మీహయాంలో రాష్ట్రాభివద్ధి, పాలనా వ్యవహారాల్లో సాధిస్తున్న విధానంతో మిమ్మలను సీఈవొ అని ముద్దుగా పిలుచుకునే వారమని స్మరించుకున్నారు. ఈ సమావేశంలో సీఎం కార్యదర్శులు రాజమౌళి, సాయిప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఓటర్ ఐడీతో మొబైల్ నంబర్ అనుసంధానం

- దేశంలో ఈ విధానం ప్రారంభించిన తొలి రాష్ట్రం
- 2019 ఎన్నికల కమిషన్ క్యాలండర్ విడుదల
- కొత్త ఓటర్లకు సన్మానం
- ఓటర్లకు సౌలభ్యంగా ఏర్పాట్లు
- అత్యాధునిక టెక్నాలజీ వినియోగం
- అత్యధిక మంది ఓటింగ్ లో పాల్గొనేలా ప్రయత్నాలు
- నామినేషన్ చివరి తేదీ వరకు ఓటర్ పేరు నమోదు
- టోల్ ఫ్రీ నంబర్ 1950
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి.సిసోడియా




వెలగపూడి సచివాలయప్రతినిధి : ఓటర్ ఐడీ(ఎలక్టొరల్ ఫొటో ఐడెంటిటీ కార్డ్)తో ఓటర్ సెల్ నెంబర్ అనుసంధానం చేసే ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి.సిసోడియా చెప్పారు. దేశంలో ఈ విధంగా అనుసందానం చేస్తున్న మొదటి రాష్ట్రం మనదేనన్నారు. సచివాలయం 5వ బ్లాక్ మొదటి అంతస్తులోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం కొత్తగా ఓటర్లుగా చేరిన పది మందిని సన్మానించి, వారికి టాబ్ లు అందజేశారు. 2019 ఎన్నికలకు కమిషన్ క్యాలండర్‌ను సిసోడియా విడుదల చేసి కృష్ణా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.లక్ష్మీకాంతంకు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యు.మురళీ కృష్ణ, సంఘం మహిళా నాయకురాళ్లకు అందజేశారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ రాష్ట్రంలో 3 కోట్ల 70 లక్షల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. దాదావు అందరు ఓటర్లకు సెల్ ఫోన్లు, అధిక మందికి స్మార్ట్ ఫోన్లు ఉండే అవకాశం ఉందన్నారు. ఈ విధంగా అనుసంధానం చేయడం ద్వారా ఎన్నికల సంఘం ఓటర్ కు ఎస్ఎంఎస్ ల ద్వారా నేరుగా సమాచారం పంపించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. మధ్యలో మరొకరి అవసరం ఉండదని చెప్పారు. వెబ్ సైట్ లో ఓటర్ ఐడీ, సెల్ నెంబర్ అనుసంధానం చేసే ప్రక్రియ ఒక వారంలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అలాగే ఓటర్ కూడా మెసేజ్ లు పంపి తనకు కావలసిన సమాచారం తెలుసుకోవచ్చున్నారు. ఓటర్ మెసేజ్ పంపిన నెంబర్ ఆధారంగా అతని పేరు, తండ్రి పేరు, ఊరు పేరు, పోలింగ్ కేంద్రం అడ్రస్, పోస్టల్ పిన్ కోడ్... వంటి విషయాలన్నీ మాకు తెలిసిపోతాయని తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి ఓటర్ కు ఓటు వేయవలసిన పోలింగ్ స్టేషన్ తోపాటు ఇంటి నుంచి అక్కడకు ఏ మార్గంలో వెళ్లాలో చూపించే మ్యాప్ కూడా పంవుతామని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుంటూ ఉత్తమ పాలన కోసం ఓటు హక్కు ప్రాధాన్యతను వివిధ సమాచార మాధ్యమాల ద్వారా ఓటర్లకు తెలియ జేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పోలైన ఓటింగ్ శాతం బాగానే ఉంటుందని, పట్టణ ప్రాంతాలలో తక్కువగా ఉంటుందని, దానిని పెంచడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పట్టణ ప్రాం తాలలో ఓటర్లు ఎక్కువ మంది ఓటు వేసే విధంగా వారిలో చైతన్యం కలిగిస్తామని చెప్పారు. అవకాశం ఉంటే వారు ఓటు వేసే పోలింగ్ బూత్ వద్ద ఏ సమయంలో ఎంత మంది బారులు తీరి ఉన్నారో కూడా తెలియడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా చేరడానికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఓటర్లుగా చేరే యువతీ, యువకులను, దివ్యాంగులను రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో, మండల, గ్రామ స్థాయిలో సన్మానిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ రోజు ఇక్కడ కొత్త ఓటర్లను సన్మానించి, ట్యాబ్ లు అందజేసినట్లు చెప్పారు. ఎక్కువ మంది ఓటింగ్ లో పాల్గొనాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జనవరి 11న ఓటర్ల జాబితా విడుదల చేస్తామని, అందులో తమ పేరు ఉందో లేదో అందరూ చూసుకొని లేని వారు తమ పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్య ర్థులు నామినేషన్ వేసే చివరి రోజు వరకు ఓటర్లుగా నమోదు చేయించుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆ తరువాత తుది జాబితా విడుదల చేస్తా మన్నారు. ఎవరికైనా ఏవైనా అనుమానాలు ఉంటే ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950కి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఓటు హక్కు కు సంబంధించి ఓటర్లను చైతన్య పరచడానికి సామాజిక మాధ్యమాన్ని కూడా విస్తృతంగా ఉపయోగించుకున్నట్లు సిసోడియా చెప్పారు. జనవరి 26న ఓ టర్స్ డే సందర్భంగా కూడా రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించి అధిక మందిని ఓటర్లుగా చేర్చడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎలక్షన్ కమిషన్ కేలండర్ లో కూడా ఓటర్ కు కావలసిన సమాచారం అంతా పొందుపరిచినట్లు తెలిపారు.

అవకతవకలకు తావులేకుండా 4 ఐఏఎస్ అధికారు పర్యవేక్షణ:ఓటర్ల జాబితాలలో ఎక్కడా ఎటువంటి అవకతవకలకు తావులేకుండా రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో నలుగురు ఐఏఎస్ అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తుంటారని, తాను కూడా వివిధ ప్రాంతాలలో పరిశీలిస్తుంటానని సిసోడియా చెప్పారు. 85 ఏళ్లు దాటిన వృద్ధుల జాబితా ప్రత్యేకంగా తయారు చేసినట్లు తెలిపారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న బోగస్ ఓటర్ల విషయం ఒక విలేకరి ప్రస్తావించగా, అన్నిటినీ పరిశీలిస్తున్నామని, రెండుమూడు చోట్ల నమోదైన వాటిని తొలగిస్తున్నామని చెప్పారు. ప్రతిపక్షాల వారు 58 లక్షల బోగస్ ఓట్లు ఉన్నట్లు ఒక జాబితా ఇచ్చారని తెలిపారు. వాటిలో రెండు మూడు చోట్ల నమోదైన 27 లక్షల పేర్లను తొలగించామన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపగా పేర్లు తప్పుగా నమోదు కావడం, భర్త పేరు బదులు భార్య పేరు, భార్య పేరు బదులు భర్త పేరు, తండ్రి పేరు, ఇంటి నెంబర్.... ఇలా వివిధ రకాలుగా తప్పుగా నమోదైన 3 లక్షల 50 వేల పేర్లను తొలగించినట్లు తెలిపారు. అనుమానాస్పదంగా ఉన్న మరో లక్షా 30 వేల పేర్లను కూడా తొలగించినట్లు చెప్పారు. ఓటర్ల నమోదులో ఎవరికీ అనుకూలత గానీ, భయపడేదిగానీ లేదని, ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా చూస్తామన్నారు. కొత్త సంవత్సరంలో అందరికీ శుభం జరగాలని, ఎన్నికలు విజయవంతంగా జరగాలని సిసోడియా ఆకాంక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు న్యూ ఇయర్ గిఫ్ట్

సర్వీసు మరో ఏడాది పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు



వెలగపూడి సచివాలయప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ లో జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రస్తుతం వారికున్న సర్వీసు మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిం ది. ఈ విషయాన్ని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వ ప్రత్యే క ప్రధాన కార్యదర్శి ఆధిత్యనాథ్ దాస్ తెలిపారు. ప్రాథమిక విద్యను మరింత బలోపేతంగా దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబర్చి జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సొంతం చేసుకున్న ఉపాధ్యాయుల సేవలను వినియోగించు కోవాలని భావిస్తోంది. దీనిలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఉద్యోగ విరమణ నాటికి మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండే వారి సేవలను మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలుల్లోకి వస్తాయని ఆ ప్రకటనలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధిత్యనాథ్ దాస్ తెలిపారు.

కలర్స్



ఆత్మీయ ఆహ్వానం
ఇజ్రాయెల్ ప్రధాని రాక
15/1/2018



మానవా ఇక సెలవ్
(శ్రీదేవి మరణం)-26/2/2018



మేడారం జాతర
01/2/2018



కామన్వెల్త్‌లో తెలుగు రాగాల
(వెయిట్ లిఫ్టింగ్)
8/4/2018

మేరి మహన్ ప్రపంచ బాక్సింగ్‌లో ఆరో స్వర్ణం
25/11/18




గతమెంతో ఘనం

2018 గుర్తులు

2018 సంవత్సరం వస్తూనే తీపిగుర్తులను తీసుకువచ్చింది. వెళుతూ మరిన్నిటిని జోడించింది. జనవరి నుంచి డిసెంబర్ వరకు జాతీయ అంతర్జాతీయంగా అనేక పరిణామాలలో చేదు-తీపి కలయికలని రుచి చూపించింది. ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాది తన గుర్తులను అనేక వదిలి పోయింది. ఈ క్రమంలోనే వివిధ సంఘటనలను దృశ్యరూపంగా సూర్య కలర్స్ మీ ముందుకు తీసుకువస్తోంది. *2019* మరిన్ని విశేషాలు ఆనందోత్సాహాలు మా పాఠకులకు అందించాలని ఆశిస్తోంది.

మోడీ సర్దార్ మహా విగ్రహావిష్కరణ
1/11/2018





కలిసిన హృదయాలు
ఉత్తర, దక్షిణ కొరియాలు 28/4/18



బాల సాయిబాబా ఆకస్మిక మృతి 28/11/18



కన్నుమూసిన కర్మయోగి వాజీపేయి - 17/8/2018




కొండగట్టు ఆలయం బస్సు బోల్తా 12/9/2018

ఆగిన రథం (హరికృష్ణ మృతి) 30/8/18



కమ్యూనిస్టు యోధుడు సోమ్‌నాథ్ ఛటర్జీ మృతి14/8/2018





జగన్‌పై దాడి (విశాఖ విమానాశ్రయంలో) 26/10/18

సునామీ విలయం (ఇండోనేషియాలో 384 మంది మృతి)
30/9/2018





మన్యంలో మావోల పంజా (కిడారి దారుణ హత్య)

12/6/2018
ట్రంప్ ఉత్తర కొరియా కిమ్ భేటి



26/7/2018
పాక్ ప్రధానిగా ఇమ్రాన్





ఆప్ సోపాలు (20 మందిపై అనర్హత వేటు)
20/1/2018



కాలపురుషుడు కన్నుమూత
(స్టీఫెన్ హాకింగ్ లేరు)
-15/3/18

11/12/2018



ఉర్జిత్ పటేల్ నిష్క్రమణ



మోడీజీ మీతో వేగలేం
(కేంద్రంతో టిడిపి చంద్రబాబు కటీఫ్) 3/3/2018



ప్రజాస్వామ్యానికి ముప్పు (కొలిజియం)-13//2018

కంచి పీఠాధిపతి అస్తమయం 1/3/2018





నాదల్‌దే ఫ్రెంచ్ ఓపెన్
11/6/2018

సెలవిక నాయకా



(కరుణానిధి మృతి) 9/8/2018



సాకర్ ప్రపంచ కప్ వేడుకలు

తలాక్‌కు లోక్‌సభ ఆమోదం 28/12/2018



cinema@suryaa.com

సూర్య సినిమా

అందరి సినిమాలు బాగా ఆడాలి... తెలుగు ఇండస్ట్రీ బావుండాలి

విక్టరీ వెంకటేశ్



విక్టరీ వెంకటేశ్, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్స్‌గా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాణంలో రూపొందుతోన్న చిత్రం 'ఎఫ్ 2'. 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్' ట్యాగ్ లైన్. అనిల్ రావిపూడి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న సినిమా విడుదలవుతుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన పాటలను వైజాగ్ ఆర్.కె.బీచ్‌లో జరిగిన విశాఖ ఉత్సవంలో విడుదల చేశారు. ఆడియో సీడీలను ఆంధ్రప్రదేశ్ మంత్రి గంటా శ్రీనివాస్‌రావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో...

దిల్‌రాజు మాట్లాడుతూ.. 2019లో బాలయ్యగారి యన్.టి.ఆర్ బయోపిక్, రామ్‌చరణ్‌గారి వినయ విధేయ రామ, మా ఎఫ్2 మూడు సినిమాలు విడుదలవుతున్నాయి.ఈ సంక్రాంతికి ఈ మూడు సినిమాలు పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను. అనిల్ రావిపూడి ఎఫ్ 2 కథ చెబుతున్నప్పుడు నవ్వుతూనే ఉన్నాను. ప్రతి భార్యాభర్త మధ్య ఫన్ ఉంటుంది, ఫ్రస్టేషన్ ఉంటుంది. స్క్రిప్ట్ చెప్పినరోజునే మా బ్యానర్‌లో మరో సూపర్‌హిట్ సినిమా రాబోతుందని తెలుసు. దానికి తగ్గట్లు ఇద్దరు హీరోలు, మంచి హీరోయిన్స్, ఇతర టెక్నీషియన్స్ బాగా కుదిరారు. ఎఫ్ 2 పక్కా ఫ్యామిలీ సినిమా. ఫ్యామిలీతో వచ్చే ఆడియెన్స్ రెండున్నర గంటల సేపు నవ్వుకుంటారు. అందుకనే సంక్రాంతి అల్లుళ్లు వస్తున్నారు అనే మరో ట్యాగ్‌లైన్‌ను కూడా అనిల్ యాడ్ చేశాడు. ఒకరు ఆంధ్ర అల్లుడైతే, ఒకరు తెలంగాణ అల్లుడు. మా బ్యానర్‌లో తప్పకుండా హ్యాట్రిక్ కొట్టబోతున్నాం.. అన్నారు.

డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. ఈ బ్యానర్‌లో నాది మూడో సినిమా. విక్టరీ వెంకటేశ్‌గారితో పనిచేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన చేయని మేనరిజమ్స్, ఎక్స్‌ప్రెషన్స్ లేవు. దేవిశ్రీగారు అందించిన ఆరు సాంగ్స్ బావున్నాయి. ఈ సంక్రాంతికి ఫ్యామిలీతో రండి ఆనందంగా నవ్వుకుని వెళతారు.. అన్నారు.

ఆంధ్రప్రదేశ్ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విశాఖ ఉత్సవం ఒక బ్రాండ్. వైజాగ్‌కి అంతర్జాతీయంగా కూడా గుర్తింపు తెచ్చిపెట్టిన రాష్ట్ర పండుగ ఇది. సినీ పరిశ్రమ వైజాగ్‌కు తరలి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైజాగ్ సినిమాలకు సెంటిమెంట్‌గా మారింది. షూటింగ్‌లకు అనువుగా ఉండేలా వసతులు ఉన్నాయి. విశాఖ ఉత్సవంలో చివరిరోజున ఈ ఎఫ్ 2 పాటలను విడుదల చేయడం ఆనందంగా ఉంది.ఈ సినిమా చాలా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను.. అన్నారు.

మెగాప్రిన్స్ వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. వెంకటేశ్‌గారితో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను. ఫ్రెండ్‌లా, గైడ్‌లా నా పక్కనే ఉండి నన్ను ఎంకరేజ్ చేశారు. జనవరి 12 ఎఫ్2తో అల్లుళ్లుగా వస్తున్నాం.. అన్నారు.

విక్టరీ వెంకటేశ్ మాట్లాడుతూ.. నా తొలి సినిమా కలియుగ పాండవులు నుండి చాలా సినిమాలు స్వర్ణ కమలం, సుందరకాండ, మల్లీశ్వరి, గురు .. ఇలా చాలా చిత్రాలను వైజాగ్‌లో చేశాం. వైజాగ్ ఉత్సవాల్లో మా సినిమా పాటలను విడుదల చేయడం ఆనందంగా ఉంది. అనిల్ వండర్ ఫుల్ స్క్రిప్ట్ రాశాడు. నా గత చిత్రాలన్నింటినీ చూసి అనిల్ వాటిన్నంటి కంటే రెచ్చిపోయేలా ఈ సినిమాలో నటింపచేశాడు. దేవిశ్రీ వండర్‌ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. ఎఫ్2లో వరుణ్‌తేజ్‌లో మరో సోదరుడిని చూసుకన్నాను. జనవరి12న ఎఫ్ 2 విడుదలవుతుంది. ఇదే సందర్భంలో బాలయ్యబాబుగారు, రజనీకాంత్‌గారు, చరణ్ సినిమాలు విడుదలవుతున్నాయి. వారికి నా అభినందనలు. అందరి సినిమాలు బాగా ఆడాలి. తెలుగు ఇండస్ట్రీ బావుండాలి..అన్నారు!!

జనవరిలో అల్లు అర్జున్ కొత్త చిత్రం









స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, మాటల మాంత్రికుడు సుప్రసిద్ధ సినీ దర్శకుడు త్రివిక్రమ్‌ల కాంబినేషన్‌లో మరో చిత్రం రూపుదిద్దుకోవటానికి సన్నద్ధమవుతోంది.

హీరోగా అల్లు అర్జున్‌కు ఇది 19 వ చిత్రం కాగా, వీరిద్దరి కాంబినేషన్‌లో మూడవ చిత్రం. 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రాల విజయాల నేపథ్యంలో ముచ్చటగా మూడోసారి తెరకెక్కనున్న ఈ చిత్రంపై ఇటు సినీ వాణిజ్య రంగాలలోను, అటు ప్రేక్షక వర్గాలలోనూ అంచనాలు ఉన్నత స్థాయిలో ఉన్నాయి. వీటిని నిజం చేసే దిశగా సుప్రసిద్ధ చలన చిత్ర నిర్మాణ సంస్థలు హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతాఆర్ట్స్ అధినేతలు అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ (చినబాబు)లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఇప్పటికే చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. చిత్రానికి సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణులు వివరాలు త్వరలోనే మరో ప్రకటనలో అధికారికంగా తెలియజేయటం జరుగుతుంది. 2019 జనవరిలో చిత్రం ప్రారంభ మవుతుందని, అందరికీ 2019 ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు చిత్ర నిర్మాతలు అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ (చినబాబు)!!

నేటితరం ప్రేమకథాచిత్రం 4 లెటర్స్




ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ బ్యానర్ ప్రొడక్షన్ నెం. 1గా రూపొందుతోన్న చిత్రం 4 లెటర్స్. 'కుర్రాళ్ళకి అర్ధమవుతుందిలే' అన్నది ఉప శీర్షిక. ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది.

ఈ సందర్భంగా... నిర్మాతలు దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. మా బ్యానర్‌లో నిర్మిస్తోన్న తొలి చిత్రం 4 లెటర్స్. ఈ చిత్రం ద్వారా ఈశ్వర్‌ను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. చాలా చక్కగా నటించాడు. సత్యానంద్‌గారి వద్ద శిక్షణ తీసుకున్న ఈశ్వర్.. ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. కొత్త హీరోలా కాకుండా అనుభవమున్న హీరో సినిమా చేసినట్లుగా నటించారు. దర్శకుడు రఘురాజ్ మా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కమర్షియల్ హంగులతో అన్నీ వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందించాం. చిత్రీకరణంతా పూర్తి చేశాం. త్వరలోనే పాటలు, సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం.. అన్నారు.

దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ.. కలుసుకోవాలని తర్వాత కన్నడ, తమిళ సినిమాలతో బిజీగా మారిపోయాను. చాలా గ్యాప్ తర్వాత తెలుగులో నేను డైరెక్ట్ చేసిన మూవీ. నేటి ట్రెండ్‌కు తగ్గట్లు సినిమాను తెరకెక్కించాను. ప్రేమ,పెళ్లి విషయాలలో నేటితరం యువత ఆలోచనలు, అభిప్రాయాలు,వాస్తవాలు ఏమిటన్న విషయాలను వాస్తవానికి దగ్గరగా ఉండేలా చిత్రీకరించటం జరిగింది. నిర్మాతలు మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సపోర్ట్ చేయడంతో సినిమాను అనుకున్న ప్రణాళిక ప్రకారం పూర్తి చేశాం.. అన్నారు!!

4న భగవాన్ విడుదల



9 స్టార్స్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌లో శేఖర్ బాబు, నిరంజన్ గౌడ్ సమర్పణలో నూతన దర్శకుడు చందు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భగవాన్'. రాజీవ్, శృతి జంటగా నటించిన ఈ చిత్రంలో ఆశిష్ విద్యార్థి ప్రదాన పాత్ర పోషించాడు. మాస్ యాక్షన్‌తో కూడిన ఈ చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. జనవరి4న విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో .. ముఖ్య అథిది నిర్మాత సాయి వెంకట్ మాట్లాడుతూ.. నిర్మాతలు సినిమా తీయటం మాత్రమే కాదు విడుదల చేయటం కుడా గొప్ప విషయ అన్నారు. నిర్మాతలలో ఒకరయిన రాజు సందీప్ మాట్లాడుతూ.. ఇది మాస్ సినిమా అయినా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని అన్నారు. హీరో రాజీవ్ మాట్లాడుతు...టాలివుడ్‌లో నటించే అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు కృత్ఙతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నైజాం డిస్టిబుటర్ సత్యనారాయణ, సంగ కుమార్, సయద్ మహమద్ ఆలీ దంపతులు పాల్గొన్నారు!!

నాని జెర్సీ ఫస్ట్ లుక్ అదిరింది



నేచురల్ స్టార్ నాని హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో పిడివి ప్రసాద్ సమర్పకుడిగా సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తోన్న చిత్రం జెర్సీ. క్రికెట్ క్రీడా నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నాని క్రికెట్ ప్లేయర్‌గా కనిపించనున్నారు. అనిరుద్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధ శ్రీనాద్ హీరోయిన్‌గా నటిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని నిన్న రిలీజ్ చేసారు. సదా సీదాగా కూర్చున్న నాని ఫ్లెజెంట్ లుక్ అందర్నీ ఆకట్టుకుంటోంది. 2019 సమ్మర్ కానుకగా జెర్సీ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు!!

రెస్పాన్స్ చూసి గర్వంగా అనిపించింది



శ్రీదేవి మూవీస్ సంస్థ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో, అభిషేక్ ఫిలిమ్స్ అధినేత రమేష్ పిళ్లై నిర్మాతగా తమిళంలో ఘనవిజయం సాధించిన 'చతురంగ వేట్టై'ని ఆధారంగా చేసుకుని గోపీ గణేష్ పట్టాబి దర్శకత్వంలో తెలుగులో రూపొందిన చిత్రం బ్లఫ్ మాస్టర్. సత్యదేవ్ హీరోగా నటించారు. నందితా శ్వేత ఇందులో నాయిక. బ్లఫ్ మాస్టర్ సక్సెస్‌మీట్ హైదరాబాద్‌లో జరిగింది.

మారుతి మాట్లాడుతూ.. గోపీగణేష్ సినిమాను బాగా తీశాడు. సత్యదేవ్‌ని చూస్తే జెన్యూన్ ఆర్టిస్టును చూసిన ఫీలింగ్ వచ్చింది. తన పాత్రకు న్యాయం చేశాడు. తమిళ సినిమాను తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా తీశారు. ప్రతి పాత్రకూ డీటైలింగ్‌గా పనిచేశారు. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తే వీళ్ల దగ్గర నుంచి మరిన్ని మంచి సినిమాలు వస్తాయి.. అన్నారు.

శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. తమిళ సినిమాను చూడగానే తెలుగులో రీమేక్ చేయాలనుకున్నా. రైట్స్ కోసం తీవ్రంగా ప్రయత్నించాక రమేష్ పిళ్లై దగ్గర ఉన్నాయని తెలిసింది. ఆయన్ని అడిగితే ఇద్దరం కలిసి చేద్దామని అన్నారు. ఇది చిన్న సినిమాల్లో పెద్ద సినిమా. చూసిన ప్రతి వాళ్లూ ఎగ్జయిట్ అయ్యారు. అదే ఎగ్జయిట్‌మెంట్ జనాల్లో కనిపిస్తుంది. నిర్మాతగా మాకు సంతృప్తిని ఇస్తుందని నమ్ముతున్నాం.. చెప్పారు.

గోపీగణేష్ మాట్లాడుతూ.. సినిమాకు వస్తున్న స్పందన సంతోషాన్నిచ్చింది. తమిళ సినిమా విడుదలైన ఆరు నెలల తర్వాత పోలీసులు దర్శకుడు హెచ్.వినోద్‌ను కలిసి దో నెంబర్ దందా నేరాలు తగ్గాయని అప్రిషియేషన్ లెటర్ ఇచ్చారని తెలిసింది. ఇక్కడ కూడా సినిమా అలాంటి ప్రభావం చూపించినప్పుడు మా ప్రయత్నం విజయవంతమైనట్టు.. అన్నారు.

సత్యదేవ్ మాట్లాడుతూ.. మా సినిమాకు పనిచేసిన యూనిట్ సభ్యులు, నా స్నేహితులు, కుటుంబ సభ్యులు సినిమా బావుందన్నప్పుడు నా మీద ప్రేమతో చెప్పారనుకున్నా. మూడు రోజులుగా థియేటర్ల రెస్పాన్స్ చూసి, విని గర్వంగా అనిపించింది. ఆనందంగా ఉన్నాను.. అన్నారు!!

న్యూ ఇయర్ ట్రీట్
బికినీలో దిశాపటానీ





పండగ వస్తే పొదుపైన దుస్తుల్లో రెచ్చిపోతోంది దిశాపటానీ. ప్రస్తుతం బాలీవుడ్‌లో అత్యంత క్రేజీయెస్ట్ హీరోయిన్స్‌లో ఒకరిగా దూసుకుపోతున్న ఈ భామ.. న్యూ ఇయర్ రాబోతున్న సందర్భంగా మరో హాట్ పిక్‌ను పోస్టు చేసింది.

దీపావళి, క్రిస్మస్‌ల సందర్భంగా కూడా ఈ తరహాలోనే దిశా పటానీ హాట్ పిక్స్‌ను పోస్టు చేసింది. ఆ పండగల సమయంలో తను ప్రమోట్ చేస్తున్న ఇన్నర్ వేర్ బ్రాండ్‌లో దుస్తుల్లో ఫొటోలు దిగి పోస్టు చేసింది దిశా. వాటితో పాటు శుభాకాంక్షలను తెలిపింది.

ఇక ఇన్ స్టాగ్రమ్‌లో అత్యధిక స్థాయి ఫాలోయర్లను కలిగిన దిశా తాజాగా అక్కడ ఈ పిక్‌ను పోస్టు చేసింది. ఈట్, స్విమ్, రిపీట్.. అంటూ క్యాప్షన్ పెట్టి ఈ పిక్‌ను పోస్టు చేసిన దిశా, తన పాలోయర్లు న్యూ ఇయర్‌ను ఎలా సెలబ్రేట్ చేసుకుంటున్నారో అడిగింది. ఇలా న్యూ ఇయర్ నేపథ్యంలో దిశా బికినీ పిక్‌తో అభిమానులను మరోసారి ఫిదా చేసింది!!



మహారాష్ట్రలో ఉల్లి ధర విని ఆగిన రైతు గుండె

మాందసౌర్: ఎంతో శ్రమించి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించలేదని తెలిసి ఓ రైతు గుండె ఆగిపోయింది. ఉల్లి రైతులు పడుతున్న కష్టాల గురించి ఇటీవల మహారాష్ట్రకు చెందిన ఓ రైతు ప్రధాని నరేంద్రమోడీ దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ పరిస్థితుల్లో మాత్రం ఎటువంటి మార్పు కనిపించలేదు. అందుకు నిదర్శనమే తాజా సంఘటన. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ రైతు 27 క్వింటాళ్ల ఉల్లిని విక్రయించగా.. కేవలం రూ.10వేలు మాత్రమే వచ్చాయి. దీంతో కనీస ధర కూడా రాలేదని బాధతో సదరు రైతు గుండెపోటుతో మృతి చెందాడు. మందసౌర్‌కు చెందిన భీరులాల్ మాల్వీయ 27 క్వింటాళ్ల ఉల్లిని పండించాడు. ఆయన పండించిన ఉల్లిని మార్కెట్లో విక్రయించేందుకు వచ్చారు. క్వింటాల్ రూ.372 చొప్పున 27 క్వింటాళ్లు అమ్మగా కేవలం రూ.10,440 మాత్రమే వచ్చాయి. అంత తక్కువ ధర వచ్చిందని తెలిసి మాల్వీయ గుండెనొప్పితో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స అందిస్తుండగా ప్రాణాలు విడిచాడు. మార్కెట్లో ఉల్లి ధర అంతకంతకూ పడిపోతుందని, సరైన ధర రాకపోవడంతో గుండెపోటు వచ్చి తన తండ్రి ప్రాణాలు విడిచాడని మాల్వీయ కుమారుడు రవి ఆవేదన వ్యక్తం చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం తమ కుటుంబానికి సహాయం చేయాల్సిందిగా ఆయన కోరాడు.

పాక్ కుట్రను భగ్నం చేసిన భద్రతా దళాలు

- నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో చొరబాటుయత్నం
- పాకిస్తాన్ సైనిక దుస్తుల్లో వచ్చిన ఇద్దరు చొరబాటుదారులు
- నౌగామ్ సెక్టార్ వద్ద సైనిక పోస్టులపై దాడికి యత్నం
- చొరబాట్లను ముందే పసిగట్టిన భారత ఆర్మీ

శ్రీనగర్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వద్ద మరోసారి రక్తపాతం సృష్టించేందుకు పాకిస్తాన్ సైనిక మూకలు విఫల యత్నం చేశాయి. ఉగ్రవాదులతో కలిసి బోర్డర్ యాక్షన్ టీమ్ (బ్యాట్) పేరుతో పాక్ రేంజర్లు పన్నిన చొరబాటు కుట్రను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. జమ్మూ కశ్మీర్‌లోని నౌగామ్ సెక్టార్ వద్ద పాకిస్తాన్ సైనిక దుస్తుల్లో వచ్చిన ఇద్దరు చొరబాటు దారులను హతమార్చినట్టు సైన్యం వెల్లడించింది. ఆదివారం తెల్లవారు జామున నియంత్రణ రేఖను ఆనుకుని ఉన్న నౌగామ్ సెక్టార్ వద్ద సైనిక పోస్టులపై దాడి చేసేందుకు బ్యాట్ ప్రయత్నించింది. అప్పటికే అప్రమత్తంగా ఉన్న భారత బలగాలు వారిని తిప్పికొట్టాయి.. అని ఆర్మీ అధికారి ఒకరు వెల్లడించారు. ఎల్వోసీ సమీపంలోని దట్టమైన అడవుల్లో నుంచి వచ్చేందుకు చొరబాటుదారులు ప్రయత్నించారనీ.. వారికి అండగా పాకిస్తాన్ సైనికులు మోర్టార్లు, రాకెట్ లాంచర్లు ప్రయోగించారని తెలిపారు. న్యూ ఇయర్ సందర్భంగా చొరబాట్లను ముందే పసిగట్టిన భారత ఆర్మీ ఎల్వోసీ పొడవునా బలగాలను మోహరించింది. పాకిస్తాన్ వైపు నుంచి కాల్పులు ప్రారంభం కాగానే భారత సైనికులు అంతే స్థాయిలో స్పందించారు. చొరబాటుదారులకు అండగా పాక్ సైనికులు రాత్రంతా కాల్పులు జరుపుతూనే ఉన్నారు... అని సదరు ఆర్మీ ప్రతినిధి తెలిపారు. కాల్పుల అనంతరం పాక్ సైనికులుగా భావిస్తున్న ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామనీ.. వాటిని తీసుకెళ్లాల్సిందిగా ఇప్పటికే పాక్ సైన్యానికి సమాచారం పంపామని ఆర్మీ పేర్కొంది.

మృతుల వద్ద నుంచి భారీ ఎత్తున మందుగుండు సామగ్రి, ఆయుధాలు సహా పాక్‌లో తయారైన పలు వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దట్టమైన అడవులు, అనుకూల వాతావరణ పరిస్థితులను ఆసరాగా చేసుకుని పాక్ సైన్యం చొరబాట్లకు ప్రోత్సహిస్తోంది. పాకిస్తాన్ సైనికుల కాల్పులు, చీకటిని మాటుగా చేసుకుని మరికొందరు చొరబాటుదారులు తప్పించుకుని పారిపోయినట్టు భావిస్తున్నామని ఆర్మీ ప్రతినిధి పేర్కొన్నారు. ప్రస్తుతం నౌగాం సెక్టార్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్టు తెలిపారు. కాగా పాక్ సైన్యం కుట్రను సమర్థవంతంగా తిప్పికొట్టిన భద్రతా దళాలపై ఆర్మీ ఉన్నతాధికారులు ప్రశంసలు కురిపించారు.



దోపిడీదారులకు కాపలాదారు సహాయం : రాహుల్



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి, దేశం వదిలి పారిపోయే తన సన్నిహిత మిత్రులకు సహాయపడటం ద్వారా కాపలాదారు (నరేంద్ర మోడీ) భారతదేశాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం రాహుల్ ఇచ్చిన ట్వీట్‌లో ఆయన (నరేంద్ర మోడీ) తనను తాను దేశానికి కాపలాదారుగా చెప్పుకుంటూ దొంగలా పని చేస్తున్నారు. తన సన్నిహితులకు రూ.41,167 కోట్ల బ్యాంకు సొమ్మును ఇచ్చారు అని ఆరోపించారు. ఈ సొమ్ముతో కేంద్ర ప్రభుత్వం మూడు రాష్ట్రాల్లోని రైతుల రుణాలను రద్దు చేయగలిగేదని రాహుల్ అన్నారు. 40 అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్)లను ఏర్పాటు చేయగలిగేదన్నారు. కనీసం ఒక ఏడాది పాటు ఎటువంటి ఆటంకాలు లేకుండా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నడపగలిగేదన్నారు. భారతీయ రిజర్వు బ్యాంకు శుక్రవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం 2017-18 ఆర్థిక సంవత్సరంలో మోసగాళ్ళు రూ.41,167.7 కోట్లు దోపిడీ చేశారు. ఇది అంతకుముందు సంవత్సరం (రూ.23,933 కోట్లు) కన్నా 72 శాతం ఎక్కువ. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ ట్వీట్ చేసి, మోదీపై మండిపడ్డారు.

అమ్మ బతికేదే కానీ..: షణ్ముగం



చెన్నై: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత మృతిపై రాష్ట్ర న్యాయశాఖ మంత్రి సీవీ షణ్ముగం సంచలన వ్యాఖ్యలు చేశారు. అమ్మ మృతి వెనుక కుట్ర జరిగిందనీ... సరైన వైద్యం అందించి ఉంటే ఆమె బ్రతికేవారని ఆయన అన్నారు. చికిత్స కోసం జయలలితను విదేశాలకు తరలించాలన్న ప్రయత్నాలను కూడా చెడగొట్టారని ఆరోపించారు. జయలలితకు యాంజియోగ్రామ్ చేయకుండా అడ్డుకున్నది ఎవరు? దీనిపై కుట్రకేసు నమోదు చేయాలి. ఆమె మృూఎతిపై నెలకొన్న మిస్టరీ వీడాలంటే కేసు పెట్టి, సంబంధిత వ్యక్తులపై విచారణ జరిపించాలి.. అని మంత్రి షణ్ముగం డిమాండ్ చేశారు. తీవ్ర అస్వస్థత కారణంగా చెన్నైలోని అపోల్లో ఆస్పత్రిలో 72 రోజుల పాటు చికిత్స తీసుకున్న జయలలిత 2016 డిసెంబర్ 5న మృతి చెందారు. అయితే ఆమె మృూఎతిపై అనుమానాలు, ఆరోపణలు వెల్లువెత్తడంతో... అన్నాడీఎంకే ప్రభుత్వం జస్టిస్ అరుముగస్వామి నేతృూఎత్వంలో విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది.

కాగా జయలలితకు చికిత్స అందించే విషయంలో అపోల్లో ఆస్పత్రి, వీకే శశికళ కుమ్మక్కయ్యారనేందుకు తగిన ఆధారాలు ఉన్నాయని అరుముగస్వామి కమిషన్ ఇటీవల పేర్కొన్న నేపథ్యంలోనే న్యాయ మంత్రి తాజా ఆరోపణలు చేయడం గమనార్హం. సకాలంలో ఆమెకు యాంజియోగ్రామ్ నిర్వహించి చికిత్స చేసిఉంటే ఆమె ఆరోగ్యం క్షీణించేదికాదని కమిషన్ పేర్కొంది. అయితే విచారణ కమిషన్ ఆరోపణలను అపోల్లో ఆస్పత్రి ఖండించింది. గతేడాది సెప్టెంబర్‌లో ఏర్పాటైన అరుముగస్వామి కమిషన్.. ఇప్పటి వరకు 100 మందికి పైగా విచారించింది. వచ్చేనెల 7, 8 తేదీల్లో ఆరోగ్యమంత్రి సి. విజయ భాస్కర్, డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం తమ ముందు విచారణకు హాజరు కావాలంటూ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది.

షేక్ హసీనా హ్యాట్రిక్ విజయం

- బంగ్లాదేశ్ ప్రధానిగా షేక్ హసీనా
- అధికార కూటమి మహాజోట్‌కు 288 స్థానాలు
- ప్రతిపక్ష జయ ఓయిక్యా ఫ్రంట్‌కు కేవలం ఏడు స్థానాలు
- బ్రాహ్మన్బారియా-2 నియోజకవర్గం ఫలితాలపై ఈసీ స్టే
- షేక్ హసీనాకు ప్రధాని మోడీ అభినందనలు

ఢాకా: బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల మధ్య జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికార ఆవామీ లీగ్ (ఏఎల్) పార్టీ భారీ విజయం నమోదు చేసింది. ఈ మేరకు బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం సోమవారం అధికారికంగా ఫలితాలు ప్రకటించింది. అవామీ లీక్ నేతృత్వంలోని అధికార కూటమి మహాజోట్ (మహా కూటమి) 288 స్థానాలు కైవసం చేసుకోగా, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సారథ్యంలోని ప్రతిపక్ష జయ ఓయిక్యా ఫ్రంట్‌కు కేవలం ఏడు స్థానాలు మాత్రమే దక్కాయి. కాగా బ్రాహ్మన్బారియా-2 నియోజకవర్గం ఫలితాలపై ఈసీ స్టే విధించింది. ఓ అభ్యర్థి మృతి చెందడంతో గైబంధ నియోజవర్గంలో కూడా ఎన్నికలు వాయిదా పడ్డాయి. కాగా మహాకూటమిలో షేక్ హసీనా నాయకత్వంలోని ఒక్క అవామీ లీగ్ పార్టీనే 259 స్థానాలు కైవసం చేసుకోవడం గమనార్హం. మరో మిత్రపక్షం జాతీయ పార్టీ 20 స్థానాల్లో విజయం సాధించింది. స్వతంత్రులు మూడు స్థానాలు గెలుచుకోగా, వర్కర్స్ పార్టీకి మూడు, జాతీయ సమాజ్ తాంత్రిక్ దళ్ (జేఏఎస్‌ఏడీ), బికల్పధార, గణ ఫోరమ్ పార్టీలు రెండేసి స్థానాలు దక్కించుకున్నాయి. తరికత్ ఫెడరేషన్, జేపీ పార్టీలు ఒక్కో స్థానంతో సరిపెట్టుకున్నాయి. కాగా తాజా విజయంతో వరుసగా నాలుగోసారి ఎన్నికైన ప్రధానిగా షేక్ హసీనా చరిత్ర సృష్టించనున్నారు. బంగ్లాదేశ్ 11వ సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన షేక్ హసీనాకు భారత ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్‌లోని మొత్తం 350 స్థానాలకు గానూ హసీనా నేతృత్వంలోని మహాకూటమి 288 స్థానాలు కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ట్విటర్లో స్పందిస్తూ షేక్ హసీనాతో మాట్లాడాను. బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆమెకు అభినందనలు తెలిపాను. వచ్చే హయాంలో కూడా ఆమె పాలన విజయవంతగా సాగాలని శుభాకాంక్షలు చెప్పానని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ అభివృద్ధి కోసం కలిసి పనిచేసేందుకు, ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకునేందుకు భారత్ కట్టుబడి ఉన్నట్టు ప్రధాని స్పష్టం చేశారు. కాగా బంగ్లాదేశ్ ప్రధానిగా షేక్ హసీనా బాధ్యతలు చేపట్టడం వరుసగా ఇది నాలుగోసారి.



ట్రిపుల్ తలాక్ బిల్లుపై మెహబూబా ముఫ్తీ సంచలన వ్యాఖ్యలు



శ్రీనగర్: నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ట్రిపుల్ తలాక్ బిల్లుపై జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ బిల్లును తీసుకురావడం ద్వారా బీజేపీ తమ ఇళ్లలోకి చొరబడుతోందంటూ మండపడ్డారు. ట్రిపుల్ తలాక్ బిల్లు తమ కుటుంబ జీవితాల్లో కూడా చిచ్చు పెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లు ఇవాళ రాజ్యసభలో ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మెహబూబా ముఫ్తీ స్పందిస్తూ ట్రిపుల్ తలాక్ బిల్లును తేవడం ద్వారా వాళ్లు (బీజేపీ) మా ఇళ్లలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది మా కుటుంబ జీవితాల్లో కూడా కలతలు రేపుతుంది. మహిళలకు, పురుషులకు కూడా ఆర్థికంగా మరిన్ని కష్టాలు తప్పవు. విడాకుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న వారిలో నేను కూడా ఉన్నాను. వివాహం విఫలమైన తర్వాత మహిళలకు ఆర్థిక సమస్యలే పెను సవాలుగా నిలుస్తాయి.. అని ఆమె పేర్కొన్నారు. కాగా ముస్లింలకు రిజర్వేషన్ల విషయంలో బీజేపీకి గుర్తుకొచ్చిన మతం... ట్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో ఎందుకు గుర్తురాలేదని ముఫ్తీ కేంద్రాన్ని నిలదీశారు. ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలని మేము అడిగినపుడు... మతపరమైన రిజర్వేషన్లు కుదరదంటూ బీజేపీ తిరస్కరిస్తోంది. కానీ ఇలాంటి చట్టాలు తీసుకొచ్చినప్పుడు మాత్రం పార్లమెంటు వైపు పరుగెడుతోంది.. అంటూ దుయ్యబట్టారు.

రక్షణ ఒప్పందాల్లో వా జోక్యం లేదు

రక్షణశాఖ మాజీ మంత్రి ఏకే ఆంటోని



న్యూఢిల్లీ: అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కేసులో ప్రభుత్వం అబద్ధాలు సృష్టిస్తోందని రక్షణశాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోని ఆరోపించారు. అసలు యూపీఏ హయాంలో రక్షణ ఒప్పందాల్లో సోనియాగాంధీ గానీ, రాహుల గాంధీ గానీ ఎన్నడూ జోక్యం చేసుకోలేదని ఆయన చెప్పారు. ఈ కేసులో అబద్ధాలను సృష్టించేందుకు ప్రభుత్వం, భాజపా దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నాయి. జరగని దాన్ని జరిగిందని చెబుతూ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయి. నేను రక్షణమంత్రిగా ఉన్న సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ రక్షణశాఖకు సంబంధించిన ఒప్పందాల్లో ఎన్నడూ జోక్యం చేసుకోలేదు. నిజానిజాలు తెలుసుకోకుండా రాజకీయ ప్రతీకారానికి దిగుతున్నారు అని మీడియా సమావేశంలో ఏకే ఆంటోని భాజపాపై ధ్వజమెత్తారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల ఒప్పందంలో అవకతవకలు జరిగినట్లు బయటకు రావడంతో యూపీఏ ప్రభుత్వమే సీబీఐ విచారణకు ఆదేశించిందని ఆంటోని గుర్తుచేశారు. మేం ఆ ఒప్పందాన్ని రద్దు చేసి, సదరు కంపెనీపై చర్యలు ప్రారంభించాం. కానీ మా తర్వాత అధికారంలోకి వచ్చిన భాజపా వాటిని కొనసాగించలేదు సరికదా.. అగస్టా వెస్ట్‌ల్యాండ్‌కు అనుకూలంగా మారింది అని ఆంటోని ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని దాచి పెట్టాలనుకుంటే కాంగ్రెస్ సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశిస్తుందని ప్రశ్నించారు. రఫేల్ ఒప్పందాన్ని కాంగ్రెస్ లేవనెత్తడంతో ప్రజలను దృష్టి మళ్లించేందుకే భాజపా, ప్రభుత్వం ఈ ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టారు.

జిఎస్‌టి పభావంపై మదింపు వేయలేదు

లోక్‌సభలో ప్రభుత్వం వెల్లడి



న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి), పెద్ద నోట్ల చలామణీ (డీమో) వల్ల దేశంలో కార్మికులపై పడే ప్రభావాన్ని మదింపు చేయలేదని నరేం ద్ర మోడీ ప్రభుత్వం సోమవారం లోక్ సభకు తెలియజేసింది. వ్యవసాయ, కాంట్రాక్ట్ కూలీలతో సహా సంఘటిత, అసంఘటిత రంగాలలోని కార్మికులపై ఆ రెండింటి ప్రభావం ఏమేరకు ఉం టుందనేది మదింపు వేయలేదని ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో హైదరాబాద్ ఎంపి, ఎఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ సమాధానం ఇస్తూ, ఆ విధమైన మదింపు వేయనట్లు తెలియజేశారు. అయితే, ఎనిమిది రంగాలు - తయారీ, నిర్మాణం, వర్తకం, రవాణా, వసతి- రెస్టారెంట్, ఐటి/బిపిఒ, విద్య, ఆరోగ్య రంగాలలో త్రైమాసిక శీఘ్రు ఉపాధి సర్వేలను కా ర్మిక, ఉపాధి మంత్రిత్వశాఖలోని లేబర్ బ్యూరో నిర్వహిస్తున్నదని గంగ్వార్ తన సమాధానంలో వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థపై పెద్ద నోట్ల చలామణీ ప్రభావంపై ఎటువంటి మదింపును లేదా అధ్యయనాన్ని నిర్వహించలేదని కేంద్రం డిసెంబర్ 14న కూడా లోక్‌సభకు తెలియజేసింది. రూ. 1000, రూ. 500 నోట్ల చలామణీని రద్దు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ 2016 నవంబర్ 8న ప్రకటించిన సంగతి విదితమే. ఇది ఇలా ఉండగా, చలామణీ రద్దయిన నోట్లలో 99.3 శాతం తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు వచ్చాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆమధ్య తన వార్షిక నివేదికలో వెల్లడించింది.

మధ్యవర్తులు ఫ్యామిలీ బామ్ కావాలంటున్నారు

క్రిస్టియన్ మిషెల్ వెల్లడిస్తున్న వివరాలపై అమిత్ షా స్పందన

న్యూఢిల్లీ : అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణం కేసులో మధ్యవర్తి క్రిస్టియన్ మిషెల్ వెల్లడిస్తున్న వివరాలపై బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా స్పందించారు. మధ్యవర్తులందరూ ఫ్యామిలీ బామ్ కావాలంటున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన ఇచ్చిన నాలుగు ట్వీట్లలో మిషెల్ తరవు న్యాయవాదికి ఓ విజ్ఞప్తి చేశారు. మిషెల్, భారతదేశంలోని ఓ కుటుంబం మధ్య ఉన్న స్నేహం ఏమిటో వివరించాలని కోరారు. అగస్టా వెస్ట్‌లాండ్ కేసు జాడలు... క్రిస్టియన్ మిషెల్ రక్షణ కోసం కేకలు... శ్రీమతి గాంధీపై ప్రశ్నిస్తున్న వివరాలను క్రిస్టియన్ మిషెల్ తన న్యాయవాదికి ఎందుకు ఇచ్చారో ఎవరికైనా తెలుసా? ఆ వివరాలు నేరుగా శ్రీమతి గాంధీకి అందాలని ఆయన కోరుకున్నారా? ఎందుకు? అని ఓ ట్వీట్‌లో అమిత్ షా ప్రశ్నించారు. రెండో ట్వీట్‌లో ఆ కాగితం తనకు అందిందని మిషెల్ న్యాయవాది అంగీకరించారు. అది మందుల జాబితా అని ఆయన అనుకున్నారు. దానిని పారదర్శకంగా ఏ సందర్భంలోనైనా ఇవ్వవచ్చు. జండు బామ్, టైగర్ బామ్ గురించి విన్నాం కానీ, ప్రతి మధ్యవర్తి కోరుకుంటున్న ఈ ఫ్యామిలీ బామ్ ఏమిటబ్బా? అని పేర్కొన్నారు. మూడో ట్వీట్‌లో ఏమైనప్పటికీ, మళ్ళీ మళ్ళీ చెప్పవలసినది ఏమిటంటే, మిషెల్ తరవు న్యాయవాదికి కల కాంగ్రెస్ నేపథ్యం గురించి చెప్పాలి. ఆయనను (కాంగ్రెస్ నుంచి) బహిష్కరించడమనేది బూటకం. ఆయన మిషెల్‌కు, శ్రీమతి గాంధీకి వారధిగా కొనసాగుతున్నారు అని పేర్కొన్నారు. నాలుగో ట్వీట్‌లో దేశ ప్రయోజనాల కోసం, 2008 నాటి డాక్యుమెంట్ల గురించి మిషెల్ తరవు న్యాయవాది మనకు చెప్పాలి. స్పష్టంగా తెలిసేదేమంటే, మిషెల్‌కు, భారతదేశంలోని ఓ కుటుంబానికి మధ్య మైత్రి కాల పరీక్షకు నిలిచినది, గాఢమైనది అని పేర్కొన్నారు. క్రిస్టియన్ మిషెల్ తరవున వాదిస్తున్న న్యాయవాది అల్జో కే జోసఫ్ గతంలో యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించేవారు. మిషెల్‌ను భారతదేశానికి రప్పించిన తర్వాత ఆయన తరవున వాదనలు వినిపించేందుకు జోసఫ్ నియమితులయ్యారు. ప్రతిపక్షాలు నిలదీయడంతో జోసఫ్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు.




దీపావళి బాణసంచా సందడిలో తుపాకుల ప్రయోగాలు



న్యూఢిల్లీ : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసిన అనుమానిత ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులు తమ తుపాకులను ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు తెలుస్తోంది. దీపావళి బాణసంచా శబ్దాల నేపథ్యాన్ని తెలివిగా ఉపయోగించుకుని ఈ ప్రయోగాలు చేసినట్లు సమాచారం. డిసెంబరు 26న ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లలోని 17 చోట్ల ఎన్ఐఏ నిర్వహించిన సోదాల్లో 10 మంది అనుమానిత ఉగ్రవాదులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 12 తుపాకులు, భారీగా మందుగుండు సామగ్రి, రాకెట్ లాంఛర్, నగదు స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా పేలుళ్ళకు పాల్పడేందుకు వీరు కుట్ర పన్నుతున్నట్లు ఎన్ఐఏ ఆరోపించింది. అరెస్టయిన 10 మందిని ఎన్ఐఏ ప్రశ్నించినపుడు దారుణమైన అంశాలు వెలుగులోకి వచ్చినట్లు జాతీయ మీడియా పేర్కొంది. నవంబరు 7న జరిగిన దీపావళి సందర్భంగా ప్రజలు బాణసంచా కాల్చుతున్న నేపథ్యంలో తాము తమ తుపాకుల సామర్థ్యాన్ని పరీక్షించామని అనుమానిత ఉగ్రవాదులు తెలిపినట్లు పేర్కొంది.

రాహుల్ అడగాల్సిన ప్రశ్న ఇదే : అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ : సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అడగవలసిన ప్రశ్నను కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత అరుణ్ జైట్లీ సోమవారం చెప్పారు. ఈ కేసులో దర్యాప్తును ఎవరు ధ్వంసం చేశారు? అని అడగాలన్నారు. ముంబైలోని స్పెషల్ సీబీఐ కోర్టు సొహ్రాబుద్దీన్ కేసులో నిందితులందర్నీ నిర్దోషులుగా విడుదల చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా దర్యాప్తు సంస్థ ఈ కేసులో నిజాలను రాబట్టడం కోసం ప్రారంభం నుంచి వృత్తిపరమైన నైపుణ్యంతో దర్యాప్తు జరపలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ కేసును కొందరు రాజకీయ నేతలవైపు మళ్ళించడంపైనే దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ స్పందిస్తూ సొహ్రాబుద్దీన్‌ను ఎవరూ చంపలేదు అని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై అరుణ్ జైట్లీ ఫేస్‌బుక్ పోస్ట్‌లో స్పందించారు. దీనికి బదులుగా సొహ్రాబుద్దీన్ కేసు ఇన్వెస్టిగేషన్‌ను ఎవరు ధ్వంసం చేశారు? అని అడిగి ఉండవలసిందన్నారు. ఇది సరైన ప్రశ్న అయి ఉండేదన్నారు. దీనికి సరైన సమాధానం వచ్చి ఉండేదన్నారు.

వ్యవస్థాగత స్వాతంత్ర్యం కావాలని ఆలస్యంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న వారు తాము అధికారంలో ఉన్నపుడు సీబీఐకి ఏం చేసినదీ తీవ్రంగా ఆత్మావలోకనం చేసుకోవాలని సలహా ఇచ్చారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత హోదాలో తాను 2013 సెప్టెంబరు 27న అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు లేఖ రాశానని జైట్లీ పేర్కొన్నారు. సొహ్రాబుద్దీన్, తులసీ ప్రజాపతి, ఇష్రత్ జహాన్, రాజిందర్ రాథోర్, హరేన్ పాండ్యా కేసుల్లో దర్యాప్తు ఏ విధంగా రాజకీయమయమవుతున్నదీ వివరించినట్లు తెలిపారు.

ప్రచారాన్ని ముమ్మరం చేసిన బీజేపీ



న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో పరాభవాన్ని చవిచూసిన భారతీయ జనతా పార్టీ సార్వత్రిక ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటి నుంచే వ్యూహారచన చేస్తోంది. తక్కువ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెడుతోంది. స్థానిక పార్టీలతో కూటములకు సిద్ధమవుతోంది. ప్రచారాల్లోనూ వేగం పెంచుతోంది. ముఖ్యంగా వచ్చే 100 రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ 20 రాష్ట్రాల్లో పర్యటించి బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే ప్రధాని మోడీ సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఒడిశా, అసోంలలో పర్యటించి బహిరంగ సభల్లో ప్రసంగించారు. జనవరి 4న మోడీ మరోసారి అసోంలో పర్యటించనున్నారు. ఐదో తేదిన ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో బహిరంగ సభలో పాల్గొననున్నారు. అలా మార్చి వరకు 20 రాష్ట్రాల్లో మోదీ ప్రచారం చేపట్టనున్నారు. మరోవైపు 2014 సార్వత్రిక ఎన్నికల్లో భాజపా పోటీ చేసి ఓటమిపాలైన 123 నియోజకవర్గాలపై పార్టీ ఈసారి ప్రత్యేక దృష్టిపెట్టింది. మిషన్ 123 పేరుతో ఈ 123 నియోజకవర్గాలను 25 క్లస్టర్లుగా విభజించి.. ఒక్కో క్లస్టర్ బాధ్యతలను ఒక్కో నాయకుడికి అప్పజెప్పింది. ఇక తొలిసారి ఓటర్లను ఆకర్షించేందుకు నేషన్ విత్ నమో నెట్‌వర్క్‌ను జనవరి 12న ప్రారంభించనుంది. ఆయా ప్రాంతాల్లో అత్యంత ప్రభావవంతమైన యువకులను గుర్తించి వారి ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేయనుంది. దీంతో పాటు భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా బూత్ స్థాయిలో కార్యకర్తలను బలోపేతం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇక జనవరి 11, 12 తేదీల్లో ఢిల్లీ వేదికగా పార్టీ నేషనల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. దాదావు 15000 మంది భాజపా నేతలు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

జిల్లా స్థాయి కార్యకర్తలను కూడా ఈ సమావేశానికి ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ పథకాలే ఎజెండాగా భాజపా ప్రచారాలను ముమ్మరం చేస్తోంది. మరి ఓటర్లు తీర్పు ఏమిటో ఫలితాల వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

కోహ్లీసేనతో వన్డే సిరీస్‌కు ఆ ముగ్గురు దూరం



మెల్‌బోర్న్ : టీమిండియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్లు పాట్ కమిన్స్, మిచెల్ మార్ష్, జోస్ హేజిల్‌వుడ్ దూరమయ్యారు. 2019లో ఎక్కువ క్రికెట్ ఆడాల్సి ఉండటంతో వీరి పని భారాన్ని తగ్గించాలని క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయించింది. కోహ్లీసేనతో జరిగిన బాక్సింగ్ డే టెస్టులో కమిన్స్ బ్యాటు, బంతితో అద్భుత ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. ముగ్గురు బౌలర్లకు విశ్రాంతినిస్తే ఆటగాళ్ల ఎంపికలో ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆ జట్టు కోచ్ జస్టిన్ లాంగర్ అన్నాడు. జనవరి 12 నుంచి మూడు వన్డేల సిరీస్ ఆరంభం కానుంది. ఎవరిని ఎంపిక చేయాలో గందరగోళంగా ఉంది. మా బౌలర్ల పనిభారాన్ని పర్యవేక్షించాల్సి ఉంది. ఆ ముగ్గురికి వన్డే సిరీస్‌లో విశ్రాంతినిస్తే తర్వాతి రెండు టెస్టులకు ఉత్సాహంగా ఉంచగలం. కమిన్స్ అద్భుతంగా ఆడాడు. ప్రతి మ్యాచ్‌కు అతడిని ఎందుకు ఎంపిక చేయరని మీరు ప్రశ్నిస్తారు? కానీ మనకు వచ్చే ఏడాది ప్రపంచకప్, యాషెస్ ఉన్నాయి. అందుకే కమిన్స్‌ను ఉల్లాసంగా, తాజాగా ఉంచడం మా బాధ్యత అని లాంగర్ పేర్కొన్నాడు. 2019లో బిజీ షెడ్యూల్ కారణంగా కమిన్స్ ఐపీఎల్‌కూ దూరంగా ఉంటున్నాడు.

అగ్రస్థానంతో కొత్త సవంత్సరంలోకి కోహ్లీ



దుబాయ్ : టీమిండియా సారథి విరాట్ కోహ్లీ 2018 ఏడాదిని ఘనంగా ముగించాడు. మైదానంలో పరుగుల వరద పారించాడు. శతకాల జోరు కొనసాగించాడు. తాజాగా ఐసీసీ ప్రకటించిన టెస్టు బ్యాటింగ్ ర్యాంకుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అత్యుత్తమ ర్యాంకుతో ఏడాదిని ముగించాడు. మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విలువైన 82 పరుగులు చేసినా అతడి ఖాతాలో మూడు రేటింగ్ పాయింట్లు తగ్గాయి. అయినప్పటికీ రెండో ర్యాంకులోని కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్) కన్నా 34 రేటింగ్ పాయింట్లు ఎక్కువగానే ఉండటం గమనార్హం. 135 రోజులుగా విరాట్ నంబర్ వన్ స్థానంలో కొనసాగడం విశేషం. ఈ ఏడాది అతడు 1322 పరుగులు సాధించాడు. ఇక టీమిండియా నయావాల్ ఛతేశ్వర్ పుజారా నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ 10 స్థానాలు మెరుగై 38వ ర్యాంకులో ఉన్నాడు. మెల్‌బోర్న్‌లో అరంగేట్రం చేసిన మయాంక్ అగర్వాల్ 76, 42 పరుగులతో నిలిచి 67వ ర్యాంకుతో జాబితాలో ప్రవేశించాడు. బౌలర్ల జాబితాలో దక్షిణాఫ్రికా యువ కెరటం రబాడ అగ్రస్థానంలో ఉన్నాడు. 178 రోజులుగా అతడు ఈ ర్యాంకులో కొనసాగుతుండటం గమనార్హం. ఈ ఏడాది 10 టెస్టుల్లో 52 వికెట్లు తీశాడు. మెల్‌బోర్న్‌లో 9/86తో కెరీర్ అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన యువ పేసర్ జస్ప్రీత్ బుమ్రా 28వ నుంచి 12వ స్థానానికి ఎగబాకాడు. మహ్మద్ షమి 23వ ర్యాంకులో ఉన్నాడు. ఆసీస్ బౌలర్ కమిన్స్ ఐదు స్థానాలు మెరుగుపరుచుకొని కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంకు మూడు సాధించాడు. రవీంద్రజడేజా 6, అశ్విన్ 8 ర్యాంకుల్లో ఉన్నారు.

తండ్రి మరణ వార్త తెలిసినా.. మ్యాచ్ ఆడిన రషీద్ ఖాన్



మెల్‌బోర్న్ : అఫ్గానిస్తాన్ సంచలనం రషీద్ ఖాన్ క్రీడాస్ఫూర్తిని చాటాడు. తండ్రి మరణ వార్త తెలిసి కూడా తన ఆటను కొనసాగించి.. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ప్రస్తుతం బిగ్‌బిష్ లీగ్ ఆడుతున్న రషీద్.. అడిలైడ్ స్ట్రైకర్స్ జట్టు తరవున సోమవారం సిడ్నీ థండర్స్‌తో జరిగిన మ్యాచ్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అయితే ఆదివారమే రషీద్ తండ్రి మరణించాడు. ఈ విషాదకర వార్త తెలిసినా కూడా రషీద్ బాధను దిగమింగుతూ.. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చాడు. ఇక తన తండ్రి చనిపోయిన విషయాన్ని రషిదేనా జీవితంలో ముఖ్యమైన వ్యక్తిని కోల్పోయా అని ట్వీట్ చేయగా.. తండ్రి మరణ వార్త తెలిసి కూడా రషీద్ మ్యాచ్ ఆడటానికి సిద్ధపడ్డాడని అడిలైడ్ స్ట్రైకర్స్ పేర్కొంది. ఈ విజయాన్ని రషీద్ కుటుంబానికి అంకితం చేస్తున్నట్లు అడిలైడ్ స్ట్రైకర్స్ ఆటగాడు పీటర్ సిడిల్ పేర్కొన్నాడు. ఇక ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరవున భారత అభిమానులకు, ముఖ్యంగా హైదరాబాద్ నగరవాసులకు రషీద్ దగ్గరైన విషయం తెలిసిందే. రషీద్ తండ్రి మరణవార్తపై

తండ్రిగా రోహిత్‌కు ప్రమోషన్



న్యూఢిల్లీ : భారత క్రికెటర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ తండ్రయ్యారు. ఆయన సతీమణి రితికా సజ్దే పండంటి పాపకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని రితిక బంధువు సీమాఖాన్(నిర్మాత సొహైల్ ఖాన్ భార్య) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ ఆడుతున్న రోహిత్ శర్మ తన బుజ్జి పాపాయిని, భార్యను చూసేందుకు భారత్‌కు తిరుగుపయనమయ్యారు. 2015 డిసెంబరు 13న రోహిత్ తన స్నేహితురాలు, మేనేజర్ రితికాను వివాహం చేసుకున్నారు. ఇటీవల ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖెల్ క్లార్క్‌తో జరిపిన ఛాట్‌లో రోహిత్ తాను త్వరలో తండ్రవబోతున్న విషయాన్ని తొలిసారిగా వెల్లడించారు. తాజాగా ముంబయిలోని ఓ ఆసుపత్రిలో రితికా పాపకు జన్మనిచ్చారు. కాగా.. త్వరలో ఆస్ట్రేలియాతో జరగబోయే నాలుగో టెస్టుకు రోహిత్ దూరమయ్యాడు. ప్రస్తుతం అతడు భారత్‌కు బయల్దేరాడని, నాలుగో టెస్టుకు ఆడట్లేదని బీసీసీఐ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా నాలుగో టెస్టు జరగనుంది. నాలుగు టెస్టుల సిరీస్‌లో టీమిండియా 2-1తో ఆధిక్యంలో ఉంది.

ఐసీసీ టీ20 కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్



దుబాయ్ : భారత మహిళా క్రికెటర్ హర్మన్ ప్రీత్ కౌర్ అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) టీ20 కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఈ ఏడాదికిగాను అత్యుత్తమ మహిళా క్రికెట్ జట్లను ఐసీసీ ఎంపిక చేయగా, అందులో టీ 20 విభాగంలో హర్మన్ ప్రీత్ కెప్టెన్‌గా నియమించబడ్డారు. ఈ మేరకు సోమవారం అత్యుత్తమ మహిళా వన్డే, టీ20 జట్లను ఐసీసీ ప్రకటించింది. టీ 20 ఫార్మాట్‌లో భారత్ నుంచి హర్మన్‌తో పాటు స్మృతి మంధాన, పూనమ్ యాదవ్‌లకు చోటు దక్కింది. ఇక వన్డే విభాగంలో భారత్ నుంచి స్మృతి మంధాన, పూనమ్ యాదవ్‌లకు మాత్రమే స్థానం దక్కగా, కెప్టెన్‌గా న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ నియమించబడ్డారు. 2018గాను క్రీడాకారిణుల ప్రదర్శనలో భాగంగా మీడియా-బ్రాడ్‌కాస్టర్స్ సభ్యులతో కూడిన బృందం విడివిడిగా రెండు అత్యుత్తమ జట్లను ఓటింగ్ ద్వారా ఎన్నుకుంది. నవంబర్‌లో జరిగిన ఐసీసీ మహిళల వరల్డ్ టీ20లో భారత జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరడంలో హర్మన్ ప్రీత్ కీలక పాత్ర పోషించారు. ఆ టోర్నమెంట్‌లో కౌర్ 160.5 స్ట్రైక్‌రేట్‌తో 183 పరుగులు చేశారు. 2018లో హర్మన్ ప్రీత్ 25 టీ20 మ్యాచ్‌లుఆడి 126.1 స్ట్రైక్‌రేట్‌తో 663 పరుగులు సాధించారు. మరొకవైపు ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో కౌర్ మూడో స్థానంలో కొనసాగుతున్నారు.

ఐసీసీ మహిళా టీ20 జట్టు: హర్మన్ ప్రీత్ కౌర్(కెప్టెన్, భారత్), స్మృతి మంధాన(భారత్), అలైస్సా హేలీ(ఆస్ట్రేలియా, వికెట్ కీపర్), సుజీ బేట్స్(న్యూజిలాండ్), నాటేటీ స్కీవర్(ఇంగ్లండ్), ఎలైసె పెర్రీ(ఆస్ట్రేలియా), అష్లే గార్డనర్ (ఆస్ట్రేలియా), కాస్పెర్క్(న్యూజిలాండ్), మెగాన్ స్కట్(ఆస్ట్రేలియా), రుమానా అహ్మద్(బంగ్లాదేశ్), పూనమ్ యాదవ్(భారత్)

ఐసీసీ వన్డే జట్టు: సుజీ బేట్స్(కెప్టెన్, న్యూజిలాండ్), స్మృతి మంధాన, టామీ బీమౌంట్(ఇంగ్లండ్), డేన్‌వాన్ నీకెర్క్(దక్షిణాఫ్రికా), సోఫీ డివైన్(న్యూజిలాండ్), అలైస్సా హేలీ(వికెట్ కీపర్, ఆస్ట్రేలియా), మారింజన్నే కాప్(దక్షిణాఫ్రికా), డాటిన్(వెస్టిండీస్), సానా మిర్(పాకిస్తాన్), సోఫీ ఎక్లేస్టోన్(ఇంగ్లండ్), పూనమ్ యాదవ్(భారత్).

స్మృతి మంధాన అరుదైన ఘనత

- ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ -స్మృతి మంధాన
- రాచెల్ హీహెూయ్-ఫ్లింట్ అవార్డు కూడా...



దుబాయ్ : ఈ ఏడాదికిగాను భారత మహిళా జట్టు క్రికెటర్ స్మృతి మంధాన వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌తో పాటు వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది అద్భుతంగా రాణించిన మంధాన ఒక క్యాలెండర్ ఇయర్‌లో రెండు ఐసీసీ అవార్డులను దక్కించుకున్న తొలి భారత మహిళా క్రికెటర్‌గా అరుదైన రికార్డును నెలకొల్పారు. ఈ జాబితాలో న్యూజిలాండ్ జట్టుకు చెందిన సోఫీ దివైన్, పాకిస్థాన్ బౌలర్ సనా మీర్ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ప్రధానంగా వెస్టిండీస్‌లో మహిళా వరల్డ్ టీ20ల్లో భారత్ సెమీ ఫైనల్ చేరడంలో మంధాన కీలక పాత్ర పోషించారు. ఆ టోర్నీలో 125పైగా స్ట్రైక్‌రేట్‌తో 178 పరుగులు సాధించారు. ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న మంధాన ఓవరాల్‌గా 1291 పరుగులు చేశారు. 12 వన్డేలకు గాను 669 పరుగులు సాధించిన మంధాన.. 25 టీ20ల్లో 622 పరుగులు చేశారు. ఈ ఏడాది వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఐదు హాఫ్ సెంచరీలు సాధించడం మరో విశేషం. అదే సమయంలో ఐసీసీ ప్రకటించిన అత్యుత్తమ వన్డే, టీ20 జట్లలో కూడా మంధాన చోటు దక్కించుకున్నారు. దాంతో ఏక కాలంలో రెండు ఐసీసీ అవార్డులు మంధాన సొంతమయ్యాయి. 2018 ప్రదర్శనలో భాగంగా మీడియా-బ్రాడ్‌కాస్టర్స్ సభ్యులతో కూడిన బృందం ఓటింగ్ పద్ధతిలో అత్యుత్తమ క్రీడాకారిణులను ఎన్నుకోవడంతో పాటు రెండు అత్యుత్తమ జట్లను ఎంపిక చేశారు. ఈ మేరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) సోమవారం తన అధికారిక ట్విట్టర్‌లో వివరాలను వెల్లడించింది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044